ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 06.04.2026 | సంపుటి :12 సంచిక : 257 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## హైదరాబాద్‌లో భూ కుంభకోణం

- నాదర్‌గుల్ భూములు.. రేవంత్ అధికారంలోకి వచ్చాకే కబ్జాలు
- హరీశ్ ఆరోపణలు

**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దళితుల భూములను గద్దల్లా తన్నుకుపోతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్ భూముల స్కామ్‌లో ప్రభుత్వ పెద్దలు భాగస్వాములుగా ఉన్నారని ఆరోపించారు. ఈ భూ కుంభకోణం విలువ సుమారు రూ.7 వేల కోట్లు ఉంటుందని చెప్పారు."వైఎస్ డిక్లేర్ చేసిన ప్రభుత్వ భూములను కేసీఆర్ కాపాడితే.. రేవంత్‌రెడ్డి భక్షిస్తున్నారు. ఈ వివాదాస్పద భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టింది. మా ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు కూడా సమర్థించింది. ప్రస్తుతం భూభారతిలోనూ ప్రభుత్వ భూములుగానే చూపిస్తోంది. వీటిని కేసీఆర్ హయాంలో ఎవరూ కబ్జా

మిగతా 2లో..

## పౌరహక్కులు కాపాడేది
# న్యాయవ్యవస్థే



## డైనమిక్ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో పాలన కొనసాగుతోంది

- హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన
- కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్, హైకోర్టు సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్
- ఈ ప్రాజెక్టు ఓ గొప్ప అవకాశం.. హైకోర్టు భవన నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొనడం సంతోషంగా ఉంది : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

జ్యుడీషియరీ వ్యవస్థ నిర్మాణంలో సానుకూల దృక్పథంతో సాగుతున్నారు. ప్రతి రాష్ట్రానికి హైకోర్టు ఏర్పాటు అనేది రాజ్యాంగ బాధ్యత. కోర్టు ఏర్పాటు న్యాయ అవసరమే కాదు, నిబద్ధతతో ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఆధ్వర్యంలో జోన్ -1 నిర్మాణం బాగా జరుగుతోంది. జ్యుడీషియరీ, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా ముందుకు వెళ్లాల్సి ఉంది. వందేళ్ల అవసరాలకు తగిన విధంగా మౌలిక సౌకర్యాల కల్పన తప్పనిసరి.
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

**హైదరాబాద్(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ వద్ద కొత్తగా నిర్మిస్తున్న హైకోర్టు రెండో జోన్ భవన నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శంకుస్థాపన చేసే ప్రదేశానికి చేరుకున్న జస్టిస్ సూర్యకాంత్‌కు రేవంత్ రెడ్డి సహా న్యాయమూర్తులు, అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు సీజేఐ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం భవన నిర్మాణానికి సంబంధించిన నమూనాలను పరిశీలించారు. నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేద పండితుల సమక్షంలో జరిపిన శంకుస్థాపన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడారు. దాదాపు 23 ఏళ్ల సుదీర్ఘ కాలంగా న్యాయ వ్యవస్థలో పనిచేస్తున్నానని పేర్కొన్నారు. ఇప్పటికే హైకోర్టు జోన్-1 భవన కాంప్లెక్స్ నిర్మాణంలో ఉందని, ప్రస్తుతం హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు

మిగతా 2లో..

## క్రీడల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం

- జాతీయ స్థాయిలో పోలీసులకు పోటీలు నిర్వహించడం సంతోషకరం
- ఈ టోర్నీకి బీఎన్ మల్లిక్ పేరు పెట్టడం చాలా గొప్ప నిర్ణయం
- ఒలింపిక్స్ పతకాల గెలుపులో మనం చాలా చిన్న దేశాలకంటే వెనుకబడి ఉన్నాం
- 'ఆల్ ఇండియా పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్' ముగింపు వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

వార్త 2 లో



### ముంపు గ్రామాలు
## మాకిచ్చేయండి

- ఆ గ్రామాలను తెలంగాణలో కలపండి..
- పాలనా సౌలభ్యం కోసం వీటిని భద్రాచలంలో చేర్చండి
- ఈ పార్లమెంటు సమావేశాల్లోనే విలీనం బిల్లు పెట్టేలా చూడండి.. అమిత్ షాకు మంత్రి తుమ్మల లేఖ

**హైదరాబాద్(జనంసాక్షి):** కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. భద్రాచలం పక్కనున్న 5 గ్రామాలను తెలంగాణలో కలపాలని అందులో కోరారు. పాలనా సౌలభ్యం కోసం వీటిని భద్రాచలంలో కలపాలన్నారు. ఐదు గ్రామాలను కలిపితేనే గిరిజనుల సమస్యలు తొలగుతాయని పేర్కొన్నారు. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే విలీనం బిల్లు పెట్టేలా చూడాలని కోరారు.



### లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పెంపు..
## ప్రజల దృష్టి మరల్చే ఆయుధమే



### తప్పుదోవ పట్టించడంలో మోదీ అనుభవాన్ని గడించారు : కాంగ్రెస్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలను పెంచాలనే ప్రతిపాదనను 'ప్రజల దృష్టి మరల్చే ఆయుధం'గా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయోగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. భారీ విస్తీర్ణం, అధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు

మిగతా 2లో..

### మేం అధికారంలోకి వచ్చాక అస్సాం ముఖ్యమంత్రిపై
## చట్టపరమైన చర్యలు

### క్షమాపణలు చెప్పినా.. ఆయన్ను వదిలిపెట్టం: రాహుల్ గాంధీ



**గహౌతి(జనంసాక్షి):** అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ క్షమాపణలు కోరినా.. ఆయన్ను వదిలిపెట్టబోమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అస్సాంలోని బిశ్వనాథ్ చరియాలీలో నిర్వహించిన ప్రచార సభలో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. హిమంతను దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రిగా అభివర్ణించారు."అస్సాంకు చెందిన దివంగత గాయకుడు జుబిన్ గార్గ్.. రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదు. మా పార్టీ భావజాలం కూడా అలాంటిదే. ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే మా సిద్ధాంతం. మేం అధికారంలోకి వస్తే.. జుబిన్ మృతి కేసులో నిందితులను 100 రోజుల్లోగా శిక్షిస్తాం" అని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఆరు సామాజిక వర్గాలకు ఎస్టీ హోదా ఇస్తామని, తేయాకు కూలీలకు రోజుకు రూ.450 చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.హిమంత నేతృత్వంలోని భాజపా సర్కారు ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్ద ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని భాజపా ఏటీఎంలా మార్చేశారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పుడు హిమంత క్షమాపణలు కోరినా.. ఆయనపై చర్యలు తప్పవని చెప్పారు.

### మాకివ్వాల్సిన క్షిపణులను అమెరికా ఇరాన్‌పై వాడుతోంది : జెలెన్‌స్కీ

2లో..

### హర్మ్యూజ్ జలసంధి తెరవకపోతే మౌలిక సదుపాయాలను
# విధ్వంసం చేస్తాం

### విద్యుత్ ప్లాంట్లు వంతెనలు కూల్చేస్తాం.. ట్రంప్ హెచ్చరిక

- భయపడని ఇరాన్.. దీటుగా దాడులు
- కువైట్‌పై క్షిపణులతో విరుచుకుపడ్డ ఐఆర్‌జీసీ
- యుద్ధవిమానం కూలిపోయి ఇరాన్‌లో చిక్కుకుపోయిన రెండో మా పైలట్‌ను కూడా రక్షించాం : ట్రంప్
- పైలట్ కోసం వచ్చిన విమానాన్ని కూల్చివేశాం : ఇరాన్ - అమెరికా, ఇజ్రాయెల్‌కు బిగ్ సర్‌ప్రైజ్ ఇస్తామని వెల్లడి



**టెహ్రాన్(జనంసాక్షి):** ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. హర్మ్యూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని హెచ్చరించారు. లేదంటే మరో రెండు రోజుల్లో విద్యుత్ ప్లాంట్లు, వంతెనలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని, తీవ్ర పర్యవసానాలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలో ఇరాన్‌పై తీవ్ర పదజాలంతో మండిపడ్డారు. తీవ్రంగా గాయపడిన తమ ఎఫ్-15 యుద్ధ విమాన సిబ్బందిని ఇరాన్‌లోని పర్వత ప్రాంతాల నుంచి రక్షించామని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. పగటిపూటే.. దాదాపు ఏడు గంటలపాటు శ్రమించి ఈ రెస్క్యూ ఆపరేషన్ చేశామన్నారు.

మిగతా 2లో..







## హర్మ్యూజ్‌ను దాటిన 'గ్రీన్ ఆశా'

**టెహ్రాన్(జనంసాక్షి):** గల్ఫ్ నుంచి భారీ ఎల్పీజీ లోడ్‌తో భారత్‌కు బయల్దేరిన మరో నౌక 'గ్రీన్ ఆశా' హర్మ్యూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. మరికొన్ని రోజుల్లో ఇక్కడికి చేరుకోనుంది. హర్మ్యూజ్‌ను సురక్షితంగా దాటి వచ్చిన తొమ్మిదో భారత నౌక ఇది. జలసంధి నుంచి ఇప్పటివరకు భారత జెండాతో ఎనిమిది నౌకలు సురక్షితంగా హర్మ్యూజ్ దాటి వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెండు ఎల్పీజీ నౌకలు గత రెండు రోజుల్లో హర్మ్యూజ్‌ను దాటాయని అధికారులు పేర్కొన్నారు. ఇవి రెండు కలిపి 94 వేల టన్నుల ఎల్పీజీని తీసుకొస్తున్నాయని, ఈ నెల 31న ఓ నౌక ముంబయికి, ఏప్రిల్ 1న మరొకటి న్యూ మంగళూరుకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికి భారత జెండా కలిగిన నౌకలను స్వదేశానికి తీసుకురావడానికే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఇదీ చదవండి: అమెరికాకు మరో షాక్.. రెస్క్యూ విమానం కూల్చేసినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది

### కేరళలో ఎన్‌డీఏ ప్రభుత్వ ఏర్పాటుకు
## సమయం ఆసన్నమైంది

- కేరళ యువతకు సరైన ఉద్యోగాలు లేవు
- ఫలితంగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు
- కున్నతునాడు నియోజకవర్గంలో అమిత్ షా వ్యాఖ్యలు



**తిరువనంతపురం(జనంసాక్షి):** కేరళలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచారం ఊపందుకుంది. ఈ అసెంబ్లీ ఎన్నికలు కేవలం ప్రభుత్వాన్ని మార్చడానికి మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తును మెరుగుపరచడానికేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత కేరళలో ఎన్‌డీఏ ఓట్లు పెరిగాయని, కూటమి ప్రభుత్వం అధికా రంలోకి రావడానికి ఇది అనువైన సమయమని పేర్కొన్నారు. అయితే, కేరళలో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలు

మిగతా 2లో..



## బీఆర్ఎస్‌లోకి వెళ్లే ప్రసక్తేలేదు

### పిచ్చి ప్రచారాలు మానుకోండి : ఎంపీ ఈటల

**హైదరాబాద్(జనంసాక్షి):** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. శామీర్‌పేటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఎలాంటి తప్పు చేయకున్నా మెడలు పట్టి బయటకు గెంటేసిన బీఆర్ఎస్ పార్టీలోకి మళ్లీ వెళ్తున్నానని పిచ్చి ప్రచారాలు చేస్తున్న

మిగతా 2లో..

### 'సర్'కు వ్యతిరేకంగా
## ఓటు వేయండి

- ప్రజలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పిలుపు
- ఎస్ఐఆర్‌లో పేర్లు తొలగించడంపై ఆగ్రహం



**కోల్‌కతా(జనంసాక్షి):** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అనేక మంది పేర్లు తొలగించారని ఆరోపించారు. అయితే, ప్రజల పేర్లను తొలగించినందుకు ప్రతీకారం తీర్చుకోవడానికి, అలాగే ఎస్ఐఅర్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ఫలితాల్లోనే మీ ప్రతిస్పందన కనిపించాలన్నారు. అలాగే ఎస్ఐఆర్‌లో పేర్లు గల్లంతైన వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మమతా సూచించారు. ముర్షిదాబాద్‌లోని సంషేర్‌గంజ్ జరిగిన ఎన్నికల సభలో మమతా బెనర్జీ ఈ మేరకు వ్యాఖ్యానించారు.ఓటర్ల జాబితా తొలగింపునకు

మిగతా 2లో..

# బెంగాల్‌లో అధికారంలోకొస్తాం

### బీజేపీ మహావిజయంతో ప్రజల్లో భరోసా పెరుగుతుంది • మోదీ ధీమా

**కోల్‌కతా(జనంసాక్షి):** బంగాల్‌లో ఈసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత బంగాల్ నుంచి భయం పారిపోతుందన్నారు. కూచ్ బెహార్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ప్రధాని మోదీ, టీఎంసీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో ఇతర ప్రాంతాల వారికి ఉపాధి కల్పించిన బంగాల్‌ను టీఎంసీ సర్కార్ వలసలకు కేంద్రంగా మార్చిందని దుయ్యబట్టారు. బంగాల్‌లో శాంతిభద్రతలకు అంతిమ యాత్ర నిర్వహించేందుకు టీఎంసీ కంకణం కట్టుకుందని ప్రధాని విమర్శించారు.ఈ ఎన్నికలు అధికార పక్షం వ్యాపింపజేస్తున్న భయం, బీజేపీ కల్పిస్తున్న భరోసా మధ్య పోరుగా ప్రధాని మోదీ అభివర్ణించారు. టీఎంసీ బుజ్జగింపు రాజకీయాల కారణంగా గ్రేట్ బంగాల్ తన గుర్తింపు కోల్పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చొరబాటుదారులను రక్షించేందుకు టీఎంసీ అడ్డుకుంటోందని ఆరోపించారు. బంగాల్



సరిహద్దు ప్రాంతాల్లో జనాభా మార్పు ప్రమాదకరంగా ఉన్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఎన్నికల తర్వాత టీఎంసీ పాపాల లెక్క తేల్చటమే కాకుండా బాధ్యులైన వారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ఎన్నికల సంఘంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఎన్నికలు భయం లేకుండా స్వేచ్ఛగా, న్యాయంగా జరుగుతాయని ప్రధాని మోదీ తెలిపారు.

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
06.04.2026

## లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పెంపు.. ప్రజల దృష్టి మరల్చే ఆయుధమే

అదనపు ప్రయోజనాన్ని కలిగించేందుకే ఈ బలవంతపు చర్యకు ప్రధాని సిద్ధం అవుతున్నారని మండిపడింది. ఇదంతా పెద్దసంఖ్యలో దేశ ప్రజల దృష్టిని మరల్చేందుకే చేస్తున్నారని విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్వీట్ చేశారు.

## హైదరాబాద్‌లో భూ కుంభకోణం

చేయలేదు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే కబ్జాలు మొదలయ్యాయి. నాదర్‌గుల్ భూములను కాపాడేందుకు హైడ్రా ఎందుకు రావట్లేదు? లింగమయ్య గుట్ట సహా దాదాపు 100 ఎకరాల్లో గుట్టలు ఉన్నాయి. 12 ఎకరాలు ఉన్న లింగమయ్య గుట్ట తప్ప మిగతా అన్నీ కాజేశారు. ఈ కుంభకోణంలో సీఎం రేవంత్‌రెడ్డి వాటా ఎంత? పొంగులేటి కుటుంబంపై అధికారులు చర్యలు తీసుకుంటారా? అసెంబ్లీలో వ్యాఖ్యలకు సీఎం కట్టుబడి ఉంటే చర్యలు తీసుకోవాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## 'సర్'కు వ్యతిరేకంగా ఓటు వేయండి

కేంద్ర ప్రభుత్వాన్ని పరోక్షంగా బాధ్యులుగా చూపిస్తూ మమత విమర్శించారు. ధైర్యం ఉంటే నేరుగా పోటీ చేయాలని వ్యాఖ్యానించారు. అలాగే, కొందరు బూత్ ఏజెంట్లు ప్రలోభాలకు లోనుకాకుండా పార్టీ ప్రయోజనాలను కాపాడాలని కోరారు. కొన్నిచోట్ల ఈవీఎం యంత్రాల పనితీరుపై కూడా ఆమె అనుమానాలు వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాల్లో యంత్రాలు పనిచేయకుండా చేసే ప్రయత్నాలు జరుగుతాయని ఆరోపించారు. అలాంటి సందర్భాల్లో మరమ్మతులు చేయకుండా కొత్త యంత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేయాలని కార్యకర్తలను ఆదేశించారు.
'వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిలిచా' ముస్లింల ప్రయోజనాల కోసం తాను పోరాడుతున్నానని, వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిలిచినట్లు మమతా బెనర్జీ స్పష్టం చేశారు. కానీ ఈ విషయంలో బీజేపీ తనపై తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఆరోపించారు. అయితే, వక్ఫ్ చట్ట అమలుతో ముర్షిదాబాద్ జిల్లాలో జరిగిన హింసాత్మక ఘటనలను ప్రస్తావించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రాణనష్టాలు జరిగినట్లు గుర్తుచేశారు. అయితే, ఆ హింసాత్మక ఆందోళనలకు టీఎంసీ ప్రేరేపిస్తోందని బీజేపీ ఆరోపించింది. ఈ ఆరోపణలను సైతం మమతా ఖండించారు.
ఇదిలా ఉండగా, టీఎంసీ పాలనలో మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన యువతకు విద్యా అవకాశాలు పెరిగాయని మమతా పేర్కొన్నారు. వారు ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. అయితే, సమాజం పురోగమిస్తోందని, కానీ ప్రత్యర్థి పార్టీలు దాన్ని సహించలేకపోతున్నాయని మమతా తెలిపారు. టీఎంసీ వరుసగా నాలుగోసారి పదవిలోకి వస్తే, మహిళల కోసం అమలు చేస్తున్న లక్ష్మీర్ భండార్ పథకాన్ని కొనసాగిస్తామని, జీవితకాల ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నిరుద్యోగ యువత కోసం ప్రారంభించిన బంగ్లార్ యువ సాథి పథకం కింద నెలకు రూ.1500 చొప్పున సహాయం అందిస్తామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయాయని మమత పేర్కొన్నారు. ఎన్నికల సంఘం దాదాపు 500 మంది అధికారులను బదిలీ చేసిందని, ఎన్నికల తర్వాత పనులు మళ్లీ ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే, ఎన్నికల సంఘం చర్యలపై కూడా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్?ఐఆర్? పేరుతో కొంత మంది ఓటర్లను బెదిరిస్తున్నారని, మరికొందరిని తొలగిస్తున్నారని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో చొరబాటుదారుల పేర్లు ఉంటే, గతంలో ప్రధానమంత్రి, హోంమంత్రి కూడా వారి ఓట్లతోనే గెలిచారని మమతా అన్నారు. కాబట్టి వారే ముందుగా రాజీనామా చేయాలని వ్యాఖ్యానించారు. అదేవిధంగా, 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించిన జాబితానే ఈసారి ఎందుకు ఉపయోగించలేదని మమతా ప్రశ్నించారు.కాగా, బంగాల్‌లో 294 అసెంబ్లీ స్థానాలకు గానూ ఏప్రిల్ 23, 29 రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో అన్ని పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. గెలుపే లక్ష్యంగా అధికార, విపక్ష పార్టీలు పావులు కదుపుతు ముందుకు సాగుతున్నాయి.

## కేరళలో ఎన్‌డీఏ ప్రభుత్వ ఏర్పాటుకు సమయం ఆసన్నమైంది

తమకు మద్దతు అవసరమని షా నొక్కి చెప్పారు. ఎర్నాకుళం జిల్లా కున్నతునాడు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న షా, ఈ మేరకు వ్యాఖ్యానించారు."ఈ ఎన్నికలు కేవలం ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని తొలగించి ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడం కోసమే కాదు. ఇవి కేరళ భవిష్యత్తు కోసం జరుగుతున్న ఎన్నికలు. భారతదేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించిన మొట్టమొదటి రాష్ట్రం కేరళే. ఇక్కడి యువత ఎంతో ప్రతిభావంతులు, తెలివైనవారు, కానీ వారికి సరైన ఉద్యోగాలు లేవు. ఫలితంగా వారు ఉద్యోగాల కోసం ఇతర గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. అయితే, ఇకపై అలాంటి అవసరం లేకుండా ఇక్కడే వారికి ఉద్యోగాలు లభించేలా ఒక గొప్ప కేరళను నిర్మించాలని మేము ఆశిస్తున్నాం. ప్రపంచం నలుమూలలా కమ్యూనిస్టు పార్టీ కనుమరుగైపోతోంది. అలాగే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కూడా అంతరించిపోతోంది. నేడు, ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో యావత్తు దేశం ముందుకు సాగుతోంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో, కేరళ నుంచి వచ్చిన ఓట్లలో 14 శాతం ఎన్‌డీఏ కూటమికి దక్కాయి. కాబట్టి ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ మార్క్సిస్ట్ నాయకుడు పేర్లు మార్చే స్టార్టప్‌ను ప్రారంభించారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కేంద్ర నిధులతో చేపట్టిన అన్ని ప్రాజెక్టుల పేర్లు మార్చి, వాటి ఘనతను తన ఖాతాలో వేసుకుంటున్నారని ఆరోపించారు. "ప్రధాని మోదీ ప్రతి పేద వ్యక్తికీ 5 కిలోల బియ్యాన్ని అందిస్తున్నారు. అలాగే, జాతీయ రహదారి 66 నిర్మాణానికి అయ్యే ఖర్చులో 100 శాతాన్ని మోదీనే భరిస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి విజయన్ భారీ పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా, జాతీయ ఆరోగ్య మిషన్ కోసం ప్రధానమంత్రి మోదీ రూ. 600 కోట్లు పంపిస్తున్నారు, కానీ అక్కడ ఫొటోలు పెట్టుకోవడానికి స్థలం లేదన్న సాకుతో దాన్ని మూసివేశారు. నిన్న రాహుల్ గాంధీ వచ్చి పెట్రోల్ ధరలు పెరిగాయని అన్నారు. కానీ అది కేరళలో కాదు, పాకిస్తాన్‌లో" అని షా వ్యాఖ్యానించారు.మరోవైపు, తిరువనంతపురం బహిరంగ సభలోనూ అమిత్ షా మాట్లాడారు. ఈ సారి కేరళలో తమ ప్రభుత్వాన్నే ఏర్పాటు చేయబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కేరళలో ఎల్?డీఎఫ్?, యూడీఎఫ్ ఎవరు కూడా ప్రజలకు మంచి చేయలేదని, వారంతా అవినీతికి పాల్పడ్డారని షా ఆరోపించారు. కానీ, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే, శబరిమల ఆలయ బంగారు కేసులో నిందితులను జైలులో పెడతామని హామీ ఇచ్చారు. భారత్ మాతను అత్యున్నత పీఠంపై నిలపడానికే తాము రాజకీయాల్లో ఉన్నామని షా పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, 140 అసెంబ్లీ స్థానాలకు గానూ కేరళలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. అలాగే మే 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం మే 23తో ముగియనుంది. కాగా, కేరళలో అధికారంలో ఉన్న సీపీఐ(ఎం) నేతృత్వం లోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) చూస్తోంది. మరోవైపు, రాష్ట్రంలో దాదాపు దశాబ్ద కాలంగా ఎల్‌డీఎఫ్ అధికారంలో ఉంది.





# క్రీడల్లో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం

హైదరాబాద్(జనంసాక్షి): జాతీయ స్థాయిలో పోలీసులకు పోటీలు నిర్వహించడం సంతోషకరమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన 'ఆల్ ఇండియా పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్' ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న 34 పోలీసు విభాగాలు ఇందులో పాల్గొన్నాయన్నారు. ఈ టోర్నీకి బీఎన్ మల్లిక్ పేరు పెట్టడం చాలా గొప్ప నిర్ణయమని చెప్పారు. పోలీసు స్పైగా బీఎన్ మల్లిక్ దేశానికి గొప్ప సేవలు అందించారని తెలిపారు."ఒలింపిక్స్ పతకాల గెలుపులో మనం చాలా చిన్న దేశాలకంటే వెనుకబడి ఉన్నాం. దేశంలో యువతకు సరైన క్రీడా సదుపాయాలు లేవు. సదుపాయాల కల్పనపై అధ్యయనం కోసం దక్షిణ కొరియాలో పర్యటించాం. తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలపాలని నిర్ణయించుకున్నాం. అంతర్జాతీయ క్రీడా ప్రమాణాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. వివిధ క్రీడల్లోని ప్రముఖులను ఇందులో భాగస్వాములను చేశాం. తెలంగాణ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది. బాక్సర్ నిఖత్ జరీన్‌కు రూ.2



కోట్లు ఇచ్చి ప్రోత్సహించాం. క్రికెటర్ సిరాజ్‌కు రూ. కోటి, ఇంటి స్థలం ఇచ్చి సత్కరించాం.. డీఎస్పీ ఉద్యోగం ఇచ్చాం. క్రీడల్లో రాణించాల్సిన యువత మత్తుబారిన పడటం బాధాకరం. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో యువత డ్రగ్స్ బారినపడి జీవితాలు నాశనం చేసుకున్నారు. ఇటీవల కాలంలో హైదరాబాద్‌లో కూడా డ్రగ్స్ కల్చర్ పెరిగింది. హైదరాబాద్ పోలీసులు సైబర్ నేరాలు, డ్రగ్స్ కట్టడిలో ముందున్నారు" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## పౌరహక్కులు కాపాడేది న్యాయవ్యవస్థే

శంకుస్థాపన చేసుకున్నామని గుర్తు చేశారు. కోర్టులో జరుగుతున్న ప్రొసీడింగ్స్ అనేవి ప్రజలకు విజిబుల్ జ్యుడీషియరీ అని, కోర్టు గది వెనక మరో ప్రపంచం ఉంటుందని తెలిపారు. కోర్టు కార్యకలాపాలు కొనసాగుతూనే ఉంటాయని, జడ్జిల నివాస సముదాయాల్లో కార్యకలాపాలు నడుస్తూనే ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు నిర్మాణ పనులు చేపడుతున్న ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. డైనమిక్ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాలన కొనసాగుతోందని కితాబిచ్చారు.
ఈ ప్రాజెక్టు ఓ గొప్ప అవకాశం : హైకోర్టు భవన నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొనడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ నాయకుల జీవితాల్లో ఇలాంటి సందర్భం అరుదుగా వస్తుందన్నారు. ప్రార్థనా మందిరాల నిర్మాణంలో పాల్గొనడం అరుదుగా వస్తుందని, హైకోర్టు కాంప్లెక్స్ అనేది అన్ని వర్గాల ప్రజలకు ఆలయం వంటిదని వ్యాఖ్యానించారు. లెజిస్లేచర్, ఎగ్జిక్యూటివ్, జ్యుడీషియరీ వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేస్తాయన్న సీఎం, సామాన్య ప్రజలు న్యాయం కోసం చివరగా కోర్టు తలుపు తడతారన్నారు. హైకోర్టు కాంప్లెక్స్ ప్రాజెక్టు చేపట్టడం తనకు, తమ ప్రభుత్వానికి గొప్ప అవకాశంగా భావిస్తున్నానని స్పష్టం చేశారు.

## ఖానాపూర్ మున్సిపాలిటీ భాజపాదే

- బీఆర్‌ఎస్ మద్దతుతో పీఠం దక్కించుకున్న కాషాయపార్టీ
- మున్సిపల్ ఛైర్మన్‌గా అంకం మౌనిక, వైస్ ఛైర్మన్‌గా బీఆర్‌ఎస్ అభ్యర్థి మహమ్మద్ షోయబ్

ఖానాపూర్(జనంసాక్షి): నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ పదవి బీజేపీ కైవసం చేసుకుంది. ఘర్షణలతో శనివారం వాయిదా పడిన ఎన్నిక, ఇవాళ రాజకీయ పరిణామాల మధ్య భారతీయ జనతా పార్టీ చేజిక్కించుకుంది. ఖానాపూర్ మున్సిపాలిటీని బీఆర్‌ఎస్ సాయంతో సొంతం చేసుకుంది. బీజేపీ నుంచి అంకం మౌనిక ఛైర్?పర్సన్?గా, బీఆర్?ఎస్? నుంచి మహ్మద్ షోయబ్ వైస్ ఛైర్మన్?గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జీవరత్నం ప్రకటించారు.నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక శనివారం జరగాల్సి ఉంది. ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. మరోవైపు మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ, బీఆర్‌ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 12 కౌన్సిలర్ స్థానాలు ఉన్నాయి. ఇటీవల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 4, బీజేపీ 4, కాంగ్రెస్ 3, స్వతంత్రులు ఒకరు గెలుపొందారు.స్వతంత్ర అభ్యర్థి, ఎక్స్ అఫీషియో ఓటుతో కాంగ్రెస్ బలం ఐదుకు చేరింది. ముందుగా ఛైర్‌పర్సన్ ఎన్నిక వేళ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి మౌనిక పేరును అధికారులు ప్రతిపాదించారు. దీనిపై ఎమ్మెల్యే బొజ్జు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందుగా బీజేపీ అభ్యర్థి పేరు ఎలా ప్రతిపాదిస్తారంటూ ఆందోళనకు దిగారు. ఈ గందరగోళం నడమే ఛైర్మన్ ఎన్నికను అధికారులు ఆదివారానికి వాయిదా వేశారు. దీంతో ఛైర్మన్ ఎన్నిక ఇవాళ్టికి వాయిదా పడింది.పోలీసుల భారీ బందోబస్తు నడుమ ఈరోజు ఉదయం మరోసారి ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కాగా, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అంకం మౌనికకు అనుకూలంగా బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు చెందిన ఏడుగురు చేతులెత్తారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిన్నం సత్యానికి అనుకూలంగా ఆరుగురు తమ సంఘీభావం తెలిపారు. దీంతో బీఆర్‌ఎస్ సాయంతో ఛైర్మన్ పీఠం బీజేపీ కైవసం చేసుకున్నట్లైంది. ఛైర్మన్‌గా అంకం మౌనిక, వైస్ ఛైర్మన్‌గా బీఆర్‌ఎస్ అభ్యర్థి మహమ్మద్ షోయబ్ ఎన్నికయ్యారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు కుమ్మక్కయ్యాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. తాజాగా జరిగిన రెండు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. రెండు పార్టీలు కలిసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను పంచుకున్నాయని గుర్తు చేశారు. ఇబ్రహీంపట్నం, ఈరోజు జరిగిన ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల్లో రెండిట్లో బీఆర్‌ఎస్, బీజేపీ దోస్తీ బయటపడిందన్నారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు తమకు ఎవరితోనూ పొత్తు ఉండదని చెబుతున్నాడని, మరి ఖానాపూర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీల్లో ఏం జరిగిందో ఆయన తెలియదా అని ప్రశ్నించారు. తమకు ఎవరితోనూ పొత్తులు లేవని బట్టలు చింపుకున్న కేటీఆర్, ఇప్పుడు మాత్రం కుక్కిన పేనులా ఉన్నాడని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్య విజయం అంటూ గంభీరమైన ప్రకటనలు చేస్తున్న ఆయన, ఈ అనైతిక పొత్తుల గురించి మాత్రం నోరు విప్పడం లేదన్నారు.

## మాకివ్వాల్సిన క్షిపణులను అమెరికా ఇరాన్‌పై వాడుతున్నారు

కీవ్(జనంసాక్షి):పశ్చిమాసియాలో యుద్ధం వల్ల అమెరికా ప్రాధాన్యతలు మారుతున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు తమకు అమెరికా నుంచి అందిన సైనిక, ఆయుధ సరఫరాను ఆ యుద్ధం కారణంగా తగ్గించి.. వాటిని ఇజ్రాయెల్‌కు మళ్లిస్తున్నారని అన్నారు. ఈ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే అగ్రరాజ్యం నుంచి తమకు వస్తున్న మద్దతు భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశం ఉందన్నారు. రష్యా ప్రయోగిస్తున్న బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోవడానికి ఇన్నాళ్లు తాము అమెరికా సరఫరా చేసే పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థలను ఉపయోగించామన్నారు. ఇప్పుడు వాటి సరఫరా నిలిచిపోవడంతో యుద్ధంలో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. తమ ఆయుధ నిల్వలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని జెలెన్‌స్కీ వాపోయారు. కొద్ది కాలంగా అమెరికా మద్దతు తగ్గుతుండడంతో స్వదేశీ డ్రోన్ల తయారీని పెంచామన్నారు. కాగా డ్రోన్లు, క్షిపణుల ఉత్పత్తికి అంతరాయం కలిగించడానికి రష్యా తమ ఇంధన నిల్వలను టార్గెట్ చేయడం ఇబ్బందికరంగా మారిందన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడడంతో మిత్ర దేశాల నుంచి కూడా ఎటువంటి సహాయం అందట్లేదన్నారు. మరో వైపు యుద్ధం ముగింపునకు అమెరికా మధ్యవర్తిత్వంతో జరుగుతున్న చర్చల్లోనూ పురోగతి కనిపించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అదునుగా తీసుకొని రష్యా తమపై దాడులను మరింత తీవ్రం చేస్తోందన్నారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల రష్యా ఆర్థిక ప్రయోజనాలు పొందుతోందని జెలెన్‌స్కీ ఆరోపించారు. ఇరాన్ హర్మూజ్‌ను మూసివేయడంతో ప్రపంచ దేశాలు మళ్లీ రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్నాయన్నారు. దీంతో మాస్కో తమ సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటుందన్నారు. ఇరాన్ ప్రయోగిస్తున్న డ్రోన్లను ఎదుర్కోవడానికి తమ సైనిక నిపుణులు గల్ఫ్ దేశాలకు సాయం చేస్తున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు. తద్వారా ఆయా దేశాలు తమవద్ద ఉన్న యాంటీ-బాలిస్టిక్ క్షిపణులను తమకు సరఫరా చేసే అవకాశం ఉందన్నారు.
కువైట్‌పై విరుచుకుపడ్డ ఇరాన్ భీకరదాడులు..
మరోవైపు కువైట్‌పై ఇరాన్ భీకర దాడులతో విరుచుకుపడింది. షువైఖ్ ఆయిల్ సెక్టార్ కాంప్లెక్స్‌లో డ్రోన్ దాడి జరిగింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ కాంప్లెక్స్‌లో చమురు మంత్రిత్వశాఖ, కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాలు ఉన్నాయని ఆ దేశ అధికారిక మీడియా వెల్లడించింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ దాడిలో భారీ ఆస్తి నష్టం జరిగిందని అధికారులు పేర్కొన్నారు. ఎవరికీ గాయాలు కాలేదని స్పష్టం చేశారు.

## జలసంధి తెరవకపోతే మౌళిక సదుపాయాలను విధ్వంసం చేస్తాం

పౌరులకు, విమానాలకు ఎక్కువ ప్రమాదం ఉండే ఇలాంటి ఆపరేషన్ చాలా అరుదని చెప్పారు.
'ట్రంప్ హెచ్చరిక తెలివితక్కువ చర్య'
మరోవైపు, 48 గంటల్లోగా హర్మూజ్‌ను తెరవాలని లేదంటే నరకం చూపిస్తామని శనివారం ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు. అయితే, ఈ విషయంపై ఇరాన్ గట్టిగా బదులిచ్చింది. 'ట్రంప్ హెచ్చరిక తెలివితక్కువ చర్య' అని అభివర్ణించింది. తమ వంతెనలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ చేస్తున్న బెదిరింపులు హాస్యాస్పదంగా ఉన్నాయని పేర్కొంది. శత్రువులు తమ మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే తీవ్రంగా స్పందిస్తామని ఇరాన్ హెచ్చరించింది. అదేవిధంగా, అమెరికా- ఇజ్రాయెల్‌కు త్వరలోనే బిగ్ సర్‌ప్రైజ్ ఇవ్వనున్నామని ఇరాన్ భద్రతాధికారి ఒకరు పేర్కొన్నారు. యుద్ధంలో ఇరాన్ తన సొంత ప్రణాళికలు, నిర్దిష్ట లక్ష్యాల ప్రకారమే ముందుకు వెళ్తోందని తెలిపారు. ఈ సందర్భంగా అమెరికా లక్ష్యాల జాబితా లోపభూయిష్టంగా ఉందన్నారు.

**ఇరాన్‌లో చిక్కుకుపోయిన రెండో పైలట్‌ను రక్షించాం : ట్రంప్**

ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఇటీవల అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమానం 'ఈ-15ఇ స్ట్రైక్ ఈగల్' కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గల్లంతైన రెండో పైలట్‌ను తాజాగా అమెరికా దళాలు గుర్తించి.. రక్షించాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దేశ చరిత్రలోనే అత్యంత సాహసోపేతమైన ఆపరేషన్‌ను తమ సైన్యం విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. ప్రస్తుతం అతడు అమెరికా బలగాల ఆధీనంలోనే సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్‌లోని ప్రమాదకరమైన పర్వతాల్లో అతడిని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఓ వైపు శత్రువులు అతడి కోసం వేట సాగిస్తుంటే.. మరో వైపు అతడి కమాండర్ ఇన్ చీఫ్, యుద్ధ కార్యదర్శి, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్, ఇతర అమెరికా యోధులు అతడి లొకేషన్‌ను 24 గంటలూ గమనిస్తూనే ఉన్నారని ట్రంప్ వెల్లడించారు.పైలట్‌ను తీసుకురావడానికి తాను డజన్ల కొద్దీ విమానాలను పంపానని..తమ రక్షణ చర్యలకు ఆటంకం కలగకూడదనే ఈ విషయాన్ని బహిర్గతం చేయలేదని ట్రంప్ పేర్కొన్నారు. శత్రు భూభాగంలోకి వెళ్లి.. ఎయిర్‌మెన్ రక్షించడం అమెరికా చరిత్రలో ఇదే మొదటిసారని పేర్కొన్నారు. ఏ అమెరికన్ యోధుడిని ఎప్పటికీ ఒంటరిగా వదిలిపెట్టమని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇరాన్ గగనతలంపై మనం తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించామనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఇదీ చదవండి: అమెరికా, ఇజ్రాయెల్‌కు బిగ్ సర్‌ప్రైజ్ ఇస్తాం: ఇరాన్
పైలట్ కోసం వచ్చిన విమానాన్ని కూల్చివేశాం : ఇరాన్
పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితులు మొదలై నేటికి ఐదు వారాలు గడిచినా యుద్ధ ప్రభావం ఏమాత్రం తగ్గడంలేదు. అమెరికా- ఇజ్రాయెల్? సంయుక్త దాడులకు ఇరాన్ గట్టిగా బదిలిస్తూనే వస్తోంది. అయితే, ఇటీవల అమెరికాకు చెందిన ఎఫ్-15ఈ ఫైటర్ జెట్‌ను ఇరాన్ భద్రతా దళాలు కూల్చివేశాయి. ఆ ప్రమాదంలో ఒక పైలట్ చాకచక్యంగా తప్పించుకోగా, మరో పైలట్ ఇరాన్ గడ్డపై చిక్కుకుపోయినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. దీంతో పైలట్ ఆచూకి కోసం గాలింపు చర్యలు చేపట్టింది అమెరికా. ఈ నేపథ్యంలో గల్లంతైన రెండో పైలట్‌ను సురక్షితంగా రక్షించామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. దానికి బదులుగా ఇరాన్, పైలట్ కోసం రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న విమానాన్ని కూల్చివేసినట్లు ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ వెల్లడించింది. శత్రుదేశానికి చెందిన విమానాన్ని ఇస్ఫహాన్ దక్షిణ ప్రాంతంలో ఐఆర్‌జీసీ దళాలు నేలమట్టం చేశాయని ఇరాన్ మీడియా తెలిపింది. అది అమెరికా దళానికి చెందిన సీ-130గా పేర్కొంది. ఫరాజ్ రేంజర్స్ అనే పోలీసు కమాండో యూనిట్ ఈ విమానాన్ని కూల్చివేసినట్లు ఖతార్ మీడియా తెలిపింది. ఇతర ఫైటర్?జెట్లకు సీ-130 రీఫ్యూయలింగ్ చేసేందుకు వచ్చినట్లు పేర్కొంది. అయితే, ఆ ఎయిర్‌క్రాఫ్ట్‌లోని సిబ్బందికి సంబంధించి ఎలాంటి సమాచారం వెలువడలేదు. అంతేకాదు, ఈ విషయంపై అమెరికా నుంచి కూడా ఎలాంటి స్పందన లేదు.ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన అనేక విమానాలను ఇరాన్? సాయుధ దళాలు కూల్చివేసినట్లు ఇరాన్ మీడియా కథనాలు తెలిపాయి. అదేవిధంగా అమెరికా దళాలకు చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించింది. ఈ మేరకు ఐఆర్?జీసీ ఆ విషయాన్ని వెల్లడించినట్లు పేర్కొన్నాయి. అయితే, కూల్చేవేసిన వాటిల్లో ఒక అ-130 విమానంతో పాటు, రెండు బ్లాక్ హాక్ హెలికాప్టర్లు ఉన్నాయని ఖతమ్ అల్- అన్వియా కేంద్ర ప్రధాన కార్యాలయ ప్రతినిధి తెలిపారు.ఇదిలా ఉండగా, యుద్ధంలో ఆరితేరిన జనరల్స్‌ను ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ ఎం.బి. ఘాలిబాఫ్ ప్రశంసించారు. గత కొద్దిరోజులుగా అమెరికా, ఇరాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల మధ్య బాహ్య ఒత్తిళ్ల కంటే జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తున్నందుకు వారిని అభినందించారు. ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడం, చమురు ధరలను నియంత్రించడం వంటి నిర్ణయాలతో అమెరికా సతమతమవుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇది దీర్ఘకాలంలో అమెరికన్ పన్ను చెల్లింపుదారులపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన నొక్కి చెప్పారు. యుద్ధంలో అమెరికా స్వల్పకాలిక సైనిక విజయాలు సాధించవచ్చని, అయితే పశ్చిమాసియా ఇంధన మౌలిక సదుపాయాల విధ్వంసం కారణంగా దశాబ్దాల పాటు అధిక ఇంధన ధరలు, ఆర్థిక అస్థిరత అనేవి అమెరికాకు దీర్ఘకాలిక మూల్యంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

## బెంగాల్‌లో అధికారంలోకొస్తాం

"పోలింగ్ రోజు టీఎంసీ గూండాలు మిమ్మల్ని(ప్రజలను) ఎంత బెదిరించినా కూడా చట్టంపై నమ్మకం ఉంచాలి. ఈ ఎన్నికల్లో బంగాల్ నుంచి భయం పారిపోతుంది. బీజేపీ మహావిజయంతో భరోసా పెరుగుతుంది. నేను మీకు హామీ ఇస్తున్నాను. ఈసారి ఎన్నికల తర్వాత వారి (టీఎంసీ)పాపాల లెక్క పూర్తిగా తేలుస్తాం. వెతికి వెతికి మరీ లెక్కిస్తాం. మే 4వ తేదీ తర్వాత చట్టం తనపని తాను చేస్తుంది. ఎంత పెద్ద గూండా అయినా సరే ఈసారి శిక్ష తప్పదు. ఒకవైపు తృణమూల్ కాంగ్రెస్ పట్ల భయం ఉంటే, మరోవైపు బీజేపీ పట్ల మీకు నమ్మకం ఉంది. ఒకవైపు తృణమూల్ కాంగ్రెస్ వారి కమీషన్ల దందా, అవినీతి పట్ల భయం ఉంటే, మరోవైపు అభివృద్ధిని వేగవంతం చేయగల బీజేపీ పట్ల నమ్మకం ఉంది. ఒకవైపు చొరబాటుదారుల బెడద పట్ల భయం ఉంటే, మరోవైపు రాష్ట్రం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టగల బీజేపీ పట్ల నమ్మకం ఉందని అన్నారుఈ క్రమంలోనే 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి 'మహిళా రిజర్వేషన్ల చట్టం'ను అమలు చేసేందుకు అవసరమైన బిల్లులను ఆమోదం కోసం ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తుందని గుర్తు చేశారు. "ఇప్పటివరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మన సోదరీమణులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించింది. మేము 3 కోట్ల మంది సోదరీమణులను 'లఖ్‌పతి దీదీ' లుగా మార్చాము. ఈ క్రమంలోనే దేశం కోసం తీసుకునే నిర్ణయాల్లో మహిళల పాత్ర మరింత పెరగడం అత్యంత అవసరం. అందుకే లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించేలా మా ప్రభుత్వం ఒక చట్టాన్ని రూపొందించింది. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే బంగాల్‌తో సహా దేశవ్యాప్తంగా ఉన్న సోదరీమణులందరూ ఈ రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేలా చేయడానికి ప్రస్తుతం కృషి చేస్తున్నాం. అందుకే ఏప్రిల్ 16- 18 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశాం. మన తల్లులు, సోదరీమణులకు దక్కాల్సిన ఈ హక్కు గత 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. దీనిపై ఇకపై ఎటువంటి జాప్యం చేయడం సముచితం కాదు. కూచ్ బెహార్ వేదికగా దేశంలోని అన్ని రాష్ట్రాలకు నేను మరోసారి భరోసా ఇస్తున్నాను. జనాభా నియంత్రణలో ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, సీట్ల కేటాయింపు విషయంలో ఎటువంటి నష్టాన్ని ఎదుర్కోవు. అందరూ లబ్ధి పొందుతారు. అన్ని రాష్ట్రాల భాగస్వామ్యం, ప్రతి ఒక్కరి హక్కులు సురక్షితంగా ఉంటాయి. మహిళల కోసం అదనపు సీట్లను పెంచడం ద్వారా రాష్ట్రాలు భారీ ప్రయోజనాలను పొందేలా చూడాలనే విషయాన్ని పార్లమెంటులో బలంగా ముద్ర వేయాలని మేము కోరుకుంటున్నాం." అని ప్రధాని మోదీ అన్నారు.

## బీఆర్‌ఎస్‌లోకి వెళ్లే ప్రసక్తే లేదు..

### పిచ్చి ప్రచారాలు మానుకోండి: ఈటల

వారికి చెబుతున్నా.. పార్టీలు మారే పరిస్థితి లేదు. పార్టీలు మారడం దుస్తులు మార్చినంత సులభం కాదు. నన్ను ఎన్నో అవమానాలకు గురి చేస్తూ రాత్రికి రాత్రే బీఆర్‌ఎస్ నుంచి బర్తరఫ్ చేశారు. అధికార బలంతో వ్యక్తిగతంగానూ తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. ఇప్పుడేమో ఈటల పార్టీ మారుతున్నారని కరీంనగర్‌లో కొందరు పోస్టర్లు వేయడం.. ఆరోపణలు చేయడం నన్ను బాధించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీలు మారే పరిస్థితి రాదు" అని పేర్కొన్నారు.

## రెస్టరంట్‌లోకి దూసుకెళ్లిన విమానం

### నలుగురి మృతి

బ్రెజీలియా(జనంసాక్షి):బ్రెజిల్ ఓ రెస్టరంట్‌లోకి విమానం దూసుకెళ్లింది దీంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దక్షిణ బ్రెజిల్‌లో శుక్రవారం ఈ ఘటన జరిగింది. ఒక చిన్న విమానం ఆరుగురితో కాపావో డా కానావో విమానాశ్రయం నుంచి బయలుదేరింది. టేకాఫ్ అయిన వెంటనే విమానం రన్‌వే చివరన ఉన్న ఒక స్తంభాన్ని ఢీకొంది. ఈ క్రమంలో పక్కనే ఉన్న మరో రెస్టరంట్‌లోకి దూసుకెళ్లి.. కూలిపోయింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనలో పైలట్ సహా ముగ్గురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలానికి సమీపంలో ఉన్న మరో ఇద్దరు గాయపడ్డారు. ప్రమాద సమయంలో రెస్టరంట్ మూసేసి ఉంది. దీంతో భారీగా ప్రాణనష్టం తప్పిందని అధికారులు పేర్కొన్నారు.

# ఖానాపూర్ మున్సిపల్ బీజేపీ కైవసం





ఖానాపూర్ ఏప్రిల్ 05 (జనం సాక్షి) : ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎన్నిక ప్రక్రియ ముగియడంతో కొద్ది రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడ్డట్టైంది. ఆదివారం భారీ బందోబస్తు మధ్య చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను జిల్లా ఎస్పీ జానకి షర్మిల ప్రత్యేక పర్యవేక్షణలో నిర్వహించారు. బిజెపి, బి ఆర్ ఎస్ పార్టీలు ఏకమై చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకున్నారు. ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా బిజెపి పార్టీకి చెందిన తొమ్మిదవ వార్డు కౌన్సిల్ సభ్యురాలు అంకం మౌనిక, వైస్ చైర్మన్ గా బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన ఆరవ వార్డు కౌన్సిల్ సభ్యుడు మహమ్మద్ షోయబ్ హుస్సేన్ లు ఎన్నికయ్యారు. కౌన్సిల్ సభ్యులు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి తమ చేతులు ఎత్తి మద్దతు తెలియజేశారు. ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ ఎక్స్ అఫిషియో సభ్యునిగా ఓటు వేశారు. ఎన్నిక అనంతరం చైర్ పర్సన్ గా అంకం మౌనిక, వైస్ చైర్మన్ గా మహమ్మద్ సోయా హుస్సేన్ లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అధికారులు వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మెన్ ఎన్నిక సందర్భంగా బందోబస్తును జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీ లు ఉపేంద్రరెడ్డి, సాయి కిరణ్ లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్, జిల్లా అదన కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ప్రత్యేక అధికారి (సిపిఓ) జీవరత్నం, ఆర్డీవో రత్నకల్యాణి, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన రాజకీయ ఎజెండానే?

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్**



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 5 (జనంసాక్షి):** రాష్ట్రంలో ప్రజాపాలన రాజకీయ ఎజెండాగానే కొనసాగుతుందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లిలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఖానాపూర్ లో చైర్మెన్ వైస్ చైర్మెన్ ఎన్నిక జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అధికార అహంకారంతో ఎన్నికల అధికారులను అడ్డుపెట్టుకొని ఎన్నిక వాయిదా పడేలా కుట్రలు చేస్తే ఆదివారం జరిగే ఎన్నిక కోసం తనను, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీని హౌస్ అరెస్ట్ చేయడం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న మంత్రి వివేక్, ఎమ్మెల్యే బొజ్జు లను గృహనిర్బంధం చేయాలని ఆక్రోశం వ్యక్తంచేశారు. ప్రాణహిత ప్రాజెక్ట్ ఊసే లేకుండా పోయిందని, చెన్నూరు ఎత్తిపోతల పథకం అటకెక్కిందని, ప్రజాపాలన గాడిన పడిందన్నారు. రైతులకు సాగునీరు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టలేని మంత్రి వివేక్ బిఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం, దాడులు చేయడంపై దృష్టి సారించడం సిగ్గు చేటన్నారు. బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ లు ఉన్న చోట ఈజీఎస్ నిధులు కేటాయించకుండా ప్రభుత్వ అధికారులు కక్షపూరితంగా వ్యవహరించడం సరికాద న్నారు. ఈ నెల 12 వ తేదీన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంచిర్యాల జిల్లా పర్యటన ఉండే అవకాశం ఉందని, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ గోడిసెల సంధ్యారాణి – రాజా రమేష్, పట్టణ అధ్యక్షుడు కంబగోని సుద ర్శన్ గౌడ్, బిఆర్ఎస్ కౌన్సిలర్లు భూమయ్య గౌడ్, కృపానందం, శశికుమార్, రాజశేఖర్, వీణంక శ్రీనివాస్, బబ్బెర స్వర్ణలత, ఆర్నె సంధ్యారాణి, లక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకుల సిబ్బందికి అండగా నిలవాలి

- మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా డిమాండ్
- అరకొర జీతాలు..మాయమైన సదుపాయాలు
- మైనారిటీ గురుకుల సిబ్బందికి 'వేతన' కష్టం
- గురుకుల సిబ్బంది జీతాల్లో కోత విధించొద్దు
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ పాత విధానమేనా?



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 205 మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న సుమారు 5 వేల మంది బోధన, బోధనేతర ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాల్లో కోత విధించకుండా ప్రభుత్వం తక్షణమే వారిని ఆదుకోవాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నెలకు కేవలం రూ. 12 వేల నుండి రూ. 15 వేల లోపు స్వల్ప వేతనాలతో కుటుం బాన్ని పోషించుకుంటున్న ఈ సిబ్బందికి, గత ప్రభుత్వాల హయాంలో కేవలం 10 నెలల జీతం ఇచ్చి రెండు నెలలు కోత విధించేవారని,ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పాత విధానాన్ని అనుసరించడం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గతంలో ఎలక్ట్రీషి యన్లు, మహిళా సెక్యూరిటీ గార్డులు, హౌస్ కీపింగ్ వంటి సిబ్బందికి ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు ఉండేవని, ప్రస్తుత ప్రభుత్వం వారిని డైలీ వేజెస్ (రోజువారీ కూలీ) కింద మార్చి ఆ సదుపా యాలను తొలగించడం వల్ల వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని పేర్కొన్నారు. కావున ప్రభుత్వం స్పందించి వేతనాల్లో కోతలు లేకుండా పూర్తి స్థాయిలో జీతాలు చెల్లించి, వారి కుటుంబాల కు భరోసా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



# కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**నల్లబెల్లి, ఏప్రిల్ 05 (జనం సాక్షి):** ప్రభుత్వం ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని ప్రభుత్వం రూ.2400 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలిపారు. దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టిన తరువాతే కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలన్నారు. రైతులు నష్టపోవద్దనే ఉద్దేశంతోనే తెలంగాణలో మొట్టమొదటగా నర్సంపేటలో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, ఏవో రజిత, సర్పంచ్ నాగెల్లి జ్యోతి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, ఏఈఓ శ్రీకాంత్ మండల నాయకులు పాల్గొన్నారు.

# ప్రాణం పోయాక బంధుత్వమెక్కడ?

**మనిషిని గౌరవించిన ఖాకీ మనసు**

- రక్త బంధం వెనకడుగు.. బంధం ముందడుగు!
- ఎస్సై రవికుమార్ మానవత్వం



**గంగారం ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** లోకం ఎంత వేగంగా మారుతుందో.. మనుషుల మధ్య మమతలు అంతే వేగంగా కరిగిపోతున్నాయి. కన్నవారు, ఉన్నవారు.. అంతా మనవాళ్లే అనుకున్నవాళ్లు కూడా కష్టకాలంలో 'మాకు సంబంధం లేదు' అని ముఖం చాటేస్తున్న రోజులివి. కానీ, యూనిఫామ్ వెనుక ఉన్నది కేవలం ఒక అధికారి మాత్రమే కాదు.. అంతకు మించిన ఒక గొప్ప 'మనిషి' అని నిరూపించారు మహబూబాబాద్ జిల్లా గంగారాం ఎస్ఐ రవికుమార్.

కోమట్లగూడెం గ్రామంలో విషాదం నిండింది. స్థానిక చెరువులో పడి మహాదేవుని గూడెం గ్రామానికి చెందిన బొల్లెపల్లి సారయ్య అనే వ్యక్తి ప్రమాదశాత్తు మృతి చెందారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, బంధువులు చెరువు దగ్గరకు చేరుకున్నారు. కానీ, అక్కడే అసలైన విషాదం కనిపించింది. ప్రాణం పోయి నీటిలో తేలుతున్న ఆ మృతదేహాన్ని ముట్టనీటిలోనికి.. కనీసం బయటకు తీయడానికి ఒక్కరు కూడా ముందుకు రాలేదు. రక్త సంబంధీకులు ఉన్నా.. "మాకెందుకులే" అని వెనకడుగు వేశారు....!

చెరువు గట్టున గుమికూడిన జనం.. నీటిలో నిశ్చలంగా ఉన్న మృతదేహం.. అందరి ముఖాల్లో భయం, సంకోచం...... తీయడానికి మద్రిగూడెం అప్పుడే రంగంలోకి దిగారు గంగారాం ఎస్ఐ రవికుమార్. సంబంధం లేని పోలీసులు అంటూ విమర్శించే వారందరికీ తన చేతలతోనే సమాధానం ఇచ్చారు. చుట్టూ ఉన్న బంధువులు చూస్తుండగానే.. స్వయంగా రంగంలోకి దిగి ఆ మృతదేహాన్ని బయటకు తీశారు.. ఖాకీ చొక్కాపై ఉన్న మట్టి మరకల కన్నా.. ఆయన గుండెలోని మానవత్వం పదింతలు మెరిసింది.

పోలీస్ అధికారి చూపిన చొరవను చూసి గ్రామస్థులు కన్నీళ్లు పెట్టుకున్నారు. అయినవాళ్లు ఎంతమంది ఉన్నా ఏం లాభం? ఆపదలో ఆదుకోని బంధుత్వం కన్నా.. అక్కున చేర్చుకునే మానవత్వమే గొప్పదని ఆయన నిరూపించారు. ప్రతి ఇంట్లో ఒక పోలీసు ఉండడం అంటే కేవలం రక్షణ కోసం మాత్రమే కాదు.. సమాజంలో మనిషిని మనిషిగా ప్రేమించే గుణం ఉంటుంది.

# స్పందించిన శిష్యుల 'హృదయాలు'..

- గురువు పరిస్థితి చూసి రూ. 50వేలు అందజేత
- ఇంకా దాతలు స్పందించాలని వేడుకోలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇంటర్ విద్యలో చదువు చెప్పిన గురువు అనారోగ్యంతో, ఆపదలో ఉండడంతో శిష్యుల హృదయాలు స్పందించాయి.. చేయి చేయి కలిపి తమ గురువును ఆదుకునే ప్రయత్నం చేశాయి.. తమ గురువు పరిస్థితి చూసి చలించి పోయి మానవతా దృక్పథంతో రూ. 50 వేలు ఆర్థికసాయం అందించి, ఆ శిష్యులు ఆదర్శంగా నిలిచారు.. ఇంకా ఎవరైనా దాతలు స్పందించి ఆర్థిక సాయం అందించాలని వారు వేడుకుంటున్నారు.. వివరాల్లోకి వెళితే.. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్నాడనే విషయాన్ని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించి, కొండంత అండగా నిలిచారు. భూపాలపల్లి తేజస్విని జూనియర్ కాలేజీలో నీలం శంకర్ గతంలో లెక్చరర్ గా పనిచేసి, ప్రస్తుతం అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆ ర్థిక పరిస్థితులు కూడా దుర్భరంగా ఉం డడంతో ఈ విషయం తేజస్విని జూనియర్ కాలేజీ లో 2004-06 సంవ త్సరంలో ఇంటర్ సీఈసీ చదువుకున్న పూర్వ విద్యార్థులు తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పూర్వపు గురువు నీలం శంకర్ ఆరోగ్యశీ బాగాలేదని మరో గురువు అశోక్ ద్వారా తెలుసుకున్న పూర్వ విద్యార్థులు వెంటనే స్పందించి మానవత్వంతో ఆలోచించి చేయి చేయి కలిపారు. అందరు కలిసి చందాలు వేసుకుని రూ.50వేలు పోగు చేశారు. చిట్యాల మండలం గోపాలపూర్ లో నివాసముంటున్న తమ పూర్వపు గురువు శంకర్ ను ఆదివారం కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చందాల రూపంలో పోగు చేసుకున్న రూ.50వేలు అందించి, ధైర్యం చెప్పారు. ఇంకా దాతలు పూర్వపు స్టూడెంట్స్ గాని, దాతలు గాని స్పందించి తమ గురువు శంకర్ నంబర్ 9676926200 కి ఫోన్ పే ద్వారా ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. గురువు శంకర్ ను పరామర్శించిన వారిలో పూర్వ విద్యార్థులు సుమన్, కిషోర్, మనోజ్, శ్రీనివాసరెడ్డి, వాసు, భద్రం, శ్రీనివాసరావు, నరేష్, హైమాత్ పాషా, శ్రీకాంత్, పాషా, రాము తదితరులు ఉన్నారు.

# హన్మకొండ చౌరస్తాలో ఉరేసుకుంటా..

- మాజీ స్పీకర్ మధుసూదనాచారి సంచలన వ్యాఖ్యలు



**హనుమకొండ (జనంసాక్షి) :** ఆరు గ్యారెంటీలు అమలు చేసినట్టు నిరూపిస్తే హనుమకొండ చౌర స్తాలో ఉరేసుం టానని మాజీ స్పీకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి బహిరంగ ప్రకటన చేశారు. భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా.. ఆయన చిత్రపటానికి మాజీ స్పీకర్ మధుసూదనాచారి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మధుసూదనా చారి మాట్లాడుతూ.. 'తెలంగాణ ప్రజల విశ్వాసం మీద దాడి జరుగుతుంది. ఛాలెంజ్ చేయడమనేది మంచిది కాదు కానీ నేను సూచన చేస్తున్నా.. రేవంత్ రెడ్డి గారు నువ్వు ఆరు గ్యారెంటీలు అమలు చేసినట్టు రెఫరెండం పెట్టి తేల్చితే, అది నిజమైతే హన్మకొండ చౌరస్తాలో నేను ఉరేసుకుంటా.. ఇది బాధతో చెబుతున్నాను. చాలెంజ్ కాదు' అని మధుసూదనాచారి పేర్కొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

**పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులుప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్**




**హనుమకొండ (జనంసాక్షి) :** సమానత్వమే లక్ష్యంగా, అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోనుభావులు, మాజీ ఉప ప్రధాని శ్రీ బాబూ జగ్జీవన్ రామ్ అని పాస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. పూలే ఆశయ సాధన సమితి (పాస్) ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ 118 వ జయంతి సందర్భంగా పూలమాల వేసి వారికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం పాస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ మల్లేశ్వర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం అని కొనియాడారు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ, పరిపాలనా రంగంలో తనదైన ముద్ర వేసిన శ్రీ బాబూ జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, పాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మెరుగు బాబు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు గోడిశాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# యువకునికి కత్తిపోట్లు

**హన్మకొండ (జనంసాక్షి) :** హన్మకొండ జిల్లా గోపాలపురంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ఓ ఘటన స్థానికంగా కలకలం రేపింది. చిల్లర గొడవ కాస్తా ముదిరి, ఒక స్నేహితుడు మరో స్నేహితుడిపై కత్తితో దాడి చేసే వరకు వెళ్లింది. వివరాల్లోకి వెళితే.. గోపాలపురానికి చెందిన రామ్ చరణ్, కార్తీక్ గత కొంతకాలంగా స్నేహితులు. వీరిద్దరి మధ్య రూ. 3 లక్షల రూపాయల ఆర్థిక లావాదేవీలకు సంబంధించి కొంతకాలంగా విభేదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఆ డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. మాట మాట పెరగడంతో ఆవేశానికి లోనైన కార్తీక్, తన వద్ద ఉన్న కత్తితో రామ్ చరణ్‌పై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు.

# మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి



- ప్రజా సంఘాల పిలుపు
- ఏప్రిల్ 6న ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాలపై జరిగే గద్దర్ ఫౌండేషన్ సభను జయప్రదం చేయండి

**సిద్దిపేట (జనంసాక్షి) :** గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న హైదరాబాద్ లో జరిగే ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాలపై రాష్ట్ర స్థాయి సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గద్దర్ ఫౌండేషన్ పోస్టర్ ను ఆదివారం సిద్దిపేటలో జరిగిన బాబు జగ్జీవన్ రావు జయంతోత్సవాలలో సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవెరుగు మంజుల రాజనర్సు, వివిధ దళిత, ప్రజా ప్రజా సంఘాల నాయకులు పి.శంకర్ , భీమసేన, పోచ బోయిన శ్రీహరి యాదవ్, లింగంపల్లి శ్రీనివాస్ శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మెదక్ జిల్లాకు గద్దర్ అన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్ పై కాల్పులు జరిగిన రోజున గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సభను నిర్వహిస్తారని తెలిపారు. ఈ దినాన్ని గద్దర్ పునర్జన్మ దినంగా సైతం పాటిస్తారని తెలిపారు. ఏప్రిల్ 6న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం ఐదు గంటల నుండి జరిగే ప్రశ్నించే గొంతులు సాధించిన విజయాల సభకు ప్రతి ఒక్కరు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ నుంచి 50 లక్షలు కాజేసిన నకిలీ ఏసీబీ అధికారి

**ఐదేళ్ల తర్వాత అరెస్టు**



**అనంతపురం (జనంసాక్షి) :** ఏసీబీ అధికారిగా నటించి తహశీల్దార్‌ను బురిడీ కొట్టించి రూ.50 లక్షలు కాజేసిన ఓ కేటుగాడిని పోలీసులు అరెస్టు చేశారు. గత ఐదేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న మోసగాడినికి చివరకు సత్యసాయి జిల్లాలో అరెస్టు చేశారు. 2021లో అనంతపురం జిల్లా ముదిగబ్బులో తహశీల్దార్‌గా పనిచేస్తున్న అన్వర్ హుస్సేన్‌కు ఓ వ్యక్తి కాల్ చేశాడు. తాను ఏసీబీ అధికారిని అని నమ్మించాడు. అవినీతి కేసులు పెట్టిస్తానని భయపెట్టి రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరించాడు. భయ పడిపోయిన తహశీల్దార్ వెంటనే నకిలీ ఏసీబీ అధికారికి రూ.50 లక్షలు ఇచ్చాడు. డబ్బు చేతిలో పడగానే కాల్ చేసిన వ్యక్తి కనిపించకుండాపోయాడు. అప్పట్లోనే మోసపోయానని గ్రహించిన అన్వర్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అనంతపురం జిల్లా కూడేరు మండలం కలగల్లు గ్రామానికి చెందిన ఎరుకల హనుమంతుగా గుర్తించారు. ఐదేళ్లుగా హనుమంతు ఆచూకీ దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో పోలీసులు సాంకేతిక ఆధారాలు, గోప్య సమాచారంతో నిందితుడి కదలికలను కొంతకాలంగా గమనిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో నిన్న అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారిస్తే మరిన్ని వివరాలు బయటకొచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
6 ఏప్రిల్ 2026

## సీనియర్ సైనిక అధికారుల ఉద్వాసన

# యుద్ధంలో ట్రంప్ తప్పటడుగులు



ఇరాన్‌తో సాగుతున్న యుద్ధం మధ్యలో అమెరికా సైన్యంలోని అగ్రశ్రేణి అధికారులను అకస్మాత్తుగా తొలగించడం కేవలం పరిపాలనా మార్పు కాదు.ట్రంప్ నిర్ణయాలలో రాజకీయ అస్థిరత, వ్యూహాత్మక అయోమయం, వ్యక్తిగత ప్రతీకార భావాల మేళవింపుగా కనిపిస్తోంది. డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో తీసుకున్న ఈ నిర్ణయాలు అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న బలహీనతలను బహిర్గతం చేస్తున్నాయి. యుద్ధ సమయాల్లో సైనిక నాయకత్వంలో స్థిరత్వం అత్యవసరం. కానీ, అదే సమయంలో అనుభవజ్ఞులైన జనరల్స్‌ను తొలగించడం, పాలక వర్గం వ్యూహాత్మకంగా ఎంత గందరగోళంలో ఉందో సూచిస్తుంది.

అమెరికా రక్షణ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా భావించబడుతుంది. సంవత్సరానికి సుమారు 850 బిలియన్ డాలర్లకు పైగా రక్షణ ఖర్చు చేస్తున్న దేశం, కానీ ట్రంప్ సర్వ సైనిక అధ్యక్ష హోదాలో తీసుకుంటున్న వ్యక్తి గత నిర్ణయాలు సేవించటం లేదు. అతనిపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రభావం, వత్తిడి ఉంది. అందుకే ట్రంప్ నిలకడలేని నిర్ణయాలు యుద్ధ వ్యూహంలో మాత్రం స్పష్టత లేకుండా ముందుకు సాగడం ఆందోళన కలిగించే విషయం. ఇరాన్‌తో జరుగుతున్న ఘర్షణలో ఇప్పటికే భారీ ఆర్థిక నష్టం సంభవిస్తున్నట్లు అంచనాలు ఉన్నాయి. యుద్ధం ప్రారంభమైన కొన్ని వారాల్లోనే ఇంధన ధరలు 20 శాతం వరకు పెరిగినట్లు అంతర్జాతీయ మార్కెట్ సూచిస్తోంది. ఈ ప్రభావం అమెరికా అంతర్గత ఆర్థిక వ్యవస్థపై కూడా పడుతోంది. ఉన్నత శ్రేణి సైనికాధికారుల తొలగింపును ఒక పెద్ద మార్పు భాగంగా చూపించే ప్రయత్నం జరుగుతున్నా, ఇది అంత సులభంగా అర్థం చేసుకునే విషయం కాదు. సైన్యంలో అనుభవం అనేది కేవలం పదవులతో కొలవలేనిది. అనేక యుద్ధ రంగాల్లో పనిచేసిన అధికారుల సలహాలు, నిర్ణయాలు యుద్ధ ఫలితాలను నిర్ణయిస్తాయి. అలాంటి వారిని తొలగించడం వెనుక అసలు కారణం ఏమిటన్నది కీలకం. సాధారణంగా ఇలాంటి చర్యలు తీసుకునే ముందు లోతైన సమీక్షలు, చర్చలు జరుగుతాయి. కానీ ఇక్కడ అవి కనిపించడం లేదు.

ఇది ఒక వ్యక్తి యొక్క మొండి వైఖరి,ఆధిపత్య ధోరణి రాజకీయానికి సంకేతంగా కనిపిస్తోంది. ప్రభుత్వ వ్యవస్థలో భిన్నాభిప్రాయాలను అంగీకరించలేని నాయకత్వం చివరకు నిర్ణయాల్లో తడబాటు పడుతుంది. సైనికాధికారులు తమ అభిప్రాయాలను నిజాయితీగా చెప్పినపుడు, అవి నాయకత్వానికి నచ్చకపోతే వారిని తొలగించడం అనేది ప్రమాదకర ధోరణి. ఇది కేవలం వ్యక్తిగత నిర్ణయాల పరిమితి కాదు. దేశ భద్రతను కూడా ప్రభావితం చేసే అంశం.

ఇరాన్ భూమి పై అమెరికా సేనల దాడి చేసే ఆలోచన అమెరికా చరిత్రలో అత్యంత వివాదాస్పదమైన చర్యలలో ఒకటిగా మారే అవకాశం ఉంది. గతంలో ఇరాక్ యుద్ధం సమయంలో కూడా ఇదే విధమైన వ్యూహపరమైన తప్పిదాలు జరిగాయి. ఆ యుద్ధంలో అమెరికాకు వేలాది సైనికుల ప్రాణనష్టం జరిగింది. లక్షల కోట్ల డాలర్ల ఖర్చు అయింది. అంతర్జాతీయ ప్రతిష్ఠకు నష్టం తెచ్చింది. ఇప్పటి పరిస్థితి కూడా దానికి భిన్నంగా కనిపించడం లేదు.

అమెరికా అంతర్గత రాజకీయ పరిస్థితులు కూడా ఈ నిర్ణయాలకు దారితీస్తున్నాయి. న్యాయ వ్యవస్థతో జరిగిన ఘర్షణలు, వివాదాస్పద కేసులు, ముఖ్యంగా ఎఫ్ స్టీన్ ఫైల్స్ వంటి అంశాలు ప్రభుత్వం పై ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ ఒత్తిడిని తట్టుకోలేక పాలక వర్గం విమర్శకులను పక్కకు నెట్టే ప్రయత్నం చేస్తోంది. ఇది ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ కాదు. అది అధికార కేంద్రీకరణకు సంకేతం.

ప్రపంచ స్థాయిలో కూడా అమెరికా నిర్ణయాలు విమర్శలకు గురవుతున్నాయి. యూరప్ దేశాలు, ఆసియా దేశాలు, మధ్యప్రాచ్య దేశాలు అన్నీ ఈ యుద్ధాన్ని అనుమానంతో చూస్తున్నాయి. అంతర్జాతీయ వేదికలపై అమెరికా ప్రభావం కొంతవరకు తగ్గుతున్నట్లు విశ్లేషణలు చెబుతున్నాయి. ఒకప్పుడు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిన దేశం, ఇప్పుడు తన నిర్ణయాలతోనే విమర్శలకు గురవుతోంది.

ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే, సైనిక వ్యవస్థలో రాజకీయ జోక్యం ఎంతవరకు అనుమతించాలి అన్నది. ప్రజాస్వామ్యంలో సైన్యం పౌర నాయకత్వానికి లోబడి ఉండాలి. కానీ అదే సమయంలో, సైనిక నిర్ణయాలను పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం ప్రమాదకరం. ఈ రెండింటి మధ్య సమతౌల్యం కోల్పోతే దేశ భద్రతే ప్రమాదంలో పడుతుంది.

కొంతమంది విశ్లేషకులు ఈ పరిస్థితిని చైనా కమ్యూనిస్టు పార్టీ విధానాలతో పోలుస్తున్నారు. అక్కడ కూడా భిన్నాభిప్రాయాలను అణచివేయడానికి అధికారులను తొలగించడం సాధారణ విషయం. షీ జిన్‌పింగ్ నాయకత్వంలో ఇటువంటి చర్యలు తరచూ కనిపిస్తున్నాయి. ఇప్పుడు అమెరికాలో కూడా అలాంటి ధోరణులు కనిపించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం.

మొత్తానికి, సైనికాధికారుల తొలగింపు ఒక సాధారణ పరిపాలనా నిర్ణయం కాదని స్పష్టమవుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలను స్వయంగా అమెరికా ప్రజలు, మేధావులు, మీడియా వ్యతిరేకంగా ఊరేగింపులు తీస్తున్నారు. కనుక ట్రంప్ తొందరపాటు నిర్ణయాలు, అది ఒక పెద్ద సంక్షోభానికి సంకేతం. యుద్ధం మధ్యలో తీసుకున్న ఈ నిర్ణయాలు అమెరికా భవిష్యత్తును అనిశ్చితిలోకి నెడుతున్నాయి. నాయకత్వం తన నిర్ణయాలను పునర్విమర్శించుకోవాలి. లేకపోతే, ఇది కేవలం ఒక యుద్ధ పరాజయం మాత్రమే కాకుండా, ఒక వ్యవస్థాపరమైన వైఫల్యంగా, అమెరికా అగ్ర రాజ్యం హోదా ప్రతిష్టకు చరిత్రలో మాయని మచ్చగా నిలిచిపోతుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.



### ‘శాతవాహన యూనివర్సిటీ’ సాక్షిగా

## ‘అర్బన్ నక్సల్’ పేరుతో రాజకీయం..!?

విశ్వవిద్యాలయాలు అంటే కేవలం డిగ్రీలను ప్రసాదించే కర్మాగారాలు కావు. అవి సామాజిక చైతన్యానికి ప్రయోగశాలలు. భిన్న భావజాలాల సంగమ క్షేత్రాలు. సమాజంలోని అసమానతలను ప్రశ్నించడం, రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం గొంతుకను వినిపించడం ఒక విద్యావంతుని ప్రాథమిక బాధ్యత. అయితే తాజాగా కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయం వేదికగా సాగుతున్న పరిణామాలు విద్యావేత్తలను, మేధావులను విస్మయానికి గురిచేస్తున్నాయి. ‘అర్బన్ నక్సల్స్’ అనే ప్రమాదకరమైన ముద్ర వేస్తూ ప్రొఫెసర్లు, విద్యార్థులను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామిక స్వేచ్ఛను గొంతునొక్కడమే అవుతుంది.

దేశంలో మావోయిస్టు ఉద్యమం దాదాపు కనుమరుగైన నేపథ్యంలో విద్యాసంస్థల్లో ‘అర్బన్ నక్సల్స్’ ఉన్నారంటూ ప్రచారం చేయడం శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నమే. కరీంనగర్ పోలీస్ కమిషనర్ స్వయంగా స్పందిస్తూ జిల్లాలో అర్బన్ నక్సలైట్లు ఎవరూ లేరని, నిఘా వర్గాల వద్ద అలాంటి సమాచారం లేదని స్పష్టం చేయడం గమనార్హం. బాధ్యతాయుతమైన పోలీసు యంత్రాంగమే ఈ ఆరోపణలను కొట్టిపారేసిన తర్వాత కూడా, ఇంకా అదే ముద్రను ప్రచారం చేయడం వెనుక వ్యక్తిగత కక్షలు లేదా సామాజిక అణిచివేత వ్యూహాలు ఉన్నాయని స్పష్టమవుతోందనే సత్యాన్ని కాదనగలమా...? తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత వంటి విద్యావేత్తలపై ఇలాంటి ముద్ర వేయడం విచారకరం. దళిత, బహుజన సమస్యలపై నిరంతరం గళమెత్తే వారిని ఏకాకులను చేయడానికి ఈ ‘అర్బన్ నక్సల్స్’ అనే పదాన్ని ఒక ఆయుధంగా వాడుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇది కేవలం ఒక వ్యక్తిపై జరుగుతున్న దాడి కాదు, ప్రశ్నించే ప్రతి గొంతుపై వేస్తున్న నిఘా నీడ. విశ్వవిద్యాలయాల్లో ఉండాల్సింది వైజ్ఞానిక చర్చలు, సామాజిక విశ్లేషణలే కానీ, ఒకరినొకరు అనుమానించుకునే అపనమ్మకపు వాతావరణంగా ఉండకూడదు అనేది ప్రతిఒక్కరూ అర్థం చేసుకోవాలి. యూనివర్సిటీ అంతర్గత పరిపాలనలో జరిగే పదవుల మార్పులను, బాధ్యతల కేటాయింపులను సామాజిక వివాదాలుగా మార్చడం దురదృష్టకరం. వీసీ ఇతర యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన చోట, ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం కొనసాగడం వల్ల విద్యార్థుల్లో అభద్రతా భావం ఏర్పడుతుంది. ఒకరిపై బురద చల్లడానికి ‘దేశ వ్యతిరేకత’ లేదా ‘తీవ్రవాదం’ అనే ముద్రలను వాడటం వల్ల సదరు వ్యక్తుల కెరీర్ మాత్రమే కాదు, మొత్తం వ్యవస్థ ప్రతిష్ట దెబ్బతింటుంది.

అంతేకాకుండా విద్యార్థులను ఆలోచించకుండా, ప్రశ్నించకుండా ఒక చట్రంలోకి బిగించే ప్రయత్నం జరుగుతోంది. విద్యార్థుల మధ్య ఐక్యతను దెబ్బతీస్తూ, వారిలో కొందరిని ఈ ‘ముద్రల’ రాజకీయాల్లోకి లాగడం వల్ల క్యాంపస్ వాతావరణం కలుషితమవుతోంది. విద్యార్థులు తమ సమస్యలపై, సామాజిక అంశాలపై చర్చించకుండా, ఒకరినొకరు అనుమానించుకునేలా చేయడం వల్ల వారి భవిష్యత్తు నాశనమవుతుంది. వీసీ ఒక విద్యావేత్తగా విద్యార్థుల అభివృద్ధిని కాంక్షించాలి కానీ, వారిని విభజించి పాలించే రాజకీయ వ్యూహకర్తగా మారకూడదు. విశ్వవిద్యాలయాల్లో భిన్న దృక్పథాలు ఉండటం సహజం. కానీ, వీసీ స్థాయిలో తనకు నచ్చని వారిని లేదా తనను ప్రశ్నించే వారిని అణచివేయడానికి ‘అర్బన్ నక్సల్’ అనే లేబుల్‌ను ఒక ఆయుధంగా వాడుకోవడం ఆయనలోని అసహనాన్ని సూచిస్తోంది. స్వయంగా ఉన్నత స్థాయి మంత్రులను కలిసి ఈ అంశాన్ని రాజకీయం చేయడం చూస్తుంటే, యూనివర్సిటీ సమస్యలను పరిష్కరించడం కంటే, ప్రత్యర్థులపై ముద్ర వేయడమే ఆయన ప్రాధాన్యతగా కనిపిస్తోంది.

ఏదైనా ఒక అంశంపై భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేసినంత మాత్రాన వారిని ‘అర్బన్ నక్సల్స్’ గా చిత్రించడం ఒక అనారోగ్యకరమైన ధోరణి. పోలీసులు సైతం అర్బన్ నక్సల్స్ లేరని తేల్చి చెప్పిన తరుణంలో, ప్రభుత్వం, విద్యాశాఖ ఈ విషయంలో జోక్యం చేసుకుని విశ్వవిద్యాలయ ప్రతిష్టను కాపాడాలి. విమర్శలను స్వీకరించలేని స్థితి, భిన్నత్వానికి తావులేని ధోరణి ప్రజాస్వామ్యానికి చేటు చేస్తాయి. మేధావి లోకం ఈ విద్వేష ప్రచారాన్ని ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉంది.



రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్

# ఆధునికత అందిపుచ్చుకుంటే బంగారు భవిష్యత్తు!

పరీక్షలు పూర్తయ్యే ఈ కాలం ప్రతి విద్యార్థి జీవితంలో ఒక మలుపు. కానీ ఈసారి పరిస్థితి కొంచెం భిన్నంగా ఉంది. గత తరాల విద్యార్థులు “ఏ కోర్సు చదివితే ఉద్యోగం వస్తుంది?” అనే ఒక్క ప్రశ్నతో ముందుకు వెళ్లేవారు. ఇప్పుడు మాత్రం డిజిటల్ విప్లవం, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) వేగంగా ప్రపంచాన్ని మార్చేస్తున్న నేపథ్యంలో, విద్యార్థుల మనసుల్లో అనేక సందేహాలు ముసురుకుంటున్నాయి. తాను ఎంచుకునే కోర్సుకు భవిష్యత్తు ఉందా? ఇప్పుడున్న ఉద్యోగాలు ఐదేళ్ల తర్వాత కూడా ఉంటాయా? ఏఐ మన స్థానాన్ని తీసుకుంటుందా? లేక కొత్త అవకాశాల దారులు తెరుస్తుందా? వంటి ప్రశ్నలు వారికి ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ అనిశ్చితి మధ్య సరైన దిశలో నిర్ణయం తీసుకోవడం కోసం మారుతున్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం అత్యంత అవసరం. అదే ఈ తరానికి ఎదురైన పెద్ద సవాలు... అలాగే ఒక గొప్ప అవకాశం కూడా. ప్రపంచం మరోసారి ఒక సాంకేతిక విప్లవం అంచున నిలిచింది. ఒకప్పుడు ఆవిరి యంత్రం పరిశ్రమలను మార్చింది. తరువాత విద్యుత్ ప్రపంచాన్ని వేగవంతం చేసింది. కంప్యూటర్లు సమాచారాన్ని ప్రజల చేతుల్లో పెట్టాయి. ఇప్పుడు అదే స్థాయిలో ప్రభావం చూపుతున్నది కృత్రిమ మేధస్సు (ఏఐ). ఈ నేపథ్యంలో సాధారణ ప్రజల నుంచి విద్యార్థుల వరకు, ఉద్యోగుల నుంచి పాలసీ నిర్ణేతల వరకు అందరి మనసుల్లో ఒకే ప్రశ్న తిరుగుతోంది: ఏఐతో ఉద్యోగాలు పోతాయా? లేక కొత్త ఉద్యోగాలు వస్తాయా? ఈ ప్రశ్నకు సరళమైన సమాధానం ఒకటే.. కొన్ని ఉద్యోగాలు మారిపోతాయి, కానీ మరింత పెద్ద అవకాశాల ప్రపంచం తెరుచుకుంటుంది.

ఏఐను కేవలం ఒక టెక్నాలజీగా చూడటం సరిపోదు. ఇది ఒక కొత్త ఆర్థిక వ్యవస్థకు పునాది వేస్తున్న శక్తి. సంస్థల లోపల ఇప్పటికే ఒక నిశ్శబ్ద విప్లవం జరుగుతోంది. అక్కడ ఒక తెలివైన నిర్ణయాల వ్యవస్థను నిర్మించేందుకు అనేక పాత్రలు కలిసి పని చేస్తున్నాయి. ఈ వ్యవస్థలో ఒక్కో వ్యక్తి ఒక్కో బాధ్యత నిర్వహించినా, వారి లక్ష్యం ఒకటే.. డేటాను జ్ఞానంగా మార్చి నిర్ణయాలను మెరుగుపరచడం.

ఈ కొత్త వ్యవస్థలో మొదటగా కనిపించే వ్యక్తి డేటా ఇంజినీర్. రైతు భూమిని సిద్ధం చేసినట్లే డేటా ఇంజినీర్ సమాచారాన్ని సేకరించి, శుభ్రపరచి, ఉపయోగపడేలా రూపొందిస్తాడు. ఏఐకి డేటా అంటే ఆహారం లాంటిది. సరైన డేటా లేకపోతే ఎంత ఆధునికమైన మోడల్ ఉన్నా అది పనిచేయదు. అందుకే డేటా ఇంజినీరింగ్ రేపటి ప్రపంచంలో అత్యంత కీలకమైన నైపుణ్యంగా మారుతోంది.

ఆ తరువాత రంగంలోకి దిగేది డేటా సైంటిస్ట్. డేటాలో దాగి ఉన్న కథలను వెలికి తీయడం వీరి పని. ఒక నగరంలో ట్రాఫిక్ ఎందుకు పెరుగుతోంది? ఒక బ్యాంకులో మోసాలు ఎక్కడ జరుగుతున్నాయి? ఒక ఆసుపత్రిలో ఏ వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు సంఖ్యల మధ్య దాగి ఉంటాయి. వాటిని బయటకు తీసే శాస్త్రవేత్తే డేటా సైంటిస్ట్. ఈ విశ్లేషణలను ఉపయోగించి పనిచేసే వ్యవస్థను నిర్మించే బాధ్యత ఎంఎల్ ఇంజినీర్‌దే. సిద్ధాంతాన్ని ప్రాక్టికల్‌గా మార్చడం వీరి పని. ఒక మోడల్ నిజంగా పని చేస్తుందా? వేగంగా పనిచేస్తుందా? పెద్ద స్థాయిలో ఉపయోగించగలమా? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

ఇక్కడితో కథ ముగియదు. ఒక సంస్థలో ఏఐ వ్యవస్థను సమర్థంగా అమలు చేయాలంటే మొత్తం నిర్మాణానికి రూపకల్పన అవసరం. అక్కడే ఏఐ ఆర్కిటెక్ట్ పాత్ర మొదలవుతుంది. భవిష్యత్తులో విస్తరించే విధంగా, సురక్షితంగా, వేగంగా పనిచేసే విధంగా వ్యవస్థను రూపొందించడం వీరి బాధ్యత. ఇది ఒక పెద్ద నగరాన్ని ప్లాన్ చేసే పట్టణ నిర్మాణ నిపుణుడి పని లాంటిదే.అయితే టెక్నాలజీ మాత్రమే సరిపోదు. అది ప్రజలకు ఉపయోగపడాలి. వ్యాపారానికి విలువ తీసుకురావాలి. ఇక్కడే ఏఐ ప్రొడక్ట్ మేనేజర్ రంగంలోకి వస్తాడు. వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుని, వాటిని టెక్నాలజీతో కలిపి ఒక ఉపయోగకరమైన ఉత్పత్తిగా మార్చడం వీరి లక్ష్యం. సంస్థల్లో ఒక పెద్ద సమస్య ఏమిటంటే.. టెక్నికల్ టీమ్ మాట్లాడే భాష ఒకటి, వ్యాపార టీమ్ మాట్లాడేది మరోటి. ఈ రెండు ప్రపంచాల మధ్య వారధిగా పనిచేసేది డేటా అండ్ ఏఐ ట్రాన్స్‌లేటర్. వీరు లేకపోతే గొప్ప టెక్నాలజీ ఉన్నా అది వ్యాపారానికి ఉపయోగపడదు. ఇక వ్యవస్థ ఎంత శక్తివంతమైనదైనా, అది ఉపయోగించడానికి సులభంగా లేకపోతే ప్రజలు దాన్ని స్వీకరించరు. అందుకే యూఎక్స్ డిజైనర్ పాత్ర కీలకం. వినియోగదారుల అనుభవాన్ని సులభంగా, ఆకర్షణీయంగా రూపొందించడం వీరి పని.జనరేటివ్ ఏఐ వ్యవస్థలు విస్తృతంగా ఉపయోగంలోకి వచ్చిన తర్వాత ఒక కొత్త పాత్ర వెలుగులోకి వచ్చింది.. ప్రాంప్ట్ ఇంజినీర్. సరైన ప్రశ్న అడగడం ఒక కళ. అదే సరైన సమాధానానికి దారి తీస్తుంది. ఈ నైపుణ్యం భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం పొందబోతోంది.

అయితే ఏఐ తీసుకునే నిర్ణయాలు సరైనవేనా అనే ప్రశ్న ఎప్పటికీ ఉంటుంది. అక్కడే మోడల్ వ్యాలిడేటర్ పాత్ర ముఖ్యమవుతుంది. మోడల్ లోపాలు ఉన్నాయా? పక్షపాతం ఉందా? తప్పు నిర్ణయాలు తీసుకుంటుందా? అనే అంశాలను పరిశీలిస్తారు.

ఇది మాత్రమే కాదు. టెక్నాలజీ ఎంత ముందుకు వెళ్లినా అది మనుషుల విలువలను గౌరవించాలి. అందుకే ఏఐ ఎథిసిస్ట్ పాత్ర ప్రాముఖ్యం పెరుగుతోంది. సమాజానికి హాని కలగకుండా, న్యాయంగా, సమానంగా వ్యవస్థ పనిచేస్తుందా అనే విషయాన్ని వీరు పర్యవేక్షిస్తారు.

ఇంకా ఒక ముఖ్యమైన అంశం.. భద్రత. డేటా సురక్షితంగా ఉందా? వినియోగదారుల గోప్యత కాపాడుతున్నామా? అనే విషయాలను చూసేది రిస్క్ అండ్ గవర్నెన్స్ స్పెషలిస్టు. భవిష్యత్తులో ఈ పాత్ర ప్రభుత్వాల నుంచి ప్రైవేట్ సంస్థల వరకు ప్రతి రంగంలో అవసరం అవుతుంది. ఈ వ్యవస్థలో చివరగా కనిపించే కానీ అత్యంత ప్రభావవంతమైన పాత్ర డెసిషన్ ఇంజినీర్. డేటా, మోడల్స్, వ్యాపార లక్ష్యాలను కలిపి సరైన నిర్ణయాలను రూపొందించడం వీరి పని. ఒక సంస్థ భవిష్యత్తు దిశను నిర్ణయించడంలో వీరి పాత్ర కీలకం. ఈ మొత్తం పరిణామం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది.. ఏఐ ఉద్యోగాలను పూర్తిగా తీసివేయడం కాదు; వాటిని మార్చుతోంది. ఇది ఒక ప్రమాదం కాదు. ఇది ఒక అవకాశాల సముద్రం. అయితే ఈ అవకాశాలను అందుకోవాలంటే మన విద్యా వ్యవస్థ కూడా మారాలి. కేవలం డిగ్రీలు సరిపోవు. సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం, విశ్లేషణాత్మక ఆలోచన, సృజనాత్మకత, నిరంతర అభ్యాసం.. ఇవే రేపటి విజయానికి పునాది.

ప్రత్యేకంగా తల్లిదండ్రులు ఒక విషయం గుర్తుంచుకోవాలి. పిల్లలను కేవలం పరీక్షల కోసం సిద్ధం చేయడం కాదు, సమస్యలను పరిష్కరించే వ్యక్తులుగా తీర్చిదిద్దాలి. విద్యార్థులు కూడా ఉద్యోగం కోసం చదవడం కాదు, జ్ఞానం కోసం నేర్చుకోవడం ప్రారంభించాలి. ఇప్పటికే ప్రపంచంలోని పెద్ద సంస్థలు ఏఐ ఆధారిత నిర్ణయ వ్యవస్థల వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఈ మార్పును అర్థం చేసుకుని ముందుకు సాగినవారే భవిష్యత్తును నిర్మిస్తారు. మార్పును భయపడినవారు వెనుకబడిపోతారు. ఈరోజు మనం ఏఐను ఉపయోగిస్తున్నాం. రేపు అదే ఏజీఐ వ్యవస్థలను రూపొందించే తరంగా మన పిల్లలు ఎదగాలి.

- సిద్ధగౌని సుదర్శన్
సెక్రెటరి, తెలంగాణ జర్నలిస్ట్ ల ఫోరమ్
97017 03684
హైదరాబాద్

### లోహవిచిత్రాలు

బంగారు సెగ
కొనెవారికి పొగ
తప్పదిక
ఆహార్యానికి
గిల్టు నగలు...
వెండి మెరపులు
చిరుత పరుగులు
దాటింది
రెండు లకారాలు...
లోహవిచిత్రాలు
పెదలకు
అందని ద్రాక్షలు
అందానికి
నల్లపూసలు

రేడియమ్



### నా సలహా!

నూరేళ్లు ఆరోగ్యం ఖాయం!!
మన బుద్ధులనిండా కులాలు
మతాలు ఎక్కువతక్కువలు
ప్రక్క వాళ్ళమీద ఈర్ష్య లు
అరిషడ్వర్గాలతో నిండిపోతే
నువ్వెన్నిచేసినా ఏమీలేదు!
అవినీతి వదలరు
లంచాలు వదలరు
నిజాయితీ అనేదే లేదు
డబ్బుకోసం ఏ ‘నీచం’
ఐనా సిద్ధపడతారు!
అందుకోసం ఎంత
టెన్షన్ ఐనా పడతారు!
గుండెజబ్బులాగుతాయా
అయ్యప్ప’మాల’వేస్తారు
‘మాల’అయ్యప్పను
గుళ్ళోకి రానివ్వరు!
మరొకడిది కులాహంకారం
మత,ధన అహంకారాలు!!
అందరంహిందుఅంటారు
ఇంకెందుకు ఆ మాల’?
వివక్ష బుద్ధి మారదు!
ప్రేమ కరుణ దయ సహకారం
సమభావం సౌభ్రాత్రంవీటితో
నీ హృదయం నిండి పోవాలి
అలాంటివారి శరీరం లోకి
ఇవన్నీ కుళ్లబెట్టుకుంటే
మీరు ఏం చేసినా ఆరోగ్యం
శ్రీమతేరామానుజాయన్నమః
మీ చేతిలో మాత్రం ఉందా?
ఏంజరిగినా ‘దైవేచ్ఛ’కదూ!

-తమ్మినేని అక్కిరాజు
డల్లాస్ (అమెరికా )

# బతుకు పుస్తకం: కథ నీది.. కలం ఎవరిది?


ఒక్క నిమిషంపరుగు పందెంలా సాగుతున్న మీ దైనందిన జీవితానికి కాస్త విరామం ఇవ్వండి. ఒక్కసారి ఆగి గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించండి – మీరు ఉదయం నిద్రలేచినప్పటి నుండి రాత్రి కళ్ళు మూసే వరకు చేసే ప్రతి పని వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? ఆ పనులన్నీ మీ ఆత్మతృప్తి కోసమా, లేక మిమ్మల్ని గమనిస్తున్న పదిమంది కళ్ళలో మెరుపు చూడటం కోసమా?

కొత్త బట్టలు కొన్నప్పుడు, ఖరీదైన రెస్టారెంట్‌కు వెళ్ళినప్పుడు, లేదా వృత్తిలో ఒక మెట్టు పైకి ఎక్కినప్పుడు మీ మెదడులో మొదట మెదిలే ఆలోచన ఏంటి? “వావ్, ఇది నాకు ఎంతో సంతోషాన్నిస్తోంది” అనా? లేక “దీన్ని ఫోటో తీసి పెడితే ప్రపంచం ఏమనుకుంటుంది?” అనా?

ఈ ప్రశ్నకు నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా సమాధానం చెప్పుకోగలిగితే ఒక చేదు నిజం మన ముఖాన్ని తాకుతుంది. అదేమిటంటే – మన జీవితాలు చాలావరకు మనకు చెందడం లేదు. అవి సమాజపు కళ్ళకు అలంకరించిన రంగుల అద్దాలుగా మారిపోయాయి.

నేటి కాలంలో “Impress చేయడం” అనేది కేవలం ఒక అలవాటు కాదు, అదొక ప్రమాదకరమైన సామాజిక వ్యసనం. సోషల్ మీడియా అనే మాయాలోకం వచ్చిన తర్వాత ఈ పోకడ ఒక మహమ్మారిలా విస్తరించింది. Instagramలో ఒక్క ఫోటో పోస్ట్ చేయడానికి ముందు, మనం తీసుకునే డజన్ల కొద్దీ రీటేక్లు దేనికి సంకేతం? మనలోని అభద్రతకు కాదా? ఆ ఫోటో కింద పడే ప్రతి లైక్ మన ఆత్మవిశ్వాసాన్ని నిర్ణయిస్తోంది. ప్రతి కామెంట్ మన ఉనికిని ధ్రువీకరిస్తోంది.

అంటే, మన సంతోషం మన చేతుల్లో లేదు, ఎవరో గుర్తు తెలియని వ్యక్తి ఇచ్చే డిజిటల్ రియాక్షన్ మీద ఆధారపడి ఉంది. ఇది కేవలం వర్చువల్ ప్రపంచానికే పరిమితం కాలేదు. మన నిజ జీవితంలోని ప్రతి అడుగులోనూ ఈ ‘ప్రదర్శన బుద్ధి’ కనిపిస్తోంది. పిల్లలను ఏ స్కూల్లో చేర్పించాలి? మన ఇంటి సోఫా సెట్ ఏ రంగులో ఉండాలి? పెళ్ళికి ఎంత ఖర్చు చేయాలి? ఈ నిర్ణయాల వెనుక మన అవసరం కంటే, లోకం ఏమనుకుంటుంది? అనే భయమే రాజ్యమేలుతోంది.



మనం ఒక అదృశ్య జైలులో బందీలుగా మారాం, ఆ జైలు గోడల పేరు లోకాచారం. పరువు కాపాడుకోవడం సంస్కారం కావచ్చు, కానీ ఆ పరువు అనే భ్రమ కోసం మన సహజత్వాన్ని చంపుకోవడం ఆత్మహత్యతో సమానం.

మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు దీనిని Social Validation (సామాజిక ఆమోదం) అని పిలుస్తారు. నిజానికి మనిషి సంఘజీవి కాబట్టి, ఇతరుల ఆమోదం కోరుకోవడం సహజ సిద్ధమైన లక్షణం. ఆదిమానవుడి కాలంలో తెగ నుండి వెలివేయబడటం అంటే చావుతో సమానం. అందుకే అందరితో కలిసి ఉండటం, అందరి దృష్టిలో మంచిగా అనిపించుకోవడం అప్పట్లో మనుగడకు అవసరం.

కానీ నేడు కాలం మారింది. మనం ఇప్పుడు అడవుల్లో లేము, అపార్ట్‌మెంట్లలో ఉన్నాం. అయినా మన మెదడులోని ఆ పాత సాఫ్ట్‌వేర్ ఇంకా అప్‌డేట్ అవ్వలేదు. అప్పుడు తెగ నుండి వెలివేస్తారనే భయం ఉంటే, ఇప్పుడు ఫేస్‌బుక్‌లో అన్‌ఫ్రెండ్ చేస్తారేమో, సమాజంలో తక్కువ చేసి చూస్తారేమో అనే భయం మనల్ని వెంటాడుతోంది. రూపం మారింది కానీ, ఆ మానసిక వేదన మాత్రం అలాగే ఉంది.

మన తెలుగు సమాజంలో ఈ సమస్య ఇంకాస్త గాఢంగా ఉంటుంది. పరువుప్రతిష్ఠ, ముక్కు మొహం తెలియని పక్కింటి వారు వీరే మన జీవిత చిత్రకారులు. ఒక యువకుడు తనకిష్టమైన సంగీతాన్ని వదిలేసి ఇంజినీరింగ్‌లో చేరుతున్నాడంటే, అది వాడి ఇష్టం కాదు.. పక్కింటి అబ్బాయి డాక్టర్ అయ్యాడనే తండ్రిగారి అహానికి సమాధానం. ఒక అమ్మాయికి నచ్చిన రంగు కంటే, అత్తగారి బంధువులు మెచ్చే రంగుకే ప్రాధాన్యత లభిస్తుంది.

ఇలా ప్రతి చిన్న విషయంలోనూ నిర్ణయం మనదే అయినా, దాని వెనుక ఉన్న సాక్ష్యం మాత్రం ఎప్పుడూ ఎదుటివారే అవుతున్నారు.

ప్రముఖ మనస్తత్వవేత్త అబ్రహం మాస్లో మానవ అవసరాల గురించి చెబుతూ Self-Actualization (ఆత్మ సాక్షాత్కారం) గురించి ప్రస్తావించారు. అంటే ఒక వ్యక్తి తనలోని పరిపూర్ణ సామర్థ్యాన్ని గుర్తించి, తనకోసం తాను జీవించడం. కానీ మనం ఆ స్థాయికి ఎప్పటికీ చేరుకోలేకపోతున్నాం. ఎందుకంటే మన శక్తినంతా ఇతరులకు నచ్చేలా ఉండటం అనే ప్రక్రియలోనే ఖర్చు చేస్తున్నాం.

ఇది ఒక విచిత్రమైన వైరుధ్యం – మనం అందరికీ నచ్చాలని ఎంతలా తాపత్రయపడతామో, అంతగా మనకు మనం నచ్చడం తగ్గిపోతాం. వేదిక మీద నటిస్తున్న నటుడు ముసుగు తీసిన తర్వాత తన నిజ స్వరూపాన్ని చూసి భయపడే పరిస్థితి మనది. మనమంతా ముసుగులు వేసుకుని తిరుగుతున్నాం, ఒక్కోసారి ఆ ముసుగే మన అసలు ముఖం అని భ్రమపడుతున్నాం.

గుర్తింపు కోరుకోవడం తప్పు కాదు. కానీ ఆ గుర్తింపు కోసమే బతకడం మాత్రం ప్రమాదకరం. మీరొక అద్భుతమైన పెయింటింగ్ వేశారు అనుకుందాం. దాన్ని ఎవరూ మెచ్చుకోకపోతే ఆ చిత్రంలోని కళ తగ్గిపోతుందా? లేదు కదా! మరి మీ జీవితం మాత్రం ఎందుకు ఇతరుల ప్రశంసల మీద ఆధారపడాలి?

నీ జీవిత కథను నువ్వు రాసుకోకపోతే, ఎవరో ఒకరు రాస్తారు. అది ఖచ్చితంగా వారికి నచ్చిన కథే అవుతుంది తప్ప నీ కథ అవ్వదు. మనం ఈ ప్రదర్శనల ప్రపంచం నుండి బయటపడి, ప్రశాంతమైన జీవితం వైపు అడుగులు వేయాలంటే మూడు సూత్రాలు పాటించాలి:

ఏదైనా పని చేసే ముందు “నేను ఇది ఎందుకు చేస్తున్నాను?” అని ప్రశ్నించుకోండి. అది మీ మనసు లోతుల్లోంచి వస్తున్న కోరికా లేక లోకం చూస్తుందనే భయమా? భయం నుండి పుట్టే ఏ పనీ శాశ్వత సంతోషాన్ని ఇవ్వదు.

ప్రతిదీ గ్రాండ్‌గా, అద్భుతంగా ఉండాల్సిన అవసరం లేదు. పదిమందికి కనిపించే వైభవం కంటే, నీ మనసుకు తెలిసే ప్రశాంతత మిన్న. ఒక చిన్న ఇల్లు, నిజమైన ప్రేమాభిమానాలు ఉన్న కుటుంబం – ఇవే జీవితానికి అసలైన అర్థాన్నిస్తాయి.

మీరు ఎవరి కోసం జీవిస్తున్నారో ఒక లిస్ట్ రాయండి. అందులో మీ పేరు మొదటి స్థానంలో ఉందా? లేకపోతే వెంటనే దాన్ని సవరించుకోండి.

మిమ్మల్ని మీరు ప్రేమించుకోలేనప్పుడు, లోకం మిమ్మల్ని ప్రేమిస్తుందని ఆశించడం వృథా. మిత్రమా, ఈ సమాజం నిన్ను కీర్తించినా, విమర్శించినా నీ విలువలో మార్పు రాదు.

ప్రకృతిని గమనించండి. ఒక పువ్వు తన అందాన్ని లోకానికి ప్రదర్శించాలని పూయదు, అది తన స్వభావం కాబట్టి పూస్తుంది. ఒక చెట్టు పక్షుల కోసం పండ్లను ఇవ్వదు, అది పండడం దాని నైజం. మనం కూడా అంతే.. మన సహజత్వాన్ని కోల్పోకుండా జీవించడమే నిజమైన శక్తి.

ఈ రోజే ఒక నిర్ణయం తీసుకోండి. ఎవరినో ఇంప్రెస్ చేయడానికి అనవసరమైన భారాలు మోయకండి. అద్దంలో చూసుకున్నప్పుడు మీకు నచ్చే వ్యక్తిగా మారండి. ఎందుకంటే, జీవితం అనే ఈ అద్భుతమైన కావ్యాన్ని చదివేది లోకం కావచ్చు, కానీ ఆ ప్రతి అక్షరాన్ని అనుభవించేది మాత్రం నువ్వే. నీ జీవితాన్ని నీ చేతుల్లోకి తీసుకోనీలా నువ్వు బతుకు!

డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

## బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

• జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని నాంపల్లిలో జరిగిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలకు హాజరై ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలు, దురాచారాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. స్వాతంత్ర భారతదేశ తొలి దశలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పని చేశారని, తదనంతరం రాజకీయాలలో ఎదుగుతూ కేంద్ర వ్యవసాయ, రక్షణ శాఖల మంత్రిగా సేవలందించి,ఉప ప్రధానమంత్రిగా దేశానికి కీలక సేవలు అందించారని తెలిపారు. దాదాపు ఐదు దశాబ్దాలపాటు ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడిగా ఆయనను స్మరించారు. బాబు జగ్జీవన్ రామ్ డాక్టర్ అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ దళిత వర్గాలకు రిజర్వేషన్ల అమలులో కీలక పాత్ర పోషించారని తెలిపారు కార్మిక, వ్యవసాయ, రక్షణ మంత్రిగా,ఉప ప్రధానమంత్రిగా దేశానికి విశేష సేవలు అందించిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కొరకు మనం అందరం కలిసి పని చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామరావు, దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత స్వయం ఉపాధి ఎంచుకొని లబ్ధి పొందాలి



మోమిన్‌పేట, ఏప్రిల్ 5 (జనం సాక్షి) : నేటి సమాజంలో యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధార పగలకుండా స్వయం ఉపాధిని ఎంచుకొని తనకాలపై తాను సమాజానికి ఆదర్శంగా నిలవాలని బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పట్లల్ల వరప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బూరుగుపల్లి బస్టాండులో నూతనంగా జై భవాని ఫుడ్ కార్నర్, చాయ్ చౌరస్తా చౌరస్తాను,ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన కల్తీ లేని రుచికరమైన పదార్థాలను అందించాలని ఆయన సూచించారు. ఈ ప్రాంత చుట్టుపక్కల గల ప్రజలు ఈ ఫుడ్ కార్నర్ ను,వినియోగించుకోవాలని కోరారు. జై భవాని మాత ఫుడ్ కార్నర్ యజమాని నెనావత్ గణపతి నాయక్ ను ఆయన అభినందించారు. ఫుడ్ కార్నర్ సరైన రీతిలో నిర్వహించి వినియోగదారుల మండల పొంది అభివృద్ధిలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో లచ్చునాయక్ తాండ, సర్పంచ్, లక్ష్మి రాజు, రాళ్లగుడ్ పల్లి, సర్పంచ్ మహిపాల్, ఉప సర్పంచ్ బాలు గౌడ్,అర్జున్, అవినాష్, తాండ,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్

• జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి




**జడ్చర్ల, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. ఆదివారం బాలానగర్ మండల కేంద్రంలో నిర్వహించిన మన బాలానగర్, రాజాపూర్ క్రికెట్ లీగ్ ముగింపు వేడుకల్లో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతకు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని ఇస్తాయని, తద్వారా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని, యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి కీర్తి తీసుకురావాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇలాంటి పోటీలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## భోజనం ప్రియులకు రుచికరమైన నాణ్యమైన ఆహారం అందించాలి

• ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కాప్రా, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** భోజన ప్రియులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించి వాళ్ళ మనలను పొందాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఈసీఐఎల్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన భ్రమరాంబ ఫుడ్ కోర్ట్ పోరంబోత్సవానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గారు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో భోజన పీలకు రుచికరమైన ఆహారాన్ని అందించి వారు మండలాలలో పొందాలని ఆయన పేర్కొన్నారు. యువత అన్ని రంగాల్లో ముందుండాలని ఇలాంటి ఫుడ్ కోర్టులో వినియోగదారులకు నాణ్యత అందించాలని ఆయన సూచించారు నిర్వాహకులు సాయి దంపతులను ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ,సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాసం మైపాల్ రెడ్డి, కుమారస్వామి, పాండాల శివకుమార్ గౌడ్,రహీం, తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర నాయకులు రేగళ్ల సతీష్ రెడ్డి, పోలూరి నాగార్జున, పిల్లి సాయిరాం, మల్లికార్జునరావు, కుమార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ అభివృద్ధికి మరో మైలురాయి

• సీఆర్ఎంపీ కింద భారీ నిధుల మంజూరు

**ఉప్పల్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి కృషి ఫలితంగా సమగ్ర రహదారి నిర్వహణ కార్యక్రమం (సీఆర్ఎంపీ) కింద భారీగా నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఉప్పల్ పరిధిలో రహదారి అభివృద్ధి పనులు కొత్త దశకు చేరనున్నాయి. ఉప్పల్ డివిజన్‌కు సీఆర్ఎంపీ కింద మొత్తం రూ.31.70 కోట్ల నిధులు కేటాయించగా, పలు ప్రధాన రహదారుల నిర్మాణం, మరమ్మత్తు పనులు చేపట్టనున్నారు. ఉప్పల్ ఎక్స్ రోడ్ నుండి నాగోల్ బ్రిడ్జ్ వరకు రూ.12 కోట్లు, నాగోల్ మెట్రో స్టేషన్ నుండి గాంధీనగర్ రోడ్ నెం.2 వరకు రూ.1.20 కోట్లు, సత్యనగర్ కల్వర్ట్ నుండి విజయపురి కాలనీ వరకు రూ.4.50 కోట్లు, మెట్రో నుండి వరంగల్ హైవే వరకు రూ.3.20 కోట్లు, గ్లోబల్ స్కూల్ నుండి ఉప్పల్ హిల్స్ వరకు రూ.2.70 కోట్లు వంటి పలు కీలక పనులకు నిధులు మంజూరయ్యాయి. అదనంగా పలు కాలనీలలో రహదారి నిర్వహణ పనులకు కూడా నిధులు కేటాయించబడినవి. ఈ సందర్భంగా ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. "పరమేశన్న సారథ్యంలో ఉప్పల్ ప్రగతి వేగంగా కొనసాగుతోంది" అని ఆమె పేర్కొన్నారు. ఇదే క్రమంలో చిలుకానగర్–బీరప్పగడ్డ డివిజన్‌కు కూడా సీఆర్ఎంపీ కింద భారీగా నిధులు మంజూరయ్యాయి. మొత్తం రూ.16.40 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అకిటి ఆగం రెడ్డి ఆధ్వర్యంలో రాఘవేంద్ర నగర్ కాలనీ చౌరస్తాలో పరమేశ్వర్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఫేజ్ కింద వరంగల్ హైవే జంక్షన్ నుండి చిలుకానగర్ ఎక్స్ రోడ్ వరకు రూ.5.50 కోట్లు, మీ సేవా ఎన్‌జీఆర్ఐ జంక్షన్ నుండి హైకోర్టు కాలనీ వరకు రూ.2.90 కోట్లు, ఎల్‌ఎఫ్‌జేసీ జంక్షన్ నుండి హనుమాన్ ఆలయం వరకు రూ.1.90 కోట్లు, ఇందిరాగాంధీ విగ్రహం నుండి ఈస్ట్ కళ్యాణపురి వరకు రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. ఫేజ్ కింద బ్యాంక్ కాలనీ నుండి రాఘవేంద్ర కాలనీ వరకు రూ.4.50 కోట్లు కేటాయించబడ్డాయి. ఈ సందర్భంగా అకిటి ఆగం రెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ



సీనియర్ నాయకులు బజాజ్ జగన్ గౌడ్, కొంపల్లి బాలరాజ్, ముల్కపల్లి రాజేష్ ముదిరాజ్, నల్లవెల్లి మహేందర్ ముదిరాజ్, సందీప్, మాచర్ల బలరాం, జెర్రిపోతుల చంద్రయ్య, శ్రీరాములు, బొట్టు రాజేష్, గీత, పల్నాటి డేవిడ్, నారోజు రాధాకృష్ణ, బి.యం. కిరణ్, శ్రావణ్, జగదీష్, సోను, ఫయుం, యూజమా బేగం, జైనబ్ బేగం, సాదియా, సురేందర్, మహమ్మద్ నవాబ్, లావోడు కుమార్, ఆసిఫ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. మొత్తంగా ఉప్పల్ నియోజకవర్గంలో భారీగా మంజూరవుతున్న నిధులతో రహదారి అభివృద్ధి పనులు వేగవంతమవుతుండగా, ప్రజల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

## ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, శాసనసభ్యులు చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు తదితరులు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నటరాజ్ థియేటర్ సమీపంలో నిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ చిన్నతనం నుంచే కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, ఉన్నత ఆలోచనలు, కష్టపడి పనిచేయడం, నిబద్ధతకు మారుపేరుగా నిలిచారని పేర్కొన్నారు. యువత ఆయన చూపిన మార్గంలో నడిచి సమానత్వ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో యువత సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బాబు జగ్జీవన్ రామ్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు, యువత ముందుకు సాగాలని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు.

## కడియాల పోచయ్య సేవలు మరువలేనివి



**కాప్రా, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** చర్లపల్లి అభివృద్ధికి కడియాల పోచయ్య చేసిన సేవలు మరువలేని అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చెర్లపల్లి బస్ స్టాప్‌లో నాయకుడు కడియాల పోచయ్య జ్ఞాపకార్థం అపోలో వైద్యశాల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మల్కాజ్గిరి అదనపు కమిషనర్ వెంకటరమణ, చర్లపల్లి ఐల చైర్మన్ గోవింద్ రెడ్డి, మాజీ చైర్మన్లు కట్టంగూరు హరీష్ రెడ్డి, రోషి రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పావని మణిపాల్ రెడ్డి, సింగరెడ్డి ధన్పాల్ రెడ్డి, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డిలతో కలిసి వేరుగారుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరంలో హాజరైన 500 మందికి పైగా వైద్యులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, తాటి శ్రీనివాస్, నాయకులు గిరిబాబు, బూడిద శ్రావణ్ కుమార్, డప్పు యాదయ్య, నాగిళ్ల బాల్రెడ్డి,బాబు, భరత రాజ్, అనిల్ కుమార్, గడ్డం యాదగిరి, రెడ్డి నాయక్, శ్రావణ్ కుమార్, లోకనాథ్, విజయ్ రాజ్, గణేష్, ధీరజ్ బాలాజీ, అఖిల్, శివంలతో పాటు అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

## చౌక దుకాణాల పనితీరు ఆదర్శం

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 5 (జనం సాక్షి) : మెదక్ జిల్లాలో చౌక దుకాణాల పనితీరు ఆదర్శంగా ఉందని నిత్యావసర వస్తువుల పంపిణీలో పారదర్శకత, జవాబుదారీతనం క్షేత్రస్థాయిలో కనపడుతుందని,పిడీఎస్ ప్రయోజనాలు పారదర్శకంగా, సమర్థవంతంగా ఉద్దేశించిన లబ్ధిదారులకు చేరేలా చూడటం కోసం పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు ఎలాంటి వదంతులు అసత్య ప్రచారాలు నమ్మకుండా ప్రశాంతంగా తమకు లభ్యమయ్యే మూడు నెలల రేషన్ ఈ నెల 30 వరకు పొందాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పత్తి నగర్ ప్రాంతంలో షాప్ నెంబర్ -04 చౌక ధరల దుకాణాన్ని కలెక్టర్, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, పౌరసరఫరాల ఇన్స్పెక్టర్ నరసింహులు, సిబ్బంది నాగరాజుతో కలిసి ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్టాక్ ను తూకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు లబ్ధిదారులతో సంభాషించారు. చౌక ధరల దుకాణాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని లబ్ధిదారులు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి నిత్యావసర వస్తువుల పంపిణీ జరగాలని ఆదేశించారు. లబ్ధిదారులు లేవనెత్తిన ఏవైనా సమస్యలు లేదా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ సిబ్బంది సివిల్ సప్లై సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రవాణాపై ఉక్కు పాదం

• 69 బస్తాల బియ్యం స్వాధీనం
• జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** జిల్లా టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో తాజాగా నిర్వహించిన దాడుల్లో రేషన్ బియ్యం అక్రమ నిల్వలను పట్టుకోవడంతో పాటు, పేకాట స్థావరంపై దాడి చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ కేసుల వివరాలను వెల్లడించారు.రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై కుల్కచర్ల మండల కేంద్రంలో పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తున్నారనే సమాచారంతో టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా బృందం మెరుపు దాడులు నిర్వహించింది. కుల్కచర్ల గ్రామానికి చెందిన అంగడి ప్రదీప్ (38) తన నివాసంలో నిల్వ ఉంచిన 38 బస్తాల (1900 కిలోలు) బియ్యాన్ని, అలాగే ముగుద రవితేజ (28) తన దుకాణంలో దాచిన 31 బస్తాల (1550 కిలోలు) బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 34.5 క్వింటాళ్ల ప్రభుత్వ బియ్యాన్ని సీజ్ చేసి, నిందితులను కుల్కచర్ల పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడం జరిగినట్లు ఎస్పీ తెలిపారు.

### తాండూరులో పేకాట రాయుళ్ల అరెస్ట్



మరో ఘటనలో, తాండూరు పట్టణంలోని మాణిక్‌నగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో బండి శ్యామ్, కె. చందర్, నాస్కంటి నర్సింలు, అలంపల్లి రాము, బిచం రాజు, వి. తిరుపతి అనే ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 3,050 నగదును స్వాధీనం చేసుకుని, తాండూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వివరించారు.జిల్లాలో పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించినా, లేదా బహిరంగ ప్రదేశాల్లో పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా సహించే ప్రసక్తే లేదు. చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడమైనది. ప్రజలు కూడా ఇలాంటి చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడితే పోలీసులకు తెలియజేయాలి అని ఎస్పీ స్నేహ మెహ్రా స్పష్టం చేశారు.

# బాబు జగ్జీవన్ రామ్ బాటలో నడుద్దాం

• సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు
• పీడిత వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు
• తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** బాబు జగజ్జీవన్ రామ్ వంటి గొప్ప వ్యక్తి సూచించిన మార్గంలో మనమందరం నడవాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపు నిచ్చారు.ఆదివారం వికారాబాద్ పట్టణంలో జరిగిన స్వాతంత్ర్య సమరయోధులు, దివంగత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొని స్పీకర్ మాట్లాడుతూ...సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధులు, సంఘ సంస్కర్త, దివంగత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అన్నారు.బాబూజీగా ప్రసిద్ధి చెందిన జగ్జీవన్ రామ్ కేంద్రంలో వివిధ శాఖల మంత్రిగా, ఉప ప్రధానిగా సుదీర్ఘ కాలం దేశానికి సేవలు చేశారని ఆయన తెలిపారు. స్వాతంత్రోద్యమం సందర్భంగా క్విట్ ఇండియా, సత్యాగ్రహం తదితర కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని జైలుకు వెళ్లారని, 1935లో అంటరానితనం పారదోలేందుకు, ప్రజలందరికి సమానత్వం కోసం "ఆలిండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్"అనే సంస్థ ఏర్పాటులో బాబు జగ్జీవన్ రామ్ ప్రముఖ పాత్ర పోషించారని ఆయన అన్నారు. రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ తో కలిసి సామాజిక న్యాయం కోసం తన వంతు కృషి చేశారని తద్వారా రాజ్యాంగ ఫలాలు దేశంలోని అట్టడుగు వర్గాలకు అందడంలో ఆయన భూమిక పోషించారని తెలిపారు. 1971 యుద్ధ సమయంలో రక్షణ శాఖ మంత్రిగా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఆదేశాలకు అనుగుణంగా సేనలను నడిపించి బంగ్లాదేశ్ ఏర్పాటులో ఆయన కీలకపాత్ర పోషించారని స్పీకర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ జ్ఞానాన్ని పెంపొందించేందుకు వీలుగా స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలంటే విద్య ద్వారానే సాధ్యమని దీనిపై ఎక్కువ శ్రద్ధ చూపాలని కలెక్టర్ తెలిపారు. మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర పోరాటంలో పాల్గొనడమే కాకుండా స్వతంత్ర భారత రాజకీయాల్లో ఎన్నో ఉన్నత పదవుల్లో ఉండి హరిత విప్లవ ఉద్యమం, ఇండియా పాకిస్థాన్ యుద్ధ సమయం ప్రధాన పాత్ర పోషించారని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ... ప్రజలందరికీ సమాన అవకాశాలు కలగాలని ఎంతో మంది మహనీయులు కృషి చేశారన్నారు. ముందుగా



బిజేఆర్ చౌరస్తాలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి స్పీకర్ ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా, ఎమ్మెల్యే యాదయ్య, ప్రజా ప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జయంతి ఉత్సవాల్లో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య , వైస్ ఛైర్మన్ సుధాకర్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, ఎస్సీడి డబ్ల్యూఓ జైపాల్ రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి రామచంద్రయ్య, పుష్పా రాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భక్తుల కొంగు బంగారం శ్రీ వీరభద్రేశ్వరుడు

- నేటి నుండి స్వామి వారి జాతర మహోత్సవాలు

**రాయికోడు, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** మండల కేంద్రమైన రైకోడ్ లో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రే శ్వరుడు భక్తుల కొంగు బంగారంగా వీరాజిల్లుతున్నాడు. ఈనెల 6 నుండి 11 వరకు స్వామి వారి జాతర మహోత్సవాలు కొనసాగనున్నట్లు ఆలయ చైర్మన్ సతీష్ కులకర్ణి, ఈవో శివ రుద్రప్పలు తెలిపారు.

### స్థల పురాణం

సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన రాయికోడ్ లో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి దేవస్థానం అతి ప్రాచీన మైన పుణ్యక్షేత్రం. 14, 15 వ శతాబ్దము మధ్యకాలం అనగా కాకతీయులు విజయనగర సామ్రాజ్యముల మధ్య కాలానికి చెందినది. విజయనగర సామ్రాజ శిల్ప రీతిలో గల ఈ విగ్రహాలు రాయలసీమ ప్రాంతం నుండి రాయికోడు మీదుగా కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దుల ప్రాంతానికి చెందిన భక్తులు వారి ప్రాంతానికి తరలిస్తుండగా రాత్రి చీకటి పడగా రాయికోడ్ లోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయ ప్రాంగణంలో సేద తీరారు. వాళ్లు తిరిగి ఉదయం బయలుదేరు సమయానికి విగ్రహం ఎంతకు కదలక పోవడంతో మర్నాడు రాత్రి వారికి స్వామి వారు గజ్జల సవ్వడి గంటారావముల శబ్దములతో వారికి దర్శనం ఇచ్చి ఇదే నాకు సరైన పుణ్యక్షేత్రం అని నేను ఇక్కడే స్వయం ప్రతిష్టంగా వెలుగోందు తానని పలికెను. నేటికీ కర్ణాటక, మహారాష్ట్ర ప్రజలు ఇలవేల్పుగా దేదిప్యమానంగా వెలుగొందుతుంది. ఏకశిలా విగ్రహము 6.5 అడుగుల ఎత్తు, 6 అడుగుల వెడల్పు కలిగిన శిలపై శ్రీ వీరభద్రేశ్వర స్వామి, భద్రకాళి అమ్మవారు ఒకే శిలపై ఏ ఆధారం లేకుండా ఉన్న స్వామి అమ్మవార్ల శీల సౌందర్యం వర్ణనాతీతము. చూపు మరల్చారాని అద్వితీయము అమరము. ప్రచండ ప్రతాప రుద్ర రౌద్రావతారమైన ఈ రాయికోడు వీరభద్రుడు ఉదయం బాల వీరభద్రుడిగా మధ్యాహ్నము యువ వీరభద్రుడిగా సాయంత్రం వృద్ధ వీరభద్రుడిగా నేటికీ భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఈ నాటికి శ్రీ వీరభద్రుడు తన మహిమను ప్రదర్శిస్తూనే ఉన్నాడు. భక్తులకు కలలో గజ్జల సవ్వడులు. గంటరావములతో ప్రత్యక్షమై వారి కోరికలను తీర్చుతూ కర్తవ్య నిర్వహణని తెలియజేస్తున్నాడు. శ్రీ వీరభద్రేశ్వర స్వామి వారి పేరున ముడుపులు,మొక్కులు మొక్కిన వారు వారి అనుభవాలు నేటికీ వివరిస్తూనే ఉన్నారు. వారు వివరించిన భావముల సారము శ్రీ వీరభద్రేశ్వర స్వామి వారిని దర్శించిన, పూజించిన, స్మరించిన, దీపారాధనం, సకల ఐశ్చర్య ఆరోగ్యం కలుగును. దుష్ట గృహ దోషములు భూత ప్రేత పిశాచాది భయమును తొలగిపోవును. ఇట్టి విషయాలు స్కంద



పురాణంలో సైతం వివరించబడినవి. మత్స్య పురాణంలో దేవి భాగవతంలో చెప్పిన విధంగా 108 శక్తి పీఠాలలో ఈ శ్రీ భద్రకాళి దేవి కూడా ఉండడం విశేషం. ఇటీవల సితిలమైన గుండం ప్రాంతంలో నూతన గుండము నిర్మించగా ఆ గుండం లోనికి జలధారలు, తూర్పు దిశగా ఉన్న నీరు తీయగా, దక్షిణ దిశలోని నీరు ఉప్పుగాను, ఉత్తరం దిక్కునీరు చప్పగాను ఉంటాయి. దిన దినాభివృద్ధి చెందుతున్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానం జాతర మహోత్సవ కార్యక్రమాలు ఈ విధంగా ఉన్నాయి.

### 6 నుండి 11 వరకు జాతర మహోత్సవాలు

7న రథోత్సవ మహోత్సవం, ఈనెల 6 నుండి 11 వరకు శ్రీశ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి జాతర మహోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సతీష్ కులకర్ణి, ఈవో శివ రుద్రప్పలు తెలిపారు. అరుణ సోమవారం ఉదయం ధ్వజారోహణం, శిఖర పూజ, శ్రీ వీరభద్రేశ్వర స్వామి అభిషేకం, భద్రకాళి అమ్మవారి కుంకుమార్చన, బసవేశ్వర అభిషేకం, ఉదయం 11 గంటలకు శ్రీశ్రీ శివాచార్య గంగాధర స్వామి హీరెమట్ బీదర్ యొక్క పాద పూజ, తీర్థ ప్రసాదములు,రాత్రి 9 గంటలకు వివిధ గ్రామాల కళాకారులచే భజన కీర్తనలు నిర్వహించబడునన్నారు. ఈ నెల 7న మంగళవారం ఉదయం 5 గంటలకు శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి మహా రుద్రాభిషేకం, 6 గంటల నుండి పల్లకి సేవ, అగ్నిగుండం, మధ్యాహ్నం మూడు గంటలకు భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం, శ్రీశ్రీ సద్గురు సోమలింగ శివాచార్య మహాస్వామి బిచ్కుంద గార్లచే తీర్థ ప్రసాద విధారణ, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం కార్యక్రమము, శ్రీ వీరభద్రేశ్వర దేవాలయం నుండి బసవేశ్వర మందిరమునకు చేరును అన్నారు. అదేరోజు రాత్రి పది గంటల నుండి పెద్దిరాజు పెద్దమ్మ నాటక ప్రదర్శన మొదటి భాగం రాయికోడు వారిచే నిర్వహించబడు నన్నారు. ఈనెల 8న బుధవారం ఉదయం 8 గంటలకు శ్రీ వీరభద్రేశ్వర భద్రకాళీ మాత మల్లికార్జున సహస్ర బిల్వార్చన, అనంతరం శ్రీ వీరాంజనేయ స్వామి పూజ, సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునన్నారు. అదే రోజు రాత్రి 9 గంటల నుండి భజన కార్యక్రమాలు కొనసాగుతాయి అన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు శతనామవళితో బిల్వార్చన, భద్రకాళి మాత కుకుమార్చన, అదేరోజు రాత్రి 9 గంటలకు పెద్దిరాజు పెద్దమ్మ నాటక ప్రదర్శన రెండవ భాగం నిర్వహించబడును అన్నారు. ఈ నెల 10న శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు శ్రీ వీరభద్రేశ్వర అభిషేకం, ఆకుల పూజ, దంపతుల పూజ,రాత్రి 9 గంటలకు వివిధ గ్రామాల కళాకారులచే భజన కీర్తన నిర్వహించబడునన్నారు. ఈనెల 11న శనివారం ఉదయం ఎనిమిది గంటలకు శ్రీ వీరభద్రేశ్వర భద్రకాళి మాత అమ్మవారి అభిషేకం. సాయంత్రం 5 గంటలకు రథోత్సవం తిరిగి బసవేశ్వర మందిరం నుండి శ్రీ వీరభద్రేశ్వర దేవాలయమునకు చేరును అన్నారు. అదే రోజు రాత్రి 9 గంటలకు పెద్దిరాజు పెద్దమ్మ నాటక ప్రదర్శన మూడవ భాగం నిర్వహించబడునన్నారు. జాతరలో ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించబడుతుంది అన్నారు. అన్నదానం చేయాల్సిన దాతలు కార్యాలయం నందు సంప్రదించాలని వారు కోరారు. వివిధ గ్రామాల్లోని భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు అయి తీర్థ ప్రసాదములు స్వీకరించాలని చైర్మన్ సతీష్ కులకర్ణి, ఈవో శివ రుద్రప్పలు తెలిపారు.

### వీరభద్రేశ్వర స్వామి జాతర నిర్వాణకు అన్ని ఏర్పాట్లు పూర్తి



శ్రీశ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి జాతర నిర్వహణ కొరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చైర్మన్ సతీష్ కులకర్ణి తెలిపారు. జాతర సందర్భంగా ప్రతిరోజు దేవాలయంలో అన్నదాన కార్యక్రమం కొనసాగించనున్నట్లు చెప్పారు. ఈనెల 7న నిర్వహించనున్న రథోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. వివిధ గ్రామాలలోని భక్తులు జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**చైర్మన్ సతీష్ కులకర్ణి**

## భూ సమస్యలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని వినతి



**వెల్దండ, ఏప్రిల్ 05 (జనంసాక్షి) :** మండల పరిధిలోని కుప్పగండ్ల, చెదురుపల్లి గ్రామాలలో వివిధ భూ సమస్యలు నెలకొన్న తరుణంలో ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కారమయ్యే దిశగా చర్యలు చేపట్టాలని మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు వర్త్యవత్ భాగ్యమ్మ పూల్ సింగ్ నాయక్ కల్వకుర్తి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల రెండో తేదీన తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ఆమనగల్లు లో వెల్దండ మండలానికి చెందిన కుప్పగండ్ల సీలింగ్ పట్టా భూముల గురించి చెదురుపల్లి కారేజ్ ఖాతా భూముల గురించి మాట్లాడి కాంగ్రెస్ ప్రభుత్వం మీ అందరికీ న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్యులు మాట ఇచ్చినందుకు ఎమ్మెల్యే గారిని హైదరాబాదులో వారి స్వగృహం వద్ద సర్పంచుల సంఘం అధ్యక్షుడు భాగ్యమ్మ ఫుల్ సింగ్ గారి ఆధ్వర్యంలో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్వత్ రెడ్డి మాజీ ఎంపీటీసీ సభ్యులు చల్ల వెంకట్రెడ్డి మరో మాజీ ఎంపీటీసీ తగుళ్ల రామచంద్రయ్య ప్రృదంద్రులకు చెందిన వివిధ గిరిజన నాయకులు పాల్గొని ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కాంగ్రెస్‌లో నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరిక



**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** మండలంలోని తుర్కల మాందాపూర్ గ్రామ ఉపసర్పంచ్ సంగీత కుమారి శ్రీధర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేందర్ కాంగ్రెస్ పార్టీ కి రాజీనామా చేసి బి.ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పట్లోరి రాజు ఆధ్వర్యంలో బి.ఆర్.ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు లిశ్రీమతి పద్మ దేవేందర్ రెడ్డి నివాసంలో బి.ఆర్.ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ బిక్షపతి గౌడ్ తాజా మాజీ ఎంపీటీసీ ప్రసాద్ గౌడ్ తాజా మాజీ ఉపసర్పంచ్ మహేందర్ పార్టీ గ్రామ అధ్యక్షుడు భీమరి మల్లేష్, నాయకులు భీమరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా జలాలను వృథా కాకుండా వాడుకోవాలని చెప్పిన మంత్రి



**మాగనూర్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** మాగనూరు మండలం కొల్పూరు గ్రామం వద్ద మినీ జూరాల ప్రాజెక్టు కృష్ణా జలాలను వృధా కాకుండా ఒడిసి పట్టుకోవాల్సిన బాధ్యత తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాల పైన ఉందన్నారు. రాష్ట్ర క్రీడా, పాడిపరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. ఈ రోజు రాయచూర్ లో కర్ణాటక రాష్ట్ర ప్రజా ప్రతినిధులు, నీటి పారుదల శాఖ అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమావేశమయ్యారు. కృష్ణా నదికి వరదలు సంభవించినప్పుడు వందల టీఎంసీ ల నీరు సముద్రం లోకి వృధాగా పోతుందని, ఈ నీటిని ఎలా సద్వినియోగ పరచుకోవాలనే అంశం పై ఇరువురు మంత్రులు సుదీర్ఘంగా చర్చించారు. కృష్ణా జలాలను కాపాడుకోగలిగితే మక్తల్ నియోజకవర్గం తో పాటు నారాయణపేట,కొడంగల్ నియోజకవర్గాలకు సాగు, తాగు నీటి అవసరాలు తీర్చవచ్చని అభిప్రాయపడ్డారు. అయితే మాగనూర్ మండలం కోల్పూర్ గ్రామం వద్ద నుండి ప్రారంభమై అటుపక్క కర్ణాటక కృత్తికొండ గ్రామం మినీ జూరాల ప్రాజెక్టు ఎనిమిది మీటర్ల ఎత్తు వరకు నీళ్లు నిలిచే విధంగా ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించనైనది ఈ కార్యక్రమంలో మాగనూరు మండల అధ్యక్షులు ఆనంద్ గౌడ్, కృష్ణ మండలం మ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజప్ప గౌడ, మాగనూరు కృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజమే దేవాలయం

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** సామాజిక సమస్యల పరిష్కారానికి, అన్ని రంగాల్లో అభివృద్ధికి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో సమాజమే దేవాలయంగా అందరూ కలిసికట్టుగా ముందుకెళదామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, దేశ ఉప ప్రధానిగా పనిచేసిన బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతినీ పురస్కరించుకుని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వివిధ శాఖల కేంద్ర మంత్రిగా పనిచేసిన జగ్జీవన్ రామ్ దూర దృష్టితో దేశంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. మహనీయుల జీవిత చరిత్రలు నేటి పిల్లలకు, భవిష్యత్తు తరాలకు తెలియాలంటే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఎంతో అవసరమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సీనియర్ సిటిజన్లు, చిన్నారుల సంక్షేమానికి అన్ని సంఘాల నేతలు కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. విద్యాపరంగా వెనుకబడ్డ జోగులాంబ గద్వాల జిల్లాలో విద్యార్థులు బడి మధ్యలో మానివేసే పరిస్థితులను రూపుమాపాల్సి ఉందన్నారు. సెన్సెస్ కు సంబంధించి మే మొదటి వారం నుంచి ఇండ్ల గణన చేపడుతున్నామని, వచ్చే ఏడాది జనాభా గణన చేసే నాటికి జిల్లా అక్షరాస్యతలో మెరుగుపడేలా అన్ని సంఘాల నేతలు సహకరించాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా అరికట్టాలని కోరారు. ఇటీవల జిల్లాలో పోక్సో కేసులు పెరుగుతున్నాయని,



చిన్నారులపై అఘాయిత్యాల నివారణకు కృషి చేయాల్సి ఉందన్నారు. ప్రతినెల చివరి శనివారం అన్ని మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహిస్తామని, ఎక్కడైనా అంటరానితనం ఉన్నట్లు తెలిస్తే విజిలెన్స్ కమిటీ ద్వారా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు వక్తలు కోరినట్లు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ నూతన విగ్రహ ఏర్పాటుకు, అంబేద్కర్ భవన్ నిర్మాణానికి కృషి చేస్తామని, ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న సమస్యలను, ఇతర డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన వారందరికీ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ పలు ప్రజాసంఘాల నేతలతో కలిసి పూలమాలలు వేసి పూజలు చేశారు.

## హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసన

- నేడు మెదక్ బంద్



**మెదక్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** బీజేవైఎం మెదక్ జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్ మాట్లాడుతూ ఈరోజు మెదక్ పట్టణం గాంధీనగర్ కాలనీ హనుమాన్ దేవాలయం లోని హనుమాన్, శివలింగం మరియు దేవతల విగ్రహాలపై అక్సర్ అనే ముస్లిం వ్యక్తి మూత్ర విసర్జన చేసి హిందువుల ఆరాధ్య దైవాలను అవమానించడం జరిగింది గత వారం రోజులుగా హిందూ దేవాలయ పై దాడులు జరగడం గమనియం మంబోజీపల్లి హనుమాన్ దేవాలయం పై ఇదేవిధంగా మూత్ర విసర్జన చేయడం మరియు అవుసులపల్లి గ్రామలో దేవీ దేవతల విగ్రహాలను ధ్వంసం చేయడం ఆదివారం రోజు గాంధీనగర్ హనుమాన్ దేవాలయ విగ్రహాలపై మూత్ర విసర్జన చేయడం జరిగింది ఇప్పటివరకు అవుసులపల్లి విగ్రహాల ధ్వంసం పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎవరిని నిందితులుగా గుర్తించకపోవడం వల్లనే ఈరోజు హనుమాన్ దేవాలయంపై దాడి జరిగిందని తెలియజేయడం జరిగింది ఇప్పటికైనా అవుసులపల్లి నిందితులను గుర్తించి ఇలాంటి ఘటనలు మెదక్ పట్టణంలో జరగకుండా చూసుకోవాలని హిందువుల మనోభావాలు దెబ్బ తీసే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలి లేని ఎడల మెదక్ పట్టణంలో హిందూ ఐక్యత చూపించేలా ఉద్యమం చేపడతామని హెచ్చరించడం జరిగింది హిందూ బంధువులు రేపటి మెదక్ బంద్ లో స్వచ్ఛందంగా పాల్గొని హిందువుల ఐక్యత చాటాలని తెలియజేయడం జరిగింది. గాంధీనగర్ కౌన్సిలర్ శశాంక్, రితీష్, రమేష్,లోకేష్ సంతోష్ బజరంగ్దళ్ నాయకులు పృధ్వి వంశీ బీజేవైఎం నాయకులు సాయి బబ్లు చందు మరియు గాంధీనగర్ హిందూ యువకులు పాల్గొనడం జరిగింది.

## సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి



**కృష్ణ, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** అనారోగ్యంతో బాధప డుతూ ఆసుపత్రిలో చికిత్స పొందిన కృష్ణ మండల గుడేబల్లూర్ గ్రామానికి చెందిన కోంకల్ రజితా,తం కోంకల్ వేంకటేష్ మంత్రి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ పార్టీ కార్యాలయంలో సిఎంఆర్ ఎఫ్ కింద 57,500/- రూపాయలు, రెండో వ్యక్తి కుర్వ సాయిబన్న కు 60,000/- రూ చెక్కులు , వాళ్లకి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటివరకు పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పేద కుటుంబాల ఆర్థిక భారం తగ్గించేందుకే ముఖ్యమంత్రి సహాయనిధి అని అన్నారు. ఈ కార్య క్రమంలో కృష్ణ మండల అధ్యక్షులు రాజప్పగౌడు, అన్వర్ కున్సి, సుదర్శన్, పల్లె సురేష్, సోమ సంతోష, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్, శాసనసభ్యులు చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు తదితరులు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నటరాజ్ థియేటర్ సమీపంలో నిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ చిన్నతనం నుంచే కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, ఉన్నత ఆలోచనలు, కష్టపడి పనిచేయడం, నిబద్ధతకు మారుపేరుగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు ఉండేలా కృషి చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. విద్య ద్వారానే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, విద్యార్థులు కృషి చేసి జీవితంలో ఎదగాలని సూచించారు. యువత ఆయన చూపిన మార్గంలో నడిచి సమానత్వ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నదని, అందుబాటులో ఉన్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో యువత సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. బాబు జగ్జీవన్ రామ్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు, యువత ముందుకు సాగాలని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించి జిల్లాలో అర్హులైన వారు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కుల సంఘాల ప్రతినిధులకు సూచించారు. జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధకుడని తెలిపారు. దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడి, కేంద్ర మంత్రిగా పలు కీలక బాధ్యతలు నిర్వహించి దేశ అభివృద్ధికి విశేషంగా సేవలందించారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ పని చేస్తోందని



తెలిపారు. సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక సారథి కళాకారుల పాటలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి అఖిలేష్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తండ్రిని గొడ్డలితో నరికి చంపిన కొడుకులు

- వివాహేతర సంబంధమే కారణం
- పరారీలో ఉన్న నిందితులు
- కేసు నమోదు చేసి గాలిస్తున్న పోలీసులు





**రేగొండ, ఏప్రిల్ 05 (జనంసాక్షి) :** వివాహేతర సంబంధం కారణంగా జరిగిన హత్య కేసు మండల వ్యాప్తంగా చర్చనీయంగా మారింది. మండలంలోని రేపాక గ్రామంలో అక్రమ సంబంధం కారణంగా జరిగిన హత్య కేసులో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ సిహెచ్. కరుణాకర్ రావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం “రేపాక గ్రామానికి చెందిన కుర్రే చేరాలు (55),అదే గ్రామానికి చెందిన ఒక మహిళతో గత కొంతకాలంగా అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం కుటుంబంలో వివాదాలకు దారితీసింది. ఈ నేపథ్యంలో మృతుని కుమారులు కుర్రే రామ్, కుర్రే లక్ష్మణ్ ఈ విషయంపై తీవ్ర ఆగ్రహంతో శనివావం అర్ధ రాత్రి సుమారు 01:20 గంటల సమయంలో హైదరాబాద్ నుండి గ్రామానికి వచ్చి, మహిళ ఇంటి వద్దకు వెళ్లి తలుపులు బలవంతంగా తెరచి లోపలికి ప్రవేశించారు. ఇంటిలో మహిళతో కలిసి ఉన్న చేరాలను చూసి ఆగ్రహానికి గురయ్యారు. కుర్రే రామ్ మృతుడు చేరాలను పట్టుకోగా, కుర్రే లక్ష్మణ్ తనతో తీసుకొచ్చిన గొడ్డలితో తలపై తీవ్రంగా దాడి చేయడంతో చేరాలు తీవ్రంగా గాయపడ్డాడు. అడ్డుకోవడానికి వచ్చిన మహిళపై కూడా దాడి చేసి ఆమె మెడలో ఉన్న బంగారు తాడును లాక్కొని అక్కడి నుండి పరారయ్యారు. గాయపడిన వ్యక్తిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం సుమారు 04:30 గంటలకు మరణించాడు”.

ఈ ఘటనపై మృతుని అన్న కుర్రె కుమార్ ఫిర్యాదు తో కేసు నమోదు చేసి నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కర్ణాకర్ రావు తెలిపారు.

# కరెంటు వైర్లను సరిచేశారు!




ఓ సారూ.. సమస్య పరిష్కరించరూ?
జనంసాక్షి
03 Apr 2026 - Page 1
https://epaper.janamsakshi.org/clip/472505

- ‘జనంసాక్షి’ కథనానికి స్పందన

**లక్ష్మణ చందా, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** మండలంలోని రాచాపూర్ గ్రామంలో ఇనుప స్తంభాలకు పరిష్కారం లభించింది. ఏఈ మహేష్ ఆధ్వర్యంలో వైర్లను సరి చేశారు. ఏప్రిల్ 3వ తేదీన “ఓ సారు... సమస్య పరిష్కరించరూ” అనే కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఇకనుండి వారం రోజులపాటు గ్రామంలో ఏ సమస్యలున్నా పరిష్కరిస్తామని మండల ఏ ఈ మహేష్ తెలిపారు.


# పార్టీ మారిన వారికే ప్రాధాన్యం!

- కష్టకాలంలో ఉన్న కార్యకర్తకు మొండి చేయి
- పది ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే మండల అధ్యక్షులా..?
- పర్వతగిరి మండలంలో బీఆర్‌యస్ పార్టీ అంతర్గత, గ్రూపు విభేదాలు

**పర్వతగిరి, ఏప్రిల్ 05 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో బిఆర్ యస్ పార్టీలో విభేదాలు భగ్గు మన్నాయి. సినియర్, జూనియర్, ఎర్రబెల్లి బ్యాచ్,ఆరూరి బ్యాచ్,లుగా ఏర్పడి తమ ఫోటో లు ఫ్లేక్సీలలో లేవని బాహాటంగానే చర్చించు కుంటున్నారు. మొదటి నుండి పార్టీలో ఉన్న వారి ఫోటోలు కాకుండా ఇటీవల పార్టీలు మారిన వారు రేపు రాబోయే మండల అధ్య క్షుల రేసులో ఉన్నట్లు సమాచారం... వివరాల్లోకి వెళితే శనివారం మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పుట్టినరోజు సందర్భంగా మండలంలో కేంద్రంలో జోరుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు అయితే సరైన ప్రోటోకాల్ పాటించకుండా సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో వారు ఏర్పాటు ఫ్లెక్సీలలో సీనియర్లు మా ఫోటోలు కూడా ఇవ్వచ్చు కదా అని మండల కేంద్రంలో గ్రూప్ రాజకీయాలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఏ ఎండకు ఆ “గొడుగు” పట్టినట్లు ఆరూరి పార్టీలోకి రావడం ఆరురితో వచ్చిన బ్యాచ్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం కష్టకాలంలో ఎమ్మెల్యే ఎంపీ ఎలక్షన్లో బిఆర్ యస్ జెండాలు మోసిన నాయకులు కార్యకర్తలు వారి బాధను బాహటంగానే వెళ్లబుచ్చుతున్నారు. ఎవరు ఎక్కువ ఫ్లెక్సీలు కడితే వారికి మండల అధ్యక్ష పదవి దక్కు తుందని చర్చ నడుస్తుందని.. పది ఫ్లెక్సీలు కడితే మండల అధ్యక్షుని పదవి కట్టబెడ తారా..!? మొదటి నుండి పార్టీలో ఉన్న వారి పరిస్థితి ఏంటి అని కార్యకర్తలు బిఆర్ యస్ సినియర్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఫ్లెక్సీ లో రగడ మండల అధ్యక్షుడి ఎన్నికలో ఎంత వరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

## బాసర ఆలయ పునర్నిర్మాణానికి నిధుల కేటాయింపు హర్షణీయం

- ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్



**భైంసా ఏప్రిల్ 05 (జనం సాక్షి) :** బాసర ఆలయ పునర్నిర్మాణం మాస్టర్ ప్లాన్ కు ప్రభుత్వం 225 కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్లు జీవో విడుదల చేయడం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనతేనని లిఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్లి అన్నారు. ఆదివారం తన నివాసంలో ప్రభుత్వం జీవో విడుదలచేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాల కాలంలో అమ్మవారి ఆలయం శిథిలావస్థకు చేరినప్పటికీ అప్పటి కెసిఆర్ ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర విషయంలో రెండుసార్లు అధికారులతో సమీక్ష నిర్వహించడం, ఒకేసారి 225 కోట్లు నిధుల విడుదల చేయడం పట్ల ఆయనకు నియోజకవర్గ ప్రజలందరి తరపున కృతజ్ఞతలు చెప్పారు. అమ్మవారి క్షేత్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనకు రావడం, తన మనవడికి అక్షరాభ్యాసం ఇక్కడే చేయించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమానికి పెద్ద మొత్తంలో భక్తులు తరలి రావాల్సిందిగా కోరారు. అనంతరం భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, సీనియర్ నాయకులు సాంప్లీ రమేష్, బిజెపి పట్టణ అధ్యక్షులు రావుల రాము మాట్లాడుతూ బాసర ఆలయానికి నిధులు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఎంతో కృషి చేశారన్నారు. పదేపదే శాసనసభలో ప్రస్తావించడం, ముఖ్యమంత్రిని కలవడంతో నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. నియోజక వర్గంలో గత పది సంవత్సరాల కాలంలో బాసర ఆలయ అభివృద్ధిని పట్టించుకోకపోవడం పాలకుల నిర్లక్ష్యమన్నారు.

# సిండికేట్‌గా మద్యం దందా!

- అధికార పార్టీ అండదండాలతో ఆడిందే రాజ్యం
- వైన్ షాపుల సిండికేట్ లో “గోపాలుడి”దే ప్రధాన పాత్ర
- గ్రామాల్లో రోజు రోజుకు పెరుగుతున్న బెల్ట్ షాపులు
- వైన్స్ నుంచి ప్రత్యేక వాహనాల్లో బెల్ట్ షాప్ లకు సరఫరా
- చోద్యం చూస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు






**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 3 (జనంసాక్షి) :** ఉమ్మడి ఖమ్మం రూరల్ మండలంలోని వైన్ షాప్ యజమానులు సిండికేట్ గా దందాకు తెరాలేపారు. ప్రభుత్వం అధికార లెక్కల ప్రకారం మొత్తం 6 వైన్స్ షాపుల ఉండగా 5 షాపులు మాత్రమే ఎమ్మార్పీ రేట్లకే మద్యాన్ని విక్రయిస్తారు. ఒక వైన్ షాప్ మాత్రం గ్రామాల్లో బెల్ట్ షాపులకు మాత్రమే మధ్యాన్ని అధిక రేట్లకు విక్రయిస్తారు. ఈ మొత్తం వైన్ షాపులకు సిండికేట్ గా వ్యవహరిస్తున్న ‘గోపాలుడిదే’ ప్రధాన పాత్ర వుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అతను చెప్పినట్లుగానే మిగతా వైన్ షాప్ యజమానులు కూడా ఉండి సిండికేట్ గా మధ్యాన్ని విక్రయాలు జరుపుతున్నారు. వైన్స్ షాపుల యజమానుల అండ దండలతో బెల్ట్ షాపులు ఇష్టా రీతిన అధిక ధరలకు అమ్ముతూ పచ్చని గ్రామాల్లో మద్యం ఏరూలై పారిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో బెల్టు దందా జోరుగా కొనసాగుతుందంటే నమ్మాల్సిందే, మారు మూల గ్రామాలు కూడా మద్యం మత్తులో జోగుతున్నాయి. గ్రామాల్లో తండాలో పుట్టగొడుగుల బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నయంటే అంటే ఏమాత్రం ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాప్ లు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రోజువారి కూలీలకు వెళ్లే ప్రజలు జేబులకు చిల్లు పడుతున్నాయి. కొంతమంది ప్రజలు అప్పులు చేసి మరి మద్యం తాగడంతో పలు కుటుంబాలు వీధి పాలవుతున్నాయి.

### మందు మొత్తం బెల్టు షాపులకే అమ్మకాలు

మండలంలోని వైన్ షాపుల యజమానులు బెల్టు షాపులకి మందు విక్రయించేందుకు అధిక ప్రధాన్యత ఇస్తున్నారు. కస్టమర్స్ కు నేరుగా అమ్మితే ఎమ్మార్పీ రేటు మాత్రమే వస్తుంది, అదే బెల్టు షాపులకు అమ్మితే ఎమ్మార్పీ రేటుకు ఒక బాటిలుకు 10 నుంచి 20 రూపాయలు అదనపు రేటు వస్తుందని ఉద్దేశంతో వైన్ షాప్ యజమానులు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తూ, గ్రామాలలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. బెల్ట్ షాపులు నిర్వహించేవారు బాటిల్ పై 30 రూపాయలు చొప్పున అధిక ధరలకు విక్రయిస్తూ ఉండటం గమనార్హం. వైన్ షాపులలో పేరు ఉన్న బ్రాండ్ల మద్యం ను వైన్ షాపులలో స్టాక్ పెట్టకుండా బెట్టు షాపులో స్టాక్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటూ జాగ్రత్త పడుతున్నారు. వైన్ షాపులకు వచ్చిన కస్టమర్లకు మాత్రం అడిగిన బ్రాండ్ లేదని ఇతర బ్రాండ్లకు చెందిన సీసాలను అంటగడుతూ డబ్బులు పోగేసుకుంటున్నారు. వైన్ షాప్ నిర్వహక్కంతో రోజు రోజుకు కొత్త బెల్ట్ షాపు పుట్టుకొస్తున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు.

### ప్రత్యేక వాహనాల ద్వారా బెల్ట్ కు సరఫరా

మండలంలో 6 లైసెన్స్ షాప్ లు ఉన్నాయి. వీటి ద్వారా అమ్మకాలు అక్కడే జరగాల్సి ఉండగా,వాటి ద్వారా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి మద్యాన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. గ్రామాలకు మద్యాన్ని అందించేందుకు ఏ దుకాణానికి ఏ గ్రామాలు అందుబాటులో ఉన్నాయో చూసుకుని ఆ వైన్స్ నుంచి ఆటోలో ఇతర వాహనాల ద్వారా బహిరంగంగానే మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఈ మద్యం సరఫరా చేసేందుకు షాపులోనే పనిచేసే వారితో పాటు అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకొని వారి ద్వారా తమ వ్యాపారాన్ని దిన దినంగా అభివృద్ధి చేసుకుంటున్నారు. బెల్టు షాపుల్ని పెంచి పోషించేందుకు వారికి అప్పుల రూపంలో మద్యాన్ని అందించి మరింత సొమ్మును పోగు చేసుకుంటున్నారు. గ్రామాలలో బెల్టు షాపులు ఎక్కువ కావడంతో తాగిన చోటే గొడవలకు దిగటం, అవి కక్షలకు దారితీయడమే కాకుండా,బెల్ట్ షాపులు ఇళ్ల మధ్యలో ఉండటంతో మహిళలకు బయట తిరిగే వారు కూడా చాలా ఇబ్బందిగా మారింది.

### ముందు కిరాణం షాపు పేరు లోపల మద్యం అమ్మకాలు

మండలం లో అనేకమంది పేరుకే కిరాణా దుకాణాలు నిర్వహిస్తున్నట్లు బోర్డులు ఏర్పాటు చేసుకోని,లోపల మాత్రం జోరుగా మద్యం వ్యాపారం చేస్తు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. బెల్టు షాపులు ఇండ్ల మధ్య లోనే ఉండటంతో, అర్ధ రాత్రి వేళలో మందు బాబులు ఘర్షణలు పడుతూ హంగామా చేస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏర్లే పారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### మహిళా ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన నాయుడుపేట సర్కిల్

నాయుడుపేట నుండి ఖమ్మం కాలవొడ్డ కీ వెళ్లేందుకు కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు సాగుతూ ఉన్నాయి. దానితో ఆ రోడ్డు కుండా బస్సులు ఇతర ప్యాసింజర్ కి సంబంధించిన వాహనాలు వెళ్లడం లేదు. దీనితో బైపాస్ నాయుడుపేట ప్రధానంగా ఉండటంతో,సర్కిల్ ప్రయాణికులు వాహనాల కోసం బస్టాప్ అడ్డగా మారింది. ఇటీవల ఆ సర్కిల్లో నూతనంగా వైన్స్ షాపు ఏర్పాటు చేశారు. వైన్ షాపు ఏర్పాటు చేయడంతో మందు బాబులు మద్యం సేవించి మహిళ ప్రయాణికుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు మహిళలు వాపోతున్నారు. మందుబాబులు కూడా బహిరంగానే మద్యం సేవిస్తూ, ప్రయాణికులను కూడా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

### ఎక్సైజ్ శాఖ చర్యలు శూన్యం

ప్రభుత్వం నుండి అనుమతి పొందిన 6 షాపులు ఉన్నాయి. వాటి నుండి మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో వున్నా బెల్టు షాపులకు తరలిస్తున్నారు. బెల్టు నిర్వహణకు ఎక్సైజ్ శాఖ ప్రోత్సాహం ఉందని కూడా పలు గ్రామాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలు మత్తులో చిత్తవుతున్న నిరోధించాల్సిన సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని, చర్యలు తీసుకోకపోవడంలో విఫలం అవుతున్నారని మండల ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నిరుపేద కుటుంబంలో జన్మించి కేంద్రమంత్రిగా, ఉప ప్రధానిగా దేశ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని, ఆయన సేవలు మరువలేనివని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం ఐడిఓసి కార్యాలయంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలకు శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆనాటి ప్రభుత్వం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కూతురు మీరా కుమారికి స్పీకర్ పదవి ఇచ్చి సముచితంగా గౌరవించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. దేశానికి సేవలు అందించిన మహనీయుల విగ్రహాలు జిల్లా కేంద్రంలో ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో కూడళ్ల అభివృద్ధికి 10 కోట్లు మంజూరు చేశామని, అలాగే రహదారుల అభివృద్ధి కూడా జరుగుతుంది కాబట్టి దేశ ప్రజలకు సేవలు అందించిన మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తామని, ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బీహార్ లోని చిన్న కుగ్రామంలో జన్మించిన డా బాబు జగ్జీవన్ రామ్ దేశానికి కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా తన అమూల్యమైన సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్న గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని తెలిపారు. ప్రతి ఒక్కరూ కృషి, పట్టుదలతో సాధన చేస్తే విజయం సాధ్యమవుతుందని నిరూపించిన గొప్ప వ్యక్తి డా బాబు జగ్జీవన్ రామ్ అని అన్నారు. సామాజిక న్యాయం కోసం డా. బాబు జగ్జీవన్ రామ్ విశేషమైన కృషి చేశారని తెలిపారు. 1971 ఇండియా, పాకిస్థాన్ యుద్ధ సమయంలో మన రక్షణశాఖ మంత్రిగా దేశ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని తెలిపారు. నేటి తరాలకు డా బాబు జగ్జీవన్ రామ్ ఆదర్శమని యువత ఆయన బాటలో పయనించి అభివృద్ధిలో మన జిల్లాకు, రాష్ట్రానికి తద్వారా దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఎస్సి అభివృద్ధి అధికారి ఇందిర, కౌన్సిలర్లు, ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కమిటి సభ్యులు, బిసి సంఘం నాయకులు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## గజ్వేల్ క్యాంపు కార్యాలయంపై దాడి హేయం

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గుండాల్లా వ్యవహరిస్తున్నారని, గజ్వేల్ ఘటన అత్యంత హేయనీయమని ఖండించారు.

కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న వికృత రాజకీయ క్రీడకు రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు తప్పక గుణపాఠం చెబుతారని చెప్పారు. అదే విధంగా భూపాలపల్లిలో జరుగుతున్న పరిస్థితులు, కాంగ్రెస్ నేతల తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య





**హనుమకొండ, ప్రతినిధి ఏప్రిల్ 5, (జనం సాక్షి) :**హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో భారత మాజీ ఉప ప్రధాన మంత్రి, సమతావాది డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను సాకారం చేసేందుకు అందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన పార్లమెంట్‌లో దళితుల సమస్యలపై నిరంతరం గళమెత్తి, సుమారు 34 ఏళ్లపాటు ఉప ప్రధానిగా, కేబినెట్ మంత్రిగా సేవలందించిన మహానేత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తదితరులు పాల్గొని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ రూపొందించిన 2025--26 వార్షిక ఎస్సీ ప్రణాళికను ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ కుమార్తె మీరా కుమారి లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న సమయంలో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. హనుమకొం డలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రతిష్ట కోసం భూమిపూజ చేయడం సంతోషకరమని, వచ్చే ఏడాది విగ్రహాన్ని ఏర్పాటు చేసి జయంతిని మరింత ఘనంగా నిర్వహిద్దామని అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రతిష్టకు భూమిపూజ చేయడం తనకు గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, సాధారణ కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలను అధిగమించి ఉప ప్రధానిగా ఎదిగిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. దాదాపు 30 సంవత్సరాల పాటు పార్లమెంట్ సభ్యునిగా, రక్షణ, వ్యవసాయ తదితర శాఖల మంత్రిగా దేశానికి విశిష్ట సేవలందించినట్లు గుర్తుచే శారు. దళితుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సత్యపాల్ రెడ్డి, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, ఎస్సీ వెల్ఫేర్ డీడీ నిర్మల, డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మహేందర్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కొంగర జగన్మోహన్, వివిధ సంఘాల ప్రతినిధులు బండారి సురేందర్, మంద కుమార్, అంకెశ్వరపు రామచంద్రారావు, పుట్ట రవి, చుంచు రాజేందర్, , బోడ డిన్న, కన్నం సునీల్, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
06 ఏప్రిల్ 2026

# కరీంనగర్‌లో సందడిగా మేయర్ క్యాంప్ కార్యాలయ ప్రారంభోత్సవం

- ప్రారంభించిన మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** కరీంనగర్‌లో మేయర్ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం రోజు తీగలగుట్టపల్లిలో నూతన మేయర్ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికి, అతిపెద్ద గజమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పలువురు కార్పోరేటర్లు, బీజేపి పార్టీ జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి కేంద్ర మంత్రి తన చేతుల మీదుగా నూతన మేయర్ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్ ను బండి సంజయ్ కుమార్ సీటు లో ఆసీనులను చేసి శాలువాతో సత్కరించారు. సీటులో ఆసీనులైన



మేయర్ కు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. అనంతరం బీజేపి పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు టపాసులు కాల్చి సంధడి చేశారు. ముఖ్య అతిథి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌ను మేయర్ తో పాటు పలువురు కార్పోరేటర్లు, అభిమానులు, స్థానిక ప్రజలు, పార్టీ కార్యకర్తలు శాలువాలతో సత్కరించారు. ఈ సంధర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ... ప్రజలకు, పాలకవర్గ సభ్యులకు, స్థానికులకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కార వేదికగా క్యాంపు కార్యలయం పని చేస్తుందని తెలిపారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నూతన పాలకవర్గం పని చేస్తుందని తెలిపారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతన పాలకవర్గం లో మాకు మేయర్ గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ నేతృత్వంలో మా నూతన పాలకవర్గం పని చేస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో పాలకవర్గం ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు బిజీబిజీ..!



**మంథని, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు గత నాలుగు రోజులుగా కేరళ రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో బిజీ బిజీగా మారారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యుడిఎఫ్ అభ్యర్థుల గెలుపు కోసం మంత్రి శ్రీధర్ బాబు తనదైన శైలిలో ప్రచారాన్ని నిర్వహిస్తూ దూసుకుపోతున్నారు. వారి వెంట మంథని నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు.. మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ ఎస్ అన్వర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లా రామ్మూర్తి, తీగల సమ్మయ్య, ఇనగంటి రామారావు, పిట్ల గోపాల్, అంబీరు శ్రీనివాస్, బాబు రావు తదితరులు సైతం కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

## కేజీబీవీలో ఇంటర్మీడియట్‌కు దరఖాస్తులు చేసుకోండి

### స్పెషల్ ఆఫీసర్ కవిత

చంద్రుగొండ, ఏప్రిల్ 5 (జనం సాక్షి) : చంద్రుగొండ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కొరకు దరఖాస్తులు ఈనెల 15 వరకు ఆన్లైన్లో చేసుకోవచ్చని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ స్పెషలాఫీసర్ కవిత తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియం సీఈసీ గ్రూప్ లో 80 శాతం ఆన్లైన్ అడ్మిషన్ జరుగుతున్నాయని తెలిపారు. ఆన్లైన్ దరఖాస్తు రుసుమూరు 200 రూపాయలుగా నిర్ణయించి ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాల కోసం https://tgrie.cgg.gov.in ఈ వెబ్సైట్ను సందర్శించి వివరాలు తెలుసుకోవచ్చు అన్నారు.

## బాబుజీ ఆశయాలే మార్గదర్శకం

- భువనగిరిలో ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి
- సామాజిక న్యాయానికి అంకితమైన మహనీయుడికి నివాళులు
- కొత్తగూడెం భద్రాచలం జిల్లా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ పొత్నక్ ప్రమోద్ కుమార్

భువనగిరి టౌన్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భువనగిరిలో ఆయన విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోత్నక్ ప్రమోద్ కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, సాధారణ కుటుంబంలో జన్మించి అంటరానితనం వంటి సామాజిక అడ్డంకులను అధిగమించి దేశ ఉప ప్రధాని స్థాయికి ఎదిగిన బాబుజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దళితులు, వెనుకబడిన వర్గాలపై ఉన్న వివక్షను నిర్మూలించేందుకు ఆయన పార్లమెంటులోనూ,



బయట కూడా నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. బాబుజీ ఆశయాలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. పేదరిక నిర్మూలన, సమానత్వం సాధన ద్వారానే ఆ మహనీయుడికి నిజమైన గౌరవం చెల్లించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి పిట్టల బాలరాజ్, మహేందర్, కృష్ణారెడ్డి, దర్గా హరిప్రసాద్, నల్ల మాస రవి గౌడ్, ఉపేందర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కరాటే క్రీడతో యాదాద్రి భువనగిరి ఖ్యాతి జాతీయస్థాయికి తీసుకెళ్లాలి




**భువనగిరి టౌన్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా పేరు క్రీడల ద్వారా జాతీయ స్థాయిలో నిలవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ ఆకాంక్షించారు. స్థానిక ప్రశాంతి స్కూల్ ఆవరణలో స్టాండర్డ్ షీటు ర్యూ కరాటే డో ఇండియా గ్రాండ్ మాస్టర్ పబ్బతి బాలరాజు ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన చైర్‌పర్సన్ శ్రీవాణి రవికుమార్, టోర్నమెంట్ స్పాన్సర్ మరియు బ్లాక్ బెల్ట్ కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరాటే ఆత్మరక్షణకు అత్యంత అవసరమైన క్రీడ అని పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఆనందదాయకమని తెలిపారు. తాము కూడా గ్రాండ్ మాస్టర్ బాలరాజు శిష్యులమేనని వెల్లడించారు. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించి, జాతీయ స్థాయి పతక విజేతగా నిలిచిన జాలిగం విఘ్నేష్ ప్రజాప్రతినిధిగా ఎదగడం గర్వకారణమని గ్రాండ్ మాస్టర్ బాలరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ పబ్బతి బాలరాజు, మాస్టర్లు వెంకట్, పవన్, యాదగిరి, ముత్యాలు, సుదర్శన్, మచ్చగిరి, వినోద్, జంగయ్య, చెన్నకేశవులు, నర్సింహా, రాజు, మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి సుధాకర్‌కు శుభాకాంక్షలు తెలిపిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



**దేవరకొండ, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** దేవరకొండ ప్రముఖ వ్యాపారవేత్త దొడ్డి సుధాకర్‌కు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో మెలగాలని ఆకాంక్షించారు. వారికీ మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని కోరుకుంటున్నానని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వీధితో పాటు పానుగంటి మల్లయ్య,ఆలంపల్లి నరసింహ, ఇమ్మడి భద్రయ్య, దొడ్డి అశోక్, వర్త్య దేవేందర్ నాయక్, కుంచకూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో భూ కబ్జాదారుల ముఠా..

- బండారం బట్టబయలు
- నకిలీ పత్రాలతో భూముల అమ్మకాలు ఆరుగురు అరెస్ట్
- గుట్టురట్టు చేసిన టూ టౌన్ పోలీసులు

**కరీంనగర్ క్రైమ్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని టూ టౌన్ పోలీసులు భూ కబ్జాదారుల ముఠాను చాకచక్యంగా పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిందితులు ఒక ముఠాగా ఏర్పడి కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను లక్ష్యంగా చేసుకుని వాటి యజమానుల వివరాలను సేకరించి, నకిలీ పత్రాలు సృష్టించేవారు. మొదట ముఠాలోని ఒకరి పేరుపై రిజిస్ట్రేషన్ చేసి, అనంతరం మరొకరి పేరుపై మళ్లీ రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా నకిలీ లింక్ డాక్యుమెంట్లు తయారు చేసి, అమాయక ప్రజలకు భూములను విక్రయించి డబ్బును పంచుకునేవారు.



ఇదే విధంగా పద్మనగర్ ప్రాంతంలోని సర్వే నంబర్ 212లో ఉన్న 242 చదరపు గజాల స్థలాన్ని కూడా నకిలీ పత్రాలతో కబ్జా చేసి ఇతరులకు అమ్మినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో కిన్నెర మల్లవ్వ, భామండ్ల రవీందర్, లోకిని పోచయ్య, అనుముల బాలయ్య, లోకిని ఆదిత్య, లోకిని రాజవ్వ, రాజమ్మలను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఓసి ఫోర్ దుర్గ ఓబి కంపెనీ భూమిపూజ



**మణుగూరు, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** సింగరేణి మణుగూరు ఏరియాలోని పీకే ఓసి-4 దుర్గ (డీఐఎంపీఎల్) ఓబీ కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాజెక్టు పనులు సకాలంలో పూర్తిచేసి ఉత్పాదకతను పెంచాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి అందరూ సమన్వయంతో పని చేయాలని ఆయన కోరారు. ఈ మూడు నెలలు ఎంతో కీలకమైనది. జూలై ఆగస్టు నెలలో వర్షాల కారణంగా ఉత్పత్తి వెలికి తీయటంలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుంది. వేసవిలో పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే వాహనాలు కండిషనలో ఉండాలి, కార్మికులు రక్షణ సూత్రాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాస్, దుర్గ కంపెనీ ప్రాజెక్టు మేనేజర్ ముత్తు కుమార్, రాజు భాయ్, బిపిన్, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి, భారతీయ సంస్కృతి, జాతీయతపై రచనలు అవసరం



**కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** దేశభక్తి, భారతీయ సంస్కృతి పరిరక్షణ, జాతీయ ఐక్యత వంటి విలువలను బలోపేతం చేసే రచనలు సమాజానికి అత్యవసరమని కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ప్రముఖ రచయిత డా. సబ్బని లక్ష్మీనారాయణ రచించిన "చారుధామ్ యాత్రా చరిత్ర" గ్రంథాన్ని ఆదివారం కరీంనగర్‌లో తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రచయితలు, కవులు దేశభక్తి, జాతీయత, సంస్కృతి వంటి అంశాలపై మరింతగా స్పందించి విలువైన రచనలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. దేశంలోని విభిన్న ప్రాంతాలను, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలను సందర్శించి, అక్కడి సంస్కృతి, సంప్రదాయాలపై అధ్యయనం చేసి రచనలు చేయాలని సూచించారు. జాతీయత, సంస్కృతి, దేశభక్తి అంశాలే దేశ అభివృద్ధికి మార్గదర్శకాలని అభిప్రాయపడ్డారు. ఉత్తరాఖండ్ హిమాలయ ప్రాంతంలో జరిగే క్లిష్టమైన చారుధామ్ యాత్రను స్వయంగా అనుభవించి, దానిపై పరిశోధనాత్మక గ్రంథం రచించిన డా. సబ్బని లక్ష్మీనారాయణను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, చరిత్రకారుడు సంకేపల్లి నాగేంద్రశర్మ, సామాజిక సేవకుడు ఉప్పల రామేశం, కవి వెలుమల జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 11వ రోజుకు చేరిన కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ రిలే దీక్షలు




**బూర్గంపహాడ్, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** ఐటీసీ పెద్దలారా సమస్యలతో సతమతమవుతున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో-కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లెం నాగయ్య, ఎండీ యాకూబ్పాలు డిమాండ్ చేశారు. ఆదివారం రిలేనిరాహారదీక్షలు 11వ రోజుకు చేరుకోవడంతో దీక్షల్లో బత్తుల కిరణ్బాబు, జజ్జరి రాజేశ్వరి, జట్యాల లీలావతి, గాదె సత్యానందం, కళావతి, తార, ఎరుసు సత్తిరెడ్డిలు పాల్గొని తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు మాట్లాడుతూ 13వ వేతన ఒప్పంద కాలం సమస్యలు పెండింగ్ లోనే ఉన్నాయని, ఒప్పదం కాలం పూర్తయి వారం దాటుతున్నా నేటికీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని దీనికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమన్నారు. 14వ వేతన ఒప్పందాన్ని జేఏసీతోనే కలిసి చేయాలని డిమాండ్ చేశారు. ఐటీసీ యాజమాన్యం దిగొచ్చేంతవరకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈ దీక్షా శిబిరంలో జేఏసీ సభ్యులు సింగారపు సతీష్, బత్తుల గోపాలరావు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి ప్రశాంత్ నాయుడు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

## రోడ్డుపైనే వ్యాపారాలు నిర్వహిస్తామంటూ వ్యాపారుల ఆందోళన

- అధికారులు, పోలీసులు హెచ్చరించినా ఆదేశాలు బేఖాతర్

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** జాతీయ రహదారి పక్కనే దుకాణాలు నిర్వహించుకుంటామంటూ సంత వ్యాపారులు ఆదివారం మండల పరిధిలోని సారపాక ఐటీసీ సమీపంలో సంత ప్రదేశం వద్ద జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. దీంతో జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు పెద్దసంఖ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సమాచారం అందుకున్న సంబంధిత పంచాయతీ



అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని సంత వ్యాపారులను జాతీయ రహదారిపై వ్యాపారాలు చేయవద్దంటూ హెచ్చరించినా వ్యాపారులు వినకుండా ఆందోళనను ఉధృతం చేశారు. సంత వ్యాపారులు రోడ్డుపైకి వచ్చేలా వ్యాపారం చేయడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఇది మంచి పద్ధతి కాదని అధికారులు వ్యాపారులను హెచ్చరించినా వినలేదు. దీంతో ప్రయాణీకులు వ్యాపారుల మొండి వైఖరిని తప్పుపడుతున్నారు. ఎట్టకేలకు పోలీసులు అక్కడకు చేరుకుని వ్యాపారులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం రోడ్డుకు ఇరువైపులా ఆగి ఉన్న వాహనాలను పంపించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

# జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** వ్యవసాయ శాఖ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధాని గా దేశానికి 30 ఏళ్లు సేవలందించిన జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా వద్ద ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మేడిపల్లి సత్యం మాట్లాడారు. మహనీయుల మాదిరి మనం



ఉన్నతంగా ఆలోచించి గొప్ప పనులు చేయాలని సూచించారు. ఇండో పాక్ యుద్ధ సమయంలో దేశాన్ని కరువు నుంచి కాపాడిన మహనీయుడని జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ... ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా, ఎస్సీ సబ్ ప్లాన్ ద్వారా అందించే సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ... న్యాయ శాఖ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, వ్యవసాయ శాఖ మంత్రిగా దేశానికి 30 ఏళ్లు సేవలందించిన మహనీయుడు జగ్జీవన్ రామ్ అని అన్నారు. సమానత్వం కోసం ఎంతో కృషి చేశాడని వివరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే దేశ అభివృద్ధి కోసం మనం చేసే వృత్తిలో బలహీన వర్గాలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా కులాంతర వివాహాలు చేసుకున్న పలువురికి ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల (రెవెన్యూ) కలెక్టర్ లక్ష్మీ కిరణ్, కరీంనగర్ ఆర్డిఓ మహేశ్వర్, జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## జగ్జీవన్ రాంకి నివాళులు అర్పించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు

**పెద్దపల్లి,ఏప్రిల్ 05(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ చౌరస్తా వద్ద ఆదివారం జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ పెద్దపల్లి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రాం 119వ జయంతిని పురస్కరించుకొని వారి విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు అనంతరం వారి జయంతి సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు కేక్ ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, పట్టణ కౌన్సిలర్లు, దళిత సంఘాల నాయకులు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సామాజిక సమానత్వం కోసం
# పోరాడిన నేత బాబూ జగ్జీవన్ రామ్

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి
- మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డితో కలిసి జగ్జీవన్ రామ్‌కు నివాళులు అర్పించిన ఎస్వీ రమణారెడ్డి



**ఇబ్రహీంపట్నం, (జనం సాక్షి) :** సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డిలు అన్నారు. భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో ఆయన విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మంత్రిగా, ఉప ప్రధానిగా దేశంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. సామాజిక సమానత్వం కోసం అలుపెరగని పోరాటం చేసిన ఘనత బాబూజీ కి దక్కిందన్నారు. బాబూజీ ఆశయాల సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని వారు కోరారు. సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించినప్పుడే సమాజం అన్ని రంగాల్లో పురోగతి చెందుతుందని చెప్పారు. నియోజక వర్గ యువజన విభాగం అధ్యక్షుడు జెర్కోని రాజు, కౌన్సిలర్లు చిలుకల బుగ్గరాములు, గూడూరు గిరి, మంద జయ, కొంద్రు ప్రవీణ్ కుమార్, దాసరి మురళీకృష్ణ, కొండిగారి త్రిలోక్ కుమార్, బిఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రజల చివాట్లపై దృష్టి మళ్లించడానికే బీఆర్ఎస్ ఆఫీస్‌లపై దాడులు

- మూసీనది ప్రక్షాళన కాదు సీఎం మూతి..నోరు ప్రక్షాళన చేసుకోవాలే..!
- విలేకరుల సమావేశంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని, ( జనంసాక్షి ) : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సొంత పార్టీ కార్యకర్తలే గుర్తించడం లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జాతిపితగా పదేండ్ల సుపరిపాలన అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. గజ్వేల్ క్యాంపు ఆఫీస్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రెండేళ్ల పాలనలో ప్రజల్లో ప్రభుత్వ విఫలాన్ని కప్పిపుచ్చుకోవడానికి, రేవంత్‌రెడ్డిని ప్రజలు చివాట్లు పెడుతున్న విషయంపై దృష్టి మళ్లించాలనే ఆనాడు హరీశ్‌రావు, మహిపాల్‌రెడ్డి, కేసీఆర్ ఆఫీస్‌లపై దాడులకు పాల్పడుతున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి అవమానమన్నారు. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి సొంత పార్టీ నాయకులతో గౌరవించబడటానికి ప్రయత్నం చేయాలన్నారు. మంథని ప్రాంతంలో కనీసం కార్యకర్త కూడా ముఖ్యమంత్రిని గుర్తించకపోవడం విడ్డూరమని, ముందుగా కాంగ్రెస్సోళ్లు గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనాడు ఊర్లలోకి వచ్చి మాటలు చెప్పే తుపాకి రాముడి మాటలు వింటున్నరే తప్ప రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి మాటలు వినే పరిస్థితిలో ప్రజలు లేరని, ఇప్పటికి ఇచ్చిన హామీలు, గ్యారెంటీలు అమలు చేయలేదని, రైతు బంధు, భరోసాలాంటి పథకాలను పట్టించుకోవడంలేదన్నారు. కేవలం ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, ప్రశ్నించే వారిపై కేసు పెట్టడం, హైడ్రా పేరుతో ఇండ్లను కూల్చివేయడం తప్ప చేసిందేమి లేదన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు డబ్బులు ఇవ్వమంటే నా దగ్గర ఒక్క పైసా లేదని చెప్పిన ముఖ్యమంత్రి ఈరోజు మూసీ నది ప్రక్షాళన చేస్తా ఫోర్త్ సిటి కడుతా లక్ష కోట్లు పెడుతా అంటూ గొప్ప చెప్పుతున్నాడని, ముందుగా నీ మూతీ నోరు ప్రక్షాళన చేసుకోవాలని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డి ఆయన మంత్రి వర్గం ఒక దండుపాళ్యం బ్యాచ్‌లా వ్యవహరిస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలే గుణపాఠం చెప్తారని ఆయన ఈ సందర్బంగా స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వేగోళపు శంకర్ గౌడ్, కౌన్సిలర్ మాచిడి రాజు గౌడ్, తగరం శంకర్ లాల్, కనవేన శ్రీనివాస్ యాదవ్, వేల్పుల గట్టయ్య, పుప్పాల తిరుపతి తో పాటు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.



## సంగాయిపల్లిలో శివ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తాం

### హనుమాన్ దేవాలయ మాజీ చైర్మన్ ముక్తాల నరసింహా గౌడ్

**తలకొండపల్లి ఏప్రిల్05 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామ పంచాయతీకి చెందిన సంగాయిపల్లి గ్రామంలో శివాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి స్థలాన్ని ఆదివారం రాంపూర్ హనుమాన్ దేవాలయ మాజీ చైర్మన్ ముక్తాల నరసింహా గౌడ్,మాజీ సర్పంచ్ మిద్దెల శ్యామ్ సుందర్ రెడ్డి,లు నాయకులతో కలిసి పరిశీలించారు.గ్రామంలో శివాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం కోసం కమిటీ సభ్యులతో కలిసి పలు విషయాలు చర్చించినట్లు తెలిపారు. వచ్చే ఆదివారం గ్రామంలోని పెద్దలు, యువకులు అందరూ కలిసి మరీన్ని అంశాలను చర్చించి తుది నిర్ణయాలు తీసుకునేందుకు కమిటీ సభ్యులు,పెద్దలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ దైవ కార్యక్రమానికి నాయకులు రాజకీయం చేయకుండా అందరూ సమిష్టిగా నిర్ణయం తీసుకుందామని హనుమాన్ దేవాలయ మాజీ చైర్మన్ ముక్తాల నరసింహా గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రమేష్, నాయకులు తిరుపతి రెడ్డి,జనార్ధన్ రెడ్డి,పబ్బ మహేందర్ తదితరులు ఉన్నారు.

# నసురుల్లాబాద్‌లో విరాట్ హిందూ సమ్మేళనం

- జెండాలు, జైకారాలతో గ్రామమంతా ఉత్సాహభరితం
- పోలీసుల సమర్థవంతమైన బందోబస్తు - శాంతియుతంగా ముగిసిన ఊరేగింపు

**బాన్సువాడ, ఏప్రిల్ 5 (జనంసాక్షి):** నసురుల్లాబాద్ మండల కేంద్రంలో హిందూ పరిరక్షణ కమిటీ, శ్రీ రామ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం విరాట్ హిందూ సమ్మేళనం భవ్యంగా జరిగింది. నసురుల్లాబాద్ ఎక్స్ రోడ్డు నుండి శ్రీ రామాలయం వరకు జెండాలు, జైకారాలతో కాషాయ మేళం వంటి భారీ ర్యాలీ సాగి గ్రామమంతా ఉత్సాహభరితంగా మారిపోయింది. హిందూ వాహిని భక్తులు, శ్రీరామ సేవకులు, హనుమాన్ సేవకులు, గ్రామస్తులు భారీ ఎత్తున పాల్గొని ర్యాలీకి విశేష స్పందన ఇచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకగా, యువకులు "బోలో భారత్ మాతాకీ జై", "జై శ్రీరామ్", "జై హనుమాన్" అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ వెళ్లిన ప్రతి వీధిలో గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలకడం విశేషం. కాషాయ పతాకాలతో, శోభాయమాన అలంకరణలతో నసురుల్లాబాద్ మొత్తం కాషాయ వాతావరణంలో కళకళలాడింది. పెద్దలు, యువకులు, మహిళలు కలిసి భారీ ఉత్సాహంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భారీ ఊరేగింపు నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరిస్థితిని సమర్థవంతంగా నియంత్రించారు. ర్యాలీ శాంతియుతంగా ముగిసింది. ఈ సమ్మేళనం హిందూ సమాజంలో ఐక్యత, భక్తి, సంస్కృతి పరిరక్షణకు మార్గం చూపించిందని హిందూ పరిరక్షణ కమిటీ, శ్రీ రామ సేవా సమితి నాయకులు తెలిపారు. గ్రామస్తులు ఈ కార్యక్రమానికి అండగా నిలిచి ఉత్సాహం ప్రదర్శించడం గమనార్హం. ఈ వేడుకల్లో హిందూ సంస్కృతి, సంప్రదాయాల ప్రాధాన్యతను గుర్తు చేస్తూ భక్తి, జాతీయ భావనలు మరింత బలపడాలని పాల్గొన్నవారు వ్యక్తం చేశారు.

## సెస్ వ్యవహారంలో కేటీఆర్ రెండు నాల్కల ధోరణి



**ముస్తాబాద్ ఏప్రిల్ 05 (జనం సాక్షి) :** ముస్తాబాద్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం సెస్ లో జరిగిన అవకతవకల పై కేటీఆర్ ఆదేశాలతో ఎంక్వైరికి సిఫారసు.శ్రీరంగ రావ్ కమిటీ సెస్ ను లో కలపాలని సిఫార్స్ చేసింది వాస్తవం కాదు.మీరూ అనుకున్న విదంగానే సెస్ ను లో విలీనం.మీరు చేసిన పనికి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడం సరికాదు గత ప్రభుత్వ పాలకుల హయాంలో సెస్ లో భారీ అవకతవకలు.మరొక్కసారి సెస్ ను అడ్డుపెట్టుకొని దోచుకొనే ప్రయత్నం చేస్తున్నారు.2006 నుండి 2026 వరకు సెస్ ఎన్నో నష్టాలు చవిచూసింది.కేటీఆర్ ఆదేశాలతోనే శ్రీరంగ రావ్ కమిటీ సెస్ లో జరిగిన అవకతవకలపై కమిటీ.సెస్ లో దోపిడీ, అవకతవలు జరిగాయానీ నివేదిక ఇచ్చిన మాట వాస్తవం కాదా అవన్నీ దాచి.. తమ దోపిడీ బయటకు వస్తుందనీ బీఆర్ఎస్ నేతలు భయం పడుతున్నారు.తమ దోపిడీని కప్పిపుచుకోడానికి సెస్ లో పేపర్లను సైతం కాల బెట్టిన వైనం.కేటీఆర్ ఇక్కడి ప్రాంత వ్యక్తి కాదు కాబట్టే చూస్తూ ఊరుకున్నడు.శ్రీరంగ రావ్ గారు 2006 లో రూ.16000 కోట్లను డిపాజిట్ చేస్తే అవి కనబడకుండా పోయినయి.కేటీఆర్ చెప్పితేనే వాళ్ళ నేతలు సెస్ ను దోచుకున్నారు. సెస్‌ను పాలనా పరంగా నిర్వీర్యం చేసి ఖజానా లూటి చేసి గ్రామ సభల్లో పిర్యాదులా. సెస్‌లో జరిగిన అవినీతి పై గ్రామ సభలు ఏర్పటు చేసి సంతకాల సెకరణ చేసి పంపుతాం.చిత్తశుద్ధి ఉంటే కేటీఆర్ సైతం సెస్ లో జరిగిన అవకతవకలపై స్పందించాలి.ఈ కార్యక్రమంలో ఏంసి వైస్ చైర్మన్ వెలుముల రామిరెడ్డి, సీనియర్ నాయకులు మామిళ్ల ఆంజనేయులు, ఉచ్చిడి బాల్ రెడ్డి, వార్డు సభ్యులు రంజాన్ నరేష్, చంద్రారెడ్డి, బద్దిపడగ మహేష్, బండారి సాయి, తదితరులు పాల్గొన్నారు.

# నోరు అదుపులో పెట్టుకోవాలి

- ఇది ప్రజాస్వామ్యం, ప్రజలు పాలకులు
- మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి తనయుడి తీరు మార్చుకోవాలి
- బిఆర్ఎస్ బంటి గుండాలా వ్యవహారిస్తే ఊరుకునేది లేదు
- తీరు మారకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు



**యాచారం, ఏప్రిల్ 5(జనం సాక్షి) :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో శనివారం జరిగిన మున్సిపల్ చైర్మన్ పదవి ఎన్నికలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ చైర్మన్ కైవసం చేసుకున్న సందర్భంగా మాజీ శాసనసభ్యుడు మంచి రెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి అలియాస్ బంటి ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మీద, కాంగ్రెస్ శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య గా భావిస్తూ ఆదివారం యాచారం మండల కేంద్రంలోని సాయి శరణం గార్డెన్ లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు నరసింహ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...ఖబర్దార్ బంటి, ప్రజా స్వామ్యం లో ఉన్నవని మర్చిపోకు, మూడు సార్లు ఎమ్మెల్యే అయిన మీ తండ్రి సంస్కారం నేర్పలేదా, నీ తండ్రి వయసు ఉన్న ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి,నీ తండ్రి కంటే ఎన్నో రెట్లు దాదాపు 50వేల ఓట్ల మెజార్టీ తో గెలిచిన ప్రజా నాయకుడు, ఆయన పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, దూషించడం సిగ్గు చేటు అని విమర్శించారు. 51 రోజులు మీ బి ఆర్ ఎస్ కౌన్సిలర్లను బంధించి గెలిచిన మీరు, ప్రజల దృష్టిలో ఏనాడో ఓడిపోయారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మొత్తం ఓట్లలో 3500 ఓట్లు అధికంగా మా కాంగ్రెస్ పార్టీకి వచ్చాయని, మీ 5 మంది కౌన్సిలర్లు కేవలం 35 ఓట్ల తేడాతోనే గెలిచారని గుర్తు ఉంచుకోవాలని, ఇకనైనా ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకోవాలని , లేకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే తర్వాత తన తనయుడే పార్టీకి దిక్కా, సంస్కారమంతమైన నాయకులు ఎవరూ లేరా, సంస్కారం లేని ఇలాంటి నాయకులు పట్నం ప్రజలలో తిరగడం అంత మంచిది కాదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, టిఆర్ఎస్ పార్టీ ఇప్పటికైనా కళ్ళు తెరవాలని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్, కిసాన్ సెల్ అధ్యక్షులు పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గులాం అక్బర్, నల్లవెల్లి సర్పంచ్ కిషన్ నాయక్, నాయకులు ముచ్చర్ల సంపత్, రవీందర్ రెడ్డి, వరికుప్పల తిరుమలేష్, నర్ర శ్రీశైలం,సాజిద్ పాల్గొన్నారు.

## మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచిన కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 4 (జనం సాక్షి) మరోసారి తమ సేవా భావాన్ని చాటుకున్నారు జిల్లా కలెక్టర్ మార్చి 31న రోడ్డు పై నిరాశ్రయంగా తిరుగుతున్న ఒక గుర్తు తెలియని మానసిక అస్వస్థత గల వ్యక్తిని స్వయంగా గుర్తించిన జిల్లా కలెక్టర్ అతనికి తక్షణమే సహాయం అందించాలని జిల్లా సంక్షేమ అధికారి ని ఆదేశించారు.కలెక్టర్ మానవతా దృక్పథంతో ప్రారంభమైన ఈ చర్య ఒక కుటుంబానికి తిరిగి ఆనందాన్ని తీసుకొచ్చింది.జిల్లా సంక్షేమ అధికారి పర్యవేక్షణలో ప్రభుత్వ వృద్ధాశ్రమ సిబ్బంది ఆ వ్యక్తిని సంరక్షణలోకి తీసుకుని, అతనికి ఆహారం, శుభ్రత, వైద్య సేవలు అందించారు.జగిత్యాల జిల్లా వాసి అయిన అతనికి సేవలు అందిస్తూ, వైద్య పరీక్షలు చేయించి, శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించి, కొత్త జీవితం ఇచ్చారు. అతని ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడానికి అవసరమైన చికిత్స అందించారు.ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా, వారు శనివారం కలెక్టర్ చాంబార్ లో జిల్లా కలెక్టర్ ను బంధువులు కలసి 25 సంవత్సరాల తరువాత తమ కుటుంబ సభ్యుని తిరిగి పొందిన ఆనందంలో, జిల్లా కలెక్టర్ మానవత్వాన్ని కొనియాడుతూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంఘటన ద్వారా జిల్లా కలెక్టర్ మానవత్వం, సేవా భావం, బాధ్యతాయుత పరిపాలనకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.

# అణగారిన వర్గాల కోసం పోరాడిన యోధుడు జగ్జీవన్


- భారతరత్నకు ముమ్మాటికి అర్హులు
- బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా



**నిజామాబాద్ బ్యూరో, ఏప్రిల్ 5 (జనంసాక్షి):** సమాజంలో అణగారిన వర్గాల కోసం జీవితాంతం పోరాడిన మహా యోధుడు, మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఆదివారం నగరంలోని రైల్వే కమాన్ వద్ద గల అంబేద్కర్ భవన్ లో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడమే కాకుండా ... స్వాతంత్రం వచ్చిన తర్వాత సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. ప్రత్యేకంగా దళితుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారా మాత్రమే నిజమైన సమానత్వాన్ని సాధించగలమని పేర్కొన్నారు.
కేంద్ర మంత్రివర్గంలో కార్మిక శాఖ, రైల్వే శాఖ, వ్యవసాయ శాఖ, రక్షణ శాఖ మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. దేశంలో మొట్టమొదటి క్యాబినెట్ మంత్రి గానే కాకుండా అత్యధిక కాలం పాటు పనిచేసిన మంత్రిగా రికార్డు సృష్టించారని కొనియాడారు. కులం, మతం, భేదాలు లేకుండా అందరికీ సమాన హక్కులు రావాలన్నారు. భారత రత్న కు మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ ముమ్మాటికి అర్హుడేనని, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ తరఫున ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే నగరంలోని రైల్వే కమాన్ వద్ద గల అంబేద్కర్ భవనానికి తమ ట్రస్ట్ శ్రీ ధన్ పాల్ లక్ష్మీబాయి విట్టల్ గుప్తా ద్వారా తమ వంతు సహాయం అందిస్తామన్నారు. అంతకుముందు రైల్వే కమాన్ చౌరస్తా లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, మేయర్ ఉమారాణి, ఆర్డీవో రాజేంద్రకుమార్, డీడీ రాజ్ గంగారాం తదితరులు పాల్గొన్నారు.


# మహనీయుల ఆశయాలను మనమంతా ముందుకు తీసుకువెళ్ళాలి

- బస్టాండ్ సమీపంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఏప్రిల్ 05 (జనంసాక్షి) :** మహనీయుల ఆశయాలను మనమంతా ముందుకు తీసుకుని వెళ్లాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. ఆదివారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో లిబస్టాండ్ సమీపంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణు, తో కలిసి పాల్గొన్నారు.బస్టాండ్ సమీపంలో గల డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి, సభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉన్నత జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఆయన జీవితంలో అంటరానితనం పరిస్థితుల నుంచి ఉప ప్రధాని పదవి వరకు అనేక అంశాల ను చూశారని కలెక్టర్ తెలిపారు.చిన్నతనంలో పాఠశాలలో అంటరానితనం సమస్యతో అనేక బాధలు అనుభవించారని, 29 ఏళ్ళ వయస్సులో శాసన మండలి సభ్యునిగా, 1937 లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి బీహార్ అసెంబ్లీకి ఎన్నికయ్యారని తెలిపారు. 1946లో తాత్కాలిక ప్రభుత్వంలో మంత్రి గా పని చేశారని, స్వాతంత్ర్య వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వంలో 30 సంవత్సరాల పాటు వివిధ మంత్రిత్వ శాఖలలో పని చేశారని తెలిపారు. అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ జీవితాన్ని దేశానికి అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని అదనపు కలెక్టర్ కోనియాడారు. చిన్న తనం నుంచే అంటరానితనం వ్యతిరేకంగా పోరాటం చేశారని, అతి చిన్న వయస్సులో కేంద్ర మంత్రి గా పని చేశారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో పెద్ద ఎత్తున పాల్గొని జైళ్ళు జీవితాన్ని గడిపారని అన్నారు.డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 1946లో తాత్కాలిక ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారని, అతి చిన్నవారైనందున బేబీ మినిస్టర్ గా పిలవబడేవారని, రాజకీయాల్లో అత్యుత్తమ పార్లమెంటేరియన్ గా, సుదీర్ఘ కాలం రాజకీయ జీవితాన్ని గడిపిన వ్యక్తి అని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు.జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో మనమంతా సమాజానికి సేవ చేస్తూ మంచి పేరు తీసుకుని రావాలని, కాలం, ప్రాణం పోతే మళ్ళీ తిరిగి రావని, వీటిని సద్వినియోగం చేసుకుంటే దారిద్రంలో ఉన్నవారు సైతం ధనవంతులుగా ఆవిర్భవించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్, వివిధ ఎస్సీ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# ఏకాగ్రత, ధ్యానంతో అద్భుత స్మరణాశక్తి






- అవధానం మానవ మేధస్సును బలపరిచే యజ్ఞం
- నిరూపించిన జైన్ మహాఅవధానులు
- హాజరైన హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ముషీరాబాద్, ఏప్రిల్ 05 (జనం సాక్షి):** మానవ మేధస్సు తలుచుకుంటే అసాధ్యమైనది ఏదీ లేదని, ఏకాగ్రత, ధ్యానంతో అనంతమైన స్మరణ శక్తిని సొంతం చేసుకోవచ్చని జైన్ మహాఅవధానులు నిరూపించారు. మహా శతవధానం కేవలం ప్రదర్శన మాత్రమే కాదని, అది మానవ మేధస్సుపై ఉన్న నమ్మకాన్ని బలపరిచే ఒక యజ్ఞమని పలువురు ప్రముఖులు అన్నారు. జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్, బాగ్ లింగం పల్లి ఆర్టీసీ కళ్యాణ మండపం ఆడిటోరియంలో నిర్వహించిన మహా శతవధానం కార్యక్రమం జైన్ మహాగురువులు, జైన సంఘం సభ్యులు, ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. జైన్ మహా అవధాని అభినందన చంద్రసాగర్, ఆయన శిష్యులు నమీ చందర్ సాగర్, నేమీ చంద్రసాగర్, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథులుగా, గౌరవ అతిథులుగా సి.ఐ.ఎస్.ఎఫ్ డిప్యూటీ కమాండ్ ఆశిశ్ జైన్, తారక్ మెహతా కా ఉల్టా చెస్మా ప్రతినిధి సమయ్ షా (గోగి), గోలి, పాల్గొన్నారు.

**భారతీయ సంస్కృతికి నిదర్శనం : బండారు దత్తాత్రేయ**

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ జ్యోతి ప్రజ్వలన చేసి అష్టావధాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో అవధాన విద్యకు ప్రత్యేక స్థానం ఉందని, కంప్యూటర్ల కంటే వేగంగా మానవ మెదడు పనిచేస్తుందని ఇక్కడి అవధానులు నిరూపించారన్నారు. అవధానం కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా, విద్యార్థులు కూడా ఇటువంటి ఏకాగ్రతను అలవరచు కుంటే జీవితంలో గొప్ప శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. జైన్ సంప్రదాయం భారతీయ సంస్కృతికి అపూర్వమైన కొనియాడదగిన వారసత్వమన్నారు. శతవధానం వంటి కళలు మన ప్రాచీన విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటుతాయన్నారు. హైదరాబాద్ నగరం సామరస్యం, సంస్కృతి కేంద్రంగా ఉన్నందుకు గర్వపడతానన్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువతరం ఆధ్యాత్మిక జ్ఞానం సంపాదించి, దేశ సేవ చేయాలని కోరారు. జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీట్ లాంటి సంస్థలు సమాజానికి మార్గదర్శకులు అని ప్రశంసించారు.

**శాంతి, ఏకాగ్రతే లక్ష్యం**

కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచిన జైన్ మహాఅవధాని అభినందన చంద్రసాగర్ తన అద్భుత జ్ఞాపకశక్తితో అందరినీ ఆశ్చర్యపరిచారు. వందలాది మంది జైన్ సంఘం సభ్యులు అడిగిన విభిన్నమైన ప్రశ్నలు, క్లిష్టమైన సంఖ్యలు, శ్లోకాలు, వస్తువుల వివరాలను ఒకే క్రమంలో గుర్తుంచుకుని, తిరిగి వాటిని యథాతథంగా వినిపించడం విశేషం. మహాఅవధాని అభినందన చంద్రసాగర్ శిష్యులు నమీ చంద్రసాగర్, నేమీ చంద్రసాగర్ కూడా తమ గురువుకు దీటుగా అవధానంలో పాల్గొని, ఆధునిక యుగంలోనూ ప్రాచీన అవధాన విద్య సజీవంగా ఉందని చాటి చెప్పారు. శతవధానం అనేది కేవలం ఒక కళ కాదు, ఇది జీవన విధానమన్నారు. జైన్ ధర్మం బోధించిన అహింస, సత్యం, అపరిగ్రహం వంటి సూత్రాలను జీవితంలో అమలు చేసుకోవాలంటే మేధా శక్తి, ఏకాగ్రత అత్యంత అవసరమన్నారు. జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీట్ ఈ రకమైన కార్యక్రమాల ద్వారా భారతీయ సంస్కృతి వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందిస్తోందని అన్నారు. నేటి సోషల్ మీడియా యుగంలో విద్యార్థులు ఏకాగ్రత కోల్పోతున్నారని, జైన్ విద్యాపీఠం ద్వారా అటువంటి వారిలో మానసిక స్థిరత్వాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీఠ్ ట్రస్టీ యోగేష్ గాంధీ మాట్లాడుతూ జైన్ సంప్రదాయంలో మేధా శక్తి, స్మృతి సామర్థ్యం, ఏకాగ్రతను ప్రదర్శించే అపూర్వ కళ 'శతవధానం'ను ప్రోత్సహించడం, యువతరంలో ఆధ్యాత్మిక విలువలు, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడం ఈ మహా శతవధాన్ లక్ష్యమన్నారు. జైన్ ధర్మాన్ని, శతవధాన కళను యువతరానికి అందించడం ఉద్దేశమన్నారు. సభా ప్రాంగణం అంతా 'మహా అవధాని' నామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ముగింపులో అతిథులకు సన్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో జైన్ ఇంటర్నేషనల్ విద్యాపీఠ్ ట్రస్టీలు కైలాష్ బండారి, సీఏ విక్రమ్ శ్రీశ్రీమల్, అమిత్ వజవత్, హితేష్ జి ముథ, అంకిత్ చోరాదియా, ప్రతినిధులు ఆకాష్ గురూజీ, అక్షత్ జైనం, రిషబ్, అక్షిత్, ఆర్యన్ జైనం, ప్రానం తదితరులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
6 ఏప్రిల్ 2026

# అడవిని తోడేస్తున్నారు!

## యధేచ్ఛగా మట్టి అక్రమ రవాణా..!

- అక్రమ రవాణాను అరికట్టాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్





**మంథని, ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ లక్షల రూపాయల అడవి మట్టిని అక్రమంగా మట్టి మాఫియా తరలిస్తున్న అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అనుమతి లేకుండా అడవి లో ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతున్న చూసి చూడనట్టు వ్యవరిస్తున్న అధికారుల తీరు పట్ల సర్వత్రా విమర్శలు వెళువెత్తున్నాయి. మంథని మండల పరిధిలోని ఫారెస్ట్ గాడుదుల గండి, శివ్వారం మొసల్ల అభయ్యారణ్యం సమీపంలో ఆదివారం అక్రమ మట్టి తరలింపునకు కొందరు మట్టి వ్యాపారులు ఎలాంటి అనుమతి లేకుండా వందలాది మట్టి ట్రాక్టర్ ట్రిప్పులు తరలిస్తున్న రెవెన్యూ అధికారులు మాత్రం స్పందించడం లేదు. గత కొన్ని ఆదివారల నుంచిఅక్రమంగా మట్టి తరలిస్తున్న విషమం అధికారుల దృష్టికి పోయిన ట్రాక్టర్ లను సీజ్ చెయ్యకపోవడం పట్ల అధికారులు నిర్లక్ష్యం అర్థమవుతుంది. అధికారుల తీరు మాములు ముడితే చాలు ఎన్ని ట్రిప్పులు ఎంతైనా ఎపుడైనా తరలించు కోవచ్చు అన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రెవెన్యూ అధికారులు ఫారెస్ట్ అధికారులు ప్రకృతి సంపదను కాపాడకుండా అడవి వైపు కన్నెత్తి చూడడటం లేదు..! అడవిలో మట్టి అక్రమంగా తరలిస్తున్న చర్యలు తీసుకోవాల్సిన ఫారెస్ట్ అధికారులు, ,రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవరిస్తుండటం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. మట్టి అక్రమ రవాణా పై ఉన్నతాధికారులు దృష్టి సారించి మట్టి మాఫియా ఆగడాలను నియంత్రించాలని ఇప్పటికైనా అడవి నుండి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి అనుమతి లేకుండా ఆదివారం అడవి నుండి మట్టిని తరలించిన ట్రాక్టర్లను జెసిబిలను గుర్తించి తరలించిన మట్టిని గుర్తించి సీజ్ చేసి అక్రమ మట్టి తరలింపుకు అడ్డుకట్ట వేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ డిమాండ్ చేశారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రావ్ 119వ జయంతి వేడుకలు

- ప్రజలందరూ ఐక్యతగా ఉంటూ అభివృద్ధికి రావాలి : నగర మేయర్ మహంకాళి స్వామి



**గోదావరిఖని, జనంసాక్షి :**
రామగుండం కార్పొరేషన్ లోని బాబు జగ్జీవన్ రావ్ విగ్రహం వద్ద రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రావుకి పూలమాలలు వేసి సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభా అధ్యక్షత ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజ న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కవ్వంపల్లి సతీష్ వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా నగర మేయర్ మహంకాళి స్వామి, మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్ ,డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ వెంకటస్వామి ,సిఐ ఇంద్రసేనారెడ్డి పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ జయంతి కేకు కట్ చేసి మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రావు ఓటమి ఏరుగని నాయకులని దేశ ఉప ప్రధానిగా, రక్షణ శాఖ మంత్రిగా, కార్మిక శాఖ మంత్రిగా, అనేక సేవలందించారని, వారి ఆశలను ముందుకు తీసుకెళ్లాలని కొనియాడారు అతిథులుగా కార్పొరేటర్లు గట్ల రమేష్, ముస్తఫా, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, రాష్ట్ర కార్యదర్శి ఇరుగురాల కిష్టయ్య, ఏఐటిసి జాతీయ కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్, దళిత నాయకులు పులి మోహన్, కోటగిరి పాపయ్య, జేవి రాజు, పర్లపెల్లి రవి, దాసరి ఎల్లయ్య,ఎన్ ఎస్ యు ఐ నాయకులు విజయ్, సమత దళ్ నాయకులు ప్రమీల , నగేష్ తదితరులు పాల్గొన్నారు వారు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రావ్ ఆశయాలు ముందుకు తీసుకెళ్తూ ప్రజలందరినీ విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందిన అభివృద్ధి పరచాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండి యా అంబేద్కర్ యువజన సంఘం దళిత బహుజన సంఘాల నాయకులు పెంట రాజేష్, కంది రాజారత్నం, నీరటి శ్రీనివాస్, పోగుల రంగయ్య, గద్దెల శశి భూషణ్, బూడిద మహేందర్ గొర్రె నర్సింగరావు ,మహేందర్, పంజా అశోక్, పుల్లూరు మహేందర్, పర్ల పెల్లి బాబు, చంద్రశేఖర్, కరీం, శనిగరపు రామస్వామి,బాలంకస్, పేరుక రవి,కనుకుంట్ల సమ్మయ్య, పల్లె బాబు, కన్నూరి ధర్మేందర్, బోట్ల స్వామి, శేఖర్, జిల్లాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

### వినియోగదారులకు నాణ్యమైన
# విద్యుత్ సేవలందించడమే మా లక్ష్యం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 5 (జనంసాక్షి) :** సెస్ సహకార విద్యుత్ సంస్థను ఎన్పీడీసీఎల్ తమ ఆధీనంలోకి తీసుకున్న విషయం తెలిసింది. ఆదివారము ఎన్పీడీసీఎల్ సీఎండి కర్నాటి వరుణ్ రెడ్డి వేములవాడ భీమేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన వేములవాడలోని సబ్ స్టేషను, మల్లారం సబ్ స్టేషన్ ఆయన పరిశీలించారు.అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూ సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ విద్యుత్ సరఫరాకు లైసెన్స్ పునరుద్ధరణ కాకపోవడంతో మాకు బాధ్యతలు అప్పగించారన్నారు.వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలందించడమే మా ఉద్దేశమన్నారు. గడచిన ఐదు రోజులుగా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది వినియోగదారుల వద్దకు వెళ్లి మంచి సేవలను అందిస్తున్నారన్నారు.గడిచిన ఐదు రోజులలోనే 250 విద్యుత్ వ్యవసాయ అవసరాలకు మంజూరు చేసమని,సెస్ గడిచిన ఏడాదిలో 1400 ఇస్తే మరో 2500 వరకు పెండింగ్లో ఉన్నాయన్నా రు. మిగిలిన వాటిని ఎక్స్ ప్రెస్‌డ్రైవ్‌ను చేపట్టి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తమన్నారు. సిరిసిల్ల మగ్గాల కార్మికులకు గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరిస్తున్నమన్నారు. కేటగిరి మూడు కింద బిల్లింగ్ అవుతున్న దానిని,4ఏ కిందకు మార్చుతున్నమన్న మని దీనివల్ల నేతన్నలకు లాభాలు ఏర్పడతాయన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు పొలంబాట కూడా నిర్వహించమని, వారి సమస్యలను గుర్తించి ఎక్కడికక్కడ పరిష్కరిస్తున్నమన్నారు. మేము అందిస్తున్న సేవల పట్ల పవర్లూమ్ కార్మికులు,రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆయన వెంట డిఈ వెంకటరమణ, ఏడీలు గంగాధర్, అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# 13 ఏళ్ల క్రితం హత్య చేసిన నిందితుడు అరెస్ట్

### పోలీస్ సిబ్బందిని అభినందించిన పట్టణ సీఐ

**వేములవాడ(జనంసాక్షి):**వేములవాడ పట్టణ పరిధిలో 2011లో జరిగిన హత్య కేసులో కీలక నిందితుడైన కొండపల్లి బుచ్చయ్యను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2011లో వేములవాడలో కొండపల్లి జమునను ఆమె భర్త బుచ్చయ్య హత్య చేసిన ఘటనకు సంబంధించి అప్పట్లో కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడికి శిక్ష విధించబడినప్పటికీ, అతడు చాలా సంవత్సరాలుగా పరారీలో ఉన్నాడు. ఇటీవల కోర్టు అతనిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్సై రామ్మోహన్, కానిస్టేబుళ్లు గోపాల్, ఇమ్రాన్ కలిసి ప్రజ్ఞాపూర్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.అనంతరం నిందితుడిని కోర్టులో హాజరు పరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు తరలించింది.

# డబుల్ బెడ్ రూమ్‌లోని మడిగెల వేలంపాటను వెంటనే ఆపాలి

- “ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా మడిగెలను అమ్మేసి తప్పించుకోవాలని చూస్తోంది” : సీపీఎం



**శామీర్ పేట్, ఏప్రిల్ 5 (జనంసాక్షి):**
తూముకుంటలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉన్న మడిగెలను వేలంపాట ద్వారా అమ్మకూడదని, ఆ సమస్యలను పరిష్కరించి అక్కడి అసోసియేషన్‌లకు అప్పగించాలని సీపీఎం పార్టీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి. సత్యం డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మడిగెలను అసోసియేషన్ వారికి లీజుకు ఇచ్చి, లిఫ్ట్ మెయింటెనెన్స్, కరెంటు, ఇతర అవసరాలకు ఉపయోగించుకోవాలని చెప్పిందని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా మడిగెలను వేలంపాటలో అమ్మేసి వచ్చిన డబ్బుతో సమస్యలు పరిష్కరిస్తామని కల్లబొల్లి మాటలు చెబుతోందని సత్యం విమర్శించారు.
ఈ మడిగెల వేలంపాట వల్ల వచ్చిన డబ్బు రెండు సంవత్సరాల్లోనే ఖర్చు అయిపోతుందని, జీవితాంతం ఉపయోగపడే పరిస్థితి ఉండదని, దాని వల్ల అక్కడి ప్రజలకు నష్టం జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. లీజుకు ఇచ్చిన వారి నుండి రెంట్లు వసూలు చేయకపోవడం ప్రభుత్వ అసమర్థత, చాతగానితనమని మండిపడ్డారు.
వేలంపాట కాకుండా లీజుకు రెండు-మూడు సంవత్సరాల కంటే ఎక్కువ ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రెంటు కట్టని వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని సీపీఎం సూచించింది. మడిగెలను అక్కడి అసోసియేషన్ వారికి అప్పగిస్తే సమస్యల పరిష్కారం కోసం పనిచేయడం జరుగుతుందని, డబుల్ బెడ్ రూములు అభివృద్ధి చెందే అవకాశం ఉందని సత్యం వివరించారు.
ఏప్రిల్ 15 నుండి 12 కేంద్రాల్లోని 892 మడిగెలను వేలంపాట ద్వారా అమ్ముతున్నామని ఈరోజు ఇచ్చిన ప్రకటనను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. రవి, జిల్లా కమిటీ సభ్యులు నరేష్, వెంకన్న, లింగస్వామి, షామీర్‌పేట్ మండల కార్యదర్శి కిష్టప్ప, నాయకులు గోపాల్, సంగప్ప, సుధాకర్ నాయుడు, లబ్ధిదారులు అనిల్, రమాదేవి, రమేష్, సురేష్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్ననాటి స్నేహం.. నేర మార్గానికి దారి

### సులభంగా డబ్బు సంపాదించాలని ఆశపడి గొలుసు దొంగతనాలు

**ఉప్పల్, ఏప్రిల్ 5 (జనంసాక్షి):** చిన్ననాటి స్నేహం చివరకు నేర మార్గానికి దారి తీసింది. ఎలాంటి శ్రమ లేకుండా సులభంగా డబ్బు సంపాదించాలని ఆశపడ్డ ఇద్దరు యువకులు పక్కా ప్రణాళికతో గొలుసు దొంగతనాలకు పాల్పడి చివరకు పోలీసుల చేతికి చిక్కిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన మాచగాని ప్రవీణ్, మెగావత్ విజయ్ చిన్ననాటి స్నేహితులు. వేగంగా డబ్బు సంపాదించాలనే ఆశతో వారు ముందుగా ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ఒక ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాలని నిర్ణయించుకున్నారు. ఆ ప్రణాళికలో భాగంగా గత నెల 28న హయత్‌నగర్ ప్రాంతంలో ఒక బైక్‌ను అపహరించారు. ఆపై అదే వాహనంతో నగరంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ గొలుసు దొంగతనాలకు పాల్పడాలని పథకం రచించారు. ఈ క్రమంలో నెల 31న ఉప్పల్ శాంతినగర్ ప్రాంతంలో ఒక మహిళ మెడలో ఉన్న సుమారు 15 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనతో స్థానికంగా భయం నెలకొంది.
కేసును సీరియస్‌గా తీసుకున్న ఉప్పల్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి, నిందితుల కదలికలను గుర్తించారు. పక్కా సమాచారంతో శనివారం ఉప్పల్ భగాయత్ పరిధిలో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుల వద్ద నుంచి సుమారు రూ.3 లక్షల విలువ చేసే బంగారు గొలుసుతో పాటు దొంగిలించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ ఎలా నేరానికి దారి తీస్తుందో ఈ సంఘటన స్పష్టంగా చూపిస్తోందని పోలీసులు పేర్కొన్నారు. యువత కష్టపడి జీవించాల్సిన అవసరం ఉందని, నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ ఘటనలో ఉప్పల్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలు, స్థానిక సమాచారం ఆధారంగా త్వరగా నిందితులను పట్టుకోవడం గమనార్హం.

# బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ముందుకువెళ్తాం

### ప్రభుత్వ విప్, వేములవాడ, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 05 (జనం సాక్షి) :**
భారత దేశ మాజీ ఉప ప్రధాని, దివంగత బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ముందుకువెళ్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద అంబేద్కర్ విగ్రహం ప్రాంగణం లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరయ్యారు.ముందుగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ప్రభుత్వ విప్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పంపిణీ చేశారు.తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పాటలు ఆలపించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారని, కార్మికులకు మద్దతుగా అనేక పోరాటాలు చేశారని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన చూపిన బాటలో ముందుకు సాగుతామని వివరించారు. బాబు జగ్జీవన్ రామ్ కూతురు మీరాకుమారి లోక్ సభ స్పీకర్ గా ఉన్నపుడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం బిల్లు ఆమోదం పొందిందని గుర్తు చేశారు. ఈ నెలలో మహనీయుల జయంతి వేడుకలు ఉన్నాయని, ఈ నెల 11వ తేదీన మహాత్మా జ్యోతి రావు పూలే, 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఉన్నాయని తెలిపారు. ఏడాది సమయంలోపే రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయం ఎదుట మహాత్మాజ్యోతి రావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహాన్ని హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని వెల్లడించారు. సిరిసిల్ల, వేములవాడలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మహనీయులు సేవలు గుర్తు చేస్తూ వారు జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, పీడీ హౌసింగ్ వెంకట మాధవ రావు, మైనింగ్ ఏడీ క్రాంతి కుమార్, ఉద్యానవన అధికారి శరత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డీవైఎస్ఓ రాందాస్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి భారతి, ఏఎస్ డబ్ల్యూఓ విజయలక్ష్మి, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, మున్సిపల్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# అకాల వర్షం పిడుగుపాటుతో 2 గేదెలు మృతి

**వేములవాడ(జనంసాక్షి):** వేములవాడ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు అయ్యోరూపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున పిడుగుపాటుకు 2 పాడి గేదెలు (బర్రెలు) మృతి చెందాయి. గ్రామానికి చెందిన యువరైతు ఉల్లెందుల రఘుపతికి చెందిన పాడి గేదెలు మృతి చెందడంతో రైతు తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు.గేదెల విలువ దాదాపు రూ. 1,50,000 వరకు ఉంటుందని రైతు రఘుపతి తెలిపారు. కుటుంబానికి జీవన ఆధారమైన పాడి గేదలు ఒక్కసారి పిడుగుపాటుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. తనను ప్రభుత్వం తక్షణ సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.



# ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు మరింత అవగాహన అవసరం

- నిర్లక్ష్య ధోరణి వల్ల అనవసర ప్రమాదాలు.. కుటుంబాల్లో చీకట్లు : రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి
- “డిఫెన్సివ్ డ్రైవింగ్” అలవర్చుకోవాలి.. పాదచారులే రోడ్డుపై రాజులు
- అలైవ్ అరైవ్ కార్యక్రమంలో ఏప్రిల్ 13 నుండి 18 వరకు అవగాహన కార్యక్రమాలు



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 5 (జనంసాక్షి):**
సైబరాబాద్ కమిషనరేట్‌తో పాటు నగర ప్రజలందరికీ ట్రాఫిక్ నిబంధనలపై మరింత అవగాహన అవసరం ఉందని, కొందరు తెలిసి నిర్లక్ష్య ధోరణి వహించడం వల్ల అనవసరమైన రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటూ కుటుంబాల్లో చీకట్లు నింపుతున్నారని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి మండిపడ్డారు. ఆదివారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ నేతృత్వంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ శివధర్ రెడ్డి ఈ విషయాలను స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సైబర్ క్రైమ్, ట్రాఫిక్ పరిస్థితులు, క్రైమ్స్ తదితర అంశాలపై ఉన్నతాధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ట్రాఫిక్ భద్రతపై డీజీపీ అత్యంత కీలకమైన సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారుల మరణాల రేటు ఎక్కువగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు.
“అలైవ్ అరైవ్” కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 నుండి 18 వరకు రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. “పెడెస్ట్రియన్ కింగ్ ఆన్ ది రోడ్” (పాదచారులే రోడ్డుపై రాజులు) అనే నినాదం ఉన్నప్పటికీ, వారి ప్రాణాలు ఆకస్మిక ప్రమాదాల వల్ల కోల్పోతుండడం దురదృష్టకరమన్నారు.
కుటుంబ పోషణలో కీలక పాత్ర పోషించే 42-45 ఏళ్ల మధ్య వయస్సు గల వ్యక్తులు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, తద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా చితికిపోతున్నాయని డీజీపీ తెలిపారు. పరిసరాలను గమనిస్తూ వాహనం నడిపే “డిఫెన్సివ్ డ్రైవింగ్” (రక్షణాత్మక డ్రైవింగ్) పద్ధతిని ప్రతి వాహనదారుడు అలవర్చుకోవాలని సూచించారు. రోడ్డు భద్రత అనేది కేవలం నిబంధనల అమలు మాత్రమే కాదని, అది ఒక బాధ్యతగా ప్రతి పౌరుడికి తెలిసేలా అవగాహన కార్యక్రమాలు రూపొందించా లని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షలో సైబర్ క్రైమ్, సాధారణ నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలపై కూడా సుదీర్ఘ చర్చ జరిగింది. సాంకేతికత ను ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌ల కు స్పందించవద్దని, పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థల విశ్వసనీయతను పరిశీలించాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే హెల్ప్‌లైన్ లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి, అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, శేరిలింగంపల్లి డీసీపీ సి. హెచ్. శ్రీనివాస్, కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, ట్రాఫిక్ డీసీపీ-2 ఎస్. శేషాద్రి రెడ్డి, డీసీపీ క్రైమ్స్ ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, సైబరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ట్రాఫిక్ డీసీపీ-1 రంజన్ రతన్ కుమార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- రామగుండం కమిషనరేట్‌లో ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు



**గోదావరిఖని, ఏప్రిల్ 05 (జనంసాక్షి) :** భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, స్వరాజ్యం వచ్చిన తర్వాత ఆధునిక భారత నిర్మాణంలోనూ ఆయన స్ఫూర్తిదాయకమైన సేవలు అందించారని అన్నారు.గొప్ప రాజకీయవేత్తగా సామాజిక సమానత్వం కోసం జీవితాంతం పోరాడి, అనేక పదవులను చేపట్టి తనదైన ముద్ర వేశారని తెలిపారు. జగ్జీవన్ రామ్ జీవితాంతం బడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని పేర్కొన్నారు.దేశ రక్షణ మంత్రిగా ఆయన వేసిన బాటలు దేశాన్ని సురక్షితంగా ఉంచాయని అన్నారు. మనమందరం కలిసి పనిచేసి సమాజం, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని, మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యూనిఫాం సేవల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ,బాబూ జగ్జీవన్ రామ్ సాయుధ దళాలకు ప్రత్యేక గౌరవం ఇచ్చి దేశ రక్షణలో అందరినీ భాగస్వాములను చేశారని పేర్కొన్నారు. ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేందర్ గౌడ్, ఆర్ఐలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సైబరాబాద్‌లో వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 205 మందిపై కేసులు



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 05 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో యధావిధిగా శనివారం రాత్రి నుండి ఆదివారం తెల్లవారుజాము వరకు వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌ను సైబరాబాద్ కమిషనరేట్ ట్రాఫిక్ విభాగం డిసిపి రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు నిర్వహించారు. ప్రతివారం డ్రంకెన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం కొనసాగుతున్నా మందుబాబులు షరా మామూలే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం 205 మందిపై కేసు నమోదు కావడం జరిగింది. ఈ సందర్భంగా సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం డిసిపి రంజన్ రతన్ కుమార్ ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడిస్తూ శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ విభాగం పోలీసుల వీకెండ్ స్పెషల్ డ్రైవ్‌ను విస్తృతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాల నడుపుతున్న వ్యక్తులు మొత్తం 205 మంది వాహనదారులు, వ్యక్తులు మోతాదుకు మించి మద్యాన్ని సేవించి పట్టుబడగా ఇందులో 170 మంది ద్విచక్ర వాహనాల డ్రైవర్లు, 08 మంది ఆటో రిక్షా డ్రైవర్లు, త్రీ వీలర్ వాహనదారులు కాగా 27 మంది కార్లను, ఇతర ఫోర్ వీలర్‌లను నడుపుతున్న డ్రైవర్లు ఉన్నట్లు డిసిపి తెలిపారు. ఇందులో 190 మంది బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ తో పట్టుబడడం జరిగిందని, దీనిని కనిష్టంగా 356ఎంజి/100 ఎంఎల్ నుండి 200 ఎంజి/100 ఎమ్మెల్ వరకు, 12 మంది 201 ఎంజి/100 ఎమ్ఎల్ నుండి 300 ఎంజి/100 ఎం ఎల్ మద్యం సేవించడం జరిగిందని, అలాగే 03 మంది 301 ఎంజి/100 ఎమ్మెల్ నుండి 500 ఎంజి/100 ఎమ్మెల్ వరకు మద్యాన్ని సేవించి పట్టుబడడంపట్ల ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. పట్టుబడిన వారందరినీ కోర్టులో ప్రవేశపెట్టగా మొత్తం 47 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోర్టులు పరిష్కరించడం జరిగిందన్నారు.

# ఎట్టకేలకు మార్చురీ వద్ద మంచి నీళ్లు

**'మార్చురీ వద్ద మంచినీళ్లు కరువు' వార్తకు స్పందన..**







**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 5 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న మార్చురీ వద్ద మంచినీళ్లు కరువు అనే కథనం నల్లగొండ జిల్లా జనం సాక్షి ప్రతినిధి ఓడపల్లి మధు రాయడం తో స్పందించిన ఆసుపత్రిలో ని సూపరిండిట్ అలాగే డిప్యూటీ సూపరిండిట్ చొరవతో మార్చురీ వద్ద ఎన్నో ఏండ్లుగా ఉన్న బాధ ఒక్క జనం సాక్షి వార్త కథనం తో వచ్చిన వారికి నీళ్లు అందించే వి ధంగా వాటర్ ప్యూ రిఫైర్ ఏర్పటు చేశారు ఇదే విషయమై నల్లగొండ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. జనంసాక్షికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఎన్నో ఏండ్లుగా ఎవరు కూడా ఈ సమస్య ని గుర్తించలేదు అని ఒక్క జనం సాక్షి మాత్రమే గుర్తించి ఈ నీటి సదుపాయం ఏర్పాటులో కీలక పాత్ర పోషించింది అని ప్రజలు తెలిపారు.అలాగే అక్కడ కూర్చోవడానికి ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.


మార్చురీ వద్ద మంచినీళ్లు కరువు
• కలెక్టర్ స్పందించేనా...

# ఫొటో జర్నలిజం ప్రజాస్వామ్యానికి కళ్లు

**మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు**





**హైదరాబాద్ (జనంసాక్షి) :** జర్నలిజం ఒక మహావృక్షమైతే అందులో ఫొటో జర్నలిస్టులు ప్రాణం లాంటి వారని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. ఫొటో జర్నలిజం ప్రజాస్వామ్యానికి కళ్ల లాంటిదని, దీనిని అందరూ కాపాడుకోవాలని సూచించారు. ఆదివారం రాష్ట్ర ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 23వ ఉత్తమ ఫొటో జర్నలిస్ట్- 2025 అవార్డుల ప్రధానోత్సవ' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రిపోర్టర్ కలం పెడితే, ఫొటో జర్నలిస్టు కళను బందిస్తారన్నారు. తాను 1964లో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నప్పటి నుంచి ఫొటో జర్నలిస్టులతో అనుబంధం ఉందన్నారు. ప్రపంచంలో భాషాలు ఎన్నైనా ఉండొచ్చు కానీ, ఏ భాషతో సంబంధం లేకుండా ఉండేది కేవలం ఫొటోగ్రఫీ మాత్రమేనని గుర్తు చేశారు. వంద మాటల పెట్టు ఒక ఫొటో రూపం అని అభివర్ణించారు. ఒక వ్యాసం చెప్పలేని భావాన్ని ఒక ఫొటో చెబుతుందన్నారు. అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గతంతో పోల్చితే ప్రస్తుత జర్నలిజంలో చాలా మార్పులు వచ్చాయన్నారు. ప్రస్తుత ఏఐ టెక్నాలజీ అన్ని రంగాలకు చాలా ఉపయోగక రంగా మారిందని, ముఖ్యంగా వైద్య రంగంలో చాలా మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. ఫొటో జర్నలిస్ట్ కూడా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని, ప్రస్తుత ఏఐ రంగంలో ఎలా ముందుకెళ్లాలో చర్చించుకుం దామని సూచించారు. ఈకార్యక్రమంలో ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఐఎన్‌టి యుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ళ రాజిరెడ్డి, ఐజెయు జాతీయ ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, ,టియు డబ్లుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాంనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు ఫొటోగ్రఫీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఫొటోజర్నలిస్టుల ప్రథమ బహుమతిని ఇందు శ్రీనివాస్(ఈనాడు, నిజామాబాద్), రెండవ బహుమతి ఎ.క్రిష్ణ (హాన్స్ ఇండియా, హైదరాబాద్), తృతీయ బహుమతి జి.బాలస్వామి (సాక్షి,హైదరాబాద్) లకు బహుమతులు అందజేశారు. మరో పది మంది ఫొటో జర్నలిస్టులు ఎన్.రాజేష్ (సాక్షి,హైదరాబాద్),జి.శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ, హైదరాబాద్), ఎ.జాన్ (సాక్షి, హైదరాబాద్),ఆర్.రాజు(సాక్షి,ఖమ్మం),పి.వాసప్రసాద్(సాక్షి,వరంగల్), ఎం.శ్రీనివాస్(ది హన్స్ ఇండియా,నల్లగొండ), జి.వేణుగోపాల్ (సాక్షి, జనగాం), ఎం.అనిల్ కుమార్ (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్), వీరగోని. రాజనికాంత్ గౌడ్ (నమస్తే తెలంగాణ, హైదరాబాద్), ఎ.జ్వల కోటేశ్వర్ రావు (ఆంధ్రజ్యోతి, హైదరాబాద్), అందజేశారు.

# దేశంలోనే తెలంగాణ హైకోర్టు అత్యుత్తమం

## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

- తెలంగాణ గడ్డపై న్యాయ స్ఫూర్తి విరాజిల్లాలి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్-2 భవన నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి, జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన




**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశంలోనే నూతనంగా నిర్మిస్తున్న తెలంగాణ హైకోర్టు భవన సముదాయం అత్యుత్తమంగా నిలుస్తుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జోన్-2 భవన నిర్మాణా పనులకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేసారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ ఎస్.వి. భట్టి,జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ,జస్టిస్ పి.ఎస్. నరసింహ, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణా రావు, డీజీపీ శివధర్ రెడ్డి హాజరయ్యారు. హై కోర్టు భవన నమూనా ఫోటో ప్రదర్శనను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తిలకించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు సముదాయం దేశంలోనే అత్యుత్తమ హైకోర్టుగా నిలుస్తుందని అన్నారు. కోర్టు గదులు, పరిపాలనా భవనాలు, ఆర్కైవ్స్, నివాస మౌలిక సదుపాయాలు, శిక్షణా సౌకర్యాలు అన్నీ ఒకే ప్రాంగణంలో సమగ్రంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ ఇక్కడ తన సొంత నిబంధనల ప్రకారం, తన సొంత పరిధిలో పనిచేస్తుంది. మనం సిద్ధాంతం నుండి ఆచరణలోకి మారినప్పుడు సంస్థాగత స్వయం సమృద్ధి ఇలాగే ఉంటుంది," అని ఆయన అన్నారు. ఈ ఆడిటోరియంలో జిల్లా న్యాయవ్యవస్థ కోసం న్యాయ సదస్సు శిక్షణా కార్యక్రమాలు, పౌరుల కోసం న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. "నేర్చుకోవడం మానేసిన న్యాయవ్యవస్థ పరిణామం చెందడం కూడా ఆపేస్తుంది. నేను దేశవ్యాప్తంగా దీనిని చూశాను మరియు ఈ సంప్రదాయాన్ని బలంగా, దృఢంగా సమర్థిస్తున్నాను," అని ఆయన అన్నారు. మూడు అంతస్తులలో రూపొందించిన సెంట్రల్ రికార్డ్ రూమ్ కూడా అంతే ముఖ్యమైనదని ఆయన పేర్కొన్నారు. "సంస్థాగత స్మృతి అనేది ఒక విలాసం కాదు. అది న్యాయపరమైన తార్కికతలో స్థిరత్వానికి పునాది. చక్కగా భద్రపరచబడిన మరియు అందుబాటులో ఉన్న పూర్వ తీర్పులు, ఆ తర్వాత వచ్చే ప్రతి తీర్పును బలోపేతం చేస్తాయి. దీనికి తగినంత ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఇవ్వడం చూసి నేను సంతోషిస్తున్నాను," అని ఆయన అన్నారు." ఆ చిత్తశుద్ధి, గంభీరత ప్రణాళికలోని మరో అంశంలో కూడా కనిపిస్తున్నాయి. సుస్థిరమైన మౌలిక సదుపాయాలను మొదటి నుంచే డిజైన్‌లో పొందుపరిచారు. తరతరాల న్యాయమూర్తులకు, వ్యాజ్యదారులకు సేవలందించే ప్రాంగణం, అది ఉన్న భూమిని గౌరవించాలి," అని సీజేఐ అన్నారు. కొత్త భవనం కోసం 100 ఎకరాలు కేటాయించడమే కాకుండా, ఈ ప్రాజెక్టుకు రూ. 2,500 కోట్లకు పైగా మంజూరు చేసినందుకు ఆయన తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే 100 ఏళ్ల పాటు సేవలందించేలా రూపొందించబడిన ఈ కొత్త హైకోర్టు ప్రాంగణం రెండేళ్లలో పూర్తవుతుంది. 2024లో శంకుస్థాపన జరిగిన జోన్-1 పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, జోన్-2 ఒక న్యాయస్థానం అంత ముఖ్యమైనదిగా ఉంటుందని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై న్యాయ స్ఫూర్తి విరాజిల్లాలని, అన్ని వర్గాల ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే 'న్యాయ దేవాలయం'గా కొత్త హైకోర్టు నిలుస్తుందని అన్నారు. సామాన్య పౌరుడికి కోర్టు చివరి ఆశ్రయమని, అలాంటి పవిత్ర ప్రాంగణాన్ని నిర్మించే అవకాశం తమ ప్రభుత్వానికి దక్కడం చరిత్రాత్మకమని అభిప్రాయపడ్డారు. రాబోయే వంద ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థల మధ్య పరస్పర గౌరవమే లక్ష్యంగా ఈ భారీ నిర్మాణాన్ని చేపట్టినట్లు ప్రకటించారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తీసుకున్న కీలక నిర్ణయాల్లో భాగంగా 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే జోన్-1 పనులు శరవేగంగా సాగుతున్నాయని, నేడు శంకుస్థాపన చేసిన జోన్-2 నివాస సముదాయాలను కూడా డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. దేశంలోనే అత్యంత ఆధునిక ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న ఈ సముదాయం తోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 49 కోర్టుల నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని వెల్లడించారు. న్యాయవ్యవస్థ ఇచ్చే తీర్పులకే కాకుండా వారి అమూల్యమైన అభిప్రాయాలకు కూడా తమ ప్రభుత్వం అత్యున్నత విలువ ఇస్తుందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ నగర కీర్తి కిరీటంలో మరో మణిహారంగా నిలిచే ఈ అద్భుత కట్టడం, భవిష్యత్ తరాలకు న్యాయ విజ్ఞాన కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాకుండా, ప్రజలందరికీ త్వరితగతిన న్యాయం అందించే స్ఫూర్తిని బలోపేతం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ సెక్రెటరీ వికాస్ రాజ్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ జి కర్ణన్, జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి, ఆర్డీవో రాజేంద్రనగర్ వెంకట్ రెడ్డి తహసిల్దార్ రాములు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు



# సమాచార హక్కు చట్టానికి తూట్లు...

- ముులుగు జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం..?
- సమాచారం ఇవ్వటానికి కొర్రీలు పెడుతున్న రెవెన్యూ శాఖ
- సమాచార హక్కు చట్టాన్ని భ్రష్టు పట్టిస్తున్న పంచాయతీ శాఖ
- ఇదే బాటలో జిల్లా సివిల్ సప్లై, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ
- 30 రోజులు గడిచినా కోరిన సమాచారం సరిగా అందజేయడం లేదని ధరఖాస్తుదారుల ఆగ్రహం
- ప్రజల హక్కులను పట్టించుకోని శాఖలపై విమర్శల వెల్లువ
- జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని వినతి




**ములుగు బ్యూరో, ఏప్రిల్ 5 (జనంసాక్షి):** ప్రజలకు ప్రభుత్వంపై ప్రశ్నించే హక్కు కల్పించే "సమాచార హక్కు చట్టం--2005" ను ములుగు జిల్లాలోని పలు శాఖలు నిర్లక్ష్యంగా తీసుకుంటు న్నాయన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. చట్ట ప్రకారం ధరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని 30 రోజుల లోపే ఇవ్వాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అధికారులు పలు కారణాలు చూపుతూ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచుతున్నారని బాధితులు మండిపడుతున్నారు.

### సమాచారం ఇవ్వటానికి కొర్రీలు పెడుతున్న రెవెన్యూ శాఖ

జిల్లాలోని రెవెన్యూ శాఖ సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడంలో విఫలమవుతున్నాయని ఆరోపణలు, ఆధారాలు బలంగా ఉన్నాయి. దరఖాస్తులు ఇచ్చి 30 రోజులు దాటినా సమాచారం ఇవ్వకపోవడం, ఒకవేళ ఇచ్చిన అరా.. కొరా సమాచారం ఇచ్చి చేతులు దులుపుకోవడం, దరఖాస్తుదారుడు కోరిన సమాచారంను స్పష్టంగా ఇవ్వకుండా దరఖాస్తుదారులను రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిప్పించడం ప్రజాస్వామ్య హక్కులను రెవిన్యూ శాఖ అధికార యంత్రాంగం కాలరాస్తున్నట్లే అని సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కోవలోకి జిల్లా సివిల్ సప్లై శాఖ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, జిల్లా పంచాయతీ శాఖ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలు కూడా చేరతాయని బాధితులు అంటున్నారు.

## ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలపై రేణూదేశాయ్ వార్నింగ్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలపై నటి రేణు దేశాయ్ తీవ్రంగా స్పందించారు. అకారణంగా బూతులు తిట్టే నెటిజన్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేస్తూ, చట్టపరమైన చర్యలు తప్పవని ఘాటుగా హెచ్చరించారు. ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసుల సహకారంతో పలువురిని అరెస్ట్ చేయించిన ఆమె, తాజాగా మరోసారి వీడియో ద్వారా స్ట్రాంగ్ మెసేజ్ ఇచ్చారు.గతంలోనే సోషల్ మీడియా వేదికగా హెచ్చరించిన రేణూ దేశాయ్, చెప్పినట్లుగానే చర్యలకు దిగారు. తనపై దూషణలు చేసిన పలువురు నెటిజన్లపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇప్పటికే ఆరుగురికి పైగా వ్యక్తులను అరెస్ట్ చేశారు. "ఇక ఇది మొదట మాత్రమే.. ఇక్కడితో ఆగదు" అంటూ ఆమె స్పష్టం చేశారు.

పోలీసుల విచారణలో బయటపడిన విషయాలు ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. కొందరు కేవలం సోషల్ మీడియాలో ఫేమస్ కావాలనే ఉద్దేశంతోనే సెలబ్రిటీలపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఒప్పుకున్నారని సమాచారం.

# మహనీయుడు బాబూ జగ్జీవన్‌రాం

## దేశ సేవే పరమ ధర్మంగా భావించి ఆచరించిన నాయకుడు

- చనిపోయేదాకా ఎంపీగా కొనసాగిన నేత
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- బాబూ జగ్జీవన్ రామ్ కు ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి
- కరీంనగర్ మేయర్ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించిన బండి సంజయ్




**కరీంనగర్ (జనంసాక్షి) :** భారత రాజకీయ చరిత్రలో సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత నాయకుడు, దళిత జాతి రత్నం బాబూ జగ్జీవన్ రామ్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. కేంద్రంలో 29 ఏళ్లపాటు మంత్రిగా కొనసాగిన బాబూ జగ్జీవన్ రామ్ దేశ సేవే పరమ ధర్మంగా భావించి ఆచరించి చూపారని తెలిపారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని ఈరోజు ఉదయం కరీంనగర్ లోని మంచిర్యాల చౌరస్తా వద్దనున్న ఆయన విగ్రహానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతోపాటు పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. "చిన్నప్పటి నుండి కుల వివక్షను ఎదుర్కొని పోరాడిన నాయకుడు జగ్జీవన్ రాం. అంటరానివారి శ్రేయస్సు కోసం తన జీవితాన్ని చివరిదాకా అంకితం చేసిన నాయకుడు. 1.కష్టాలను జయించి ఎదగాలి. 2.సమాజంలోని బలహీన వర్గాల కోసం నిలబడాలి. 3.దేశ సేవే మన పరమ ధర్మం అనే మూడు నినాదాలను పుణికి పుచ్చుకుని జీవితాంతం వాటి కోసం పాటుపడిన నాయకుడు జగ్జీవన్ రామ్" అని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశంలో తొలి ఎన్నికలు జరిగిన 1952 నుంచి ఆయన చనిపోయే 1986 వరకూ పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన జగ్జీవన్ రామ్ కేంద్రంలో 29 ఏళ్లపాటు మంత్రిగా సేవలందించారని గుర్తు చేసుకున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ గాంధీ వెన్నంటి నడిచిన జగ్జీవన్ రామ్ భారత రాజకీయ, సామాజిక రంగాల్లో అజాతశత్రువుగా నిలిచారని తెలిపారు. జగ్జీవన్‌రామ్ అనుసరించిన ఆదర్శాలు.. చూపిన సంస్కరణ మార్గాలనూ నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

### మేయర్ క్యాంపు కార్యాలయ ప్రారంభం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు మధ్యాహ్నం కరీంనగర్ లోని తీగలగుట్టపల్లిలో మేయర్ కొలగాని శ్రీనివాస్ ఏర్పాటు చేసిన మేయర్ క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, నాయకులు కేంద్ర మంత్రిని గజమాలతో సత్కరించారు. క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ సునీల్ రావుతోపాటు బీజేపీ కార్పొరేటర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు.

# చెట్టులెక్కగలనోయ్.. కరెంటు కంబలెక్కగలమోయ్..

**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** చెట్టు లెక్కగలనోయ్ మేము కరెంటు కంబలెక్కగలమోయ్ అంటూ గబగబ ఓ కరెంటు కంబను అమాంతంగా ఎక్కేస్తుంది కదూ ఈ పక్షి. దీని పేరు రెడ్ ఫ్లేమ్ బ్యాక్ ఉడ్ పీకర్ ఇవి ఎక్కువగా మనుషులకు కనిపించకుండా దూరంగా అడవుల్లో సెచ్చగా తిరుగుతుంటాయి. ఇవి ఎంత పెద్ద చెట్టు ఉన్న సరే తన పొడవాటి గోర్లతో కింది నుంచి పై వరకు చెట్టును పరీక్షిస్తూ చెట్టు బెరడును తన పొడవాటి ముక్కుతో చెక్కుతూ చెట్టు బెరడు లో ఉన్న చిన్న చిన్న కీటకాలను తింటూ రయ్ మని ఎగిరిపోతుంటాయి. వీటి కూత వింతగా ఉంటుంది. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ పక్షులు అడవి మార్గాల్లో అక్కడక్కడ కనిపించే పొడవాటి కరెంటు కంబలను చక చక ఎక్కేస్తుంది. అన్నట్టు ఈ పక్షులు ఇప్పుడు చాలా తక్కువ సంఖ్యలో కనిపిస్తున్నాయి. ఈ దృశ్యాన్ని వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆదివారం జన్నారం లోని కవ్వాల్ పులుల అభయారణ్యంలో తన కెమెరాలో బంధించాడు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370